ప్రభాత
ఆదివారం
వెలుగు
06.01.2019
www.v6velugu.com
హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 321 పేజీలు: 12+12+12+12 | ₹6
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL

17 నుంచి అసెంబ్లీ

రాష్ట్ర అసెంబ్లీ తొలి సమావేశాలకు ముహూర్తం కుదిరింది. ఈ నెల 17 నుంచి నాలుగు రోజుల పాటు శాసనసభ సమావేశం కానుంది. ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఎంపికయ్యారు. 17న కొత్త ఎమ్మెల్యేలతో ఆయన ప్రమాణస్వీకారం చేయించనున్నారు. అదే రోజు స్పీకర్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. 18న స్పీకర్ ఎన్నిక జరగనుంది. 19న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన అనంతరం సభ వాయిదా పడనుంది.


03



టాకీస్

విద్య చూపు సౌత్ వైపు

ఎన్టీఆర్ బయోపిక్‌తో టాలీవుడ్‌లో అడుగు పెట్టిన విద్యాబాలన్ త్వరలో కోలీవుడ్‌లోకి కూడా ఎంటర్ అవనుంది



09

దేశం-విదేశం

ఎమర్జెన్సీ పెడతా.. గోడ కడతా!

దేశ భద్రత కోసం దేనికైనా సిద్ధమని, మెక్సికో బోర్డర్‌లో గోడ కట్టితీరతామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



05

బిజినెస్

స్మార్ట్ ఫోన్ కొంటరా?

ఫిబ్రవరి 1 నుంచి కొత్త ఈకామర్స్ పాలసీ రానుండటంతో పాత స్మార్ట్‌ఫోన్ స్టాక్ క్లియరెన్స్‌కు భారీ ఆఫర్లు ఇవ్వనున్న కంపెనీలు



10

జనరల్

మే 3 నుంచి ఎంసెట్

8 ప్రవేశపరీక్షల షెడ్యూల్ విడుదల.. పాత యూనివర్సిటీలకే నిర్వహణ బాధ్యతలు.. ఏప్రిల్ నెలాఖరులో నోటిఫికేషన్లు జారీ అయ్యే అవకాశం



02

పొలిటికల్

రేపటి నుంచే 'పంచాయతీ'

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రేపటి నుంచి నామినేషన్లు ప్రారంభం కానున్నాయి.



03



ఫైల్ ఫొటో

యంగ్ లీడర్స్

విలేజ్ పాలిటిక్స్‌ల యూత్ యాక్టివ్ అయితున్నది. పెద్ద చదువులు, పెద్ద నౌకరీలు ఇడ్సిపెట్టి ఊరు తొవ్వ తొక్కుతున్నది. ఊరిని దురస్తు చేయాల్నంటే సర్పంచ్‌గిరి చేతులుండాలని పంచాయతీ పోటీలకు రెడీ అంటున్నది. అన్ని ఊళ్లల యూత్ హల్చల్ కనిపిస్తున్నది.

పంచాయతీ ఎన్నికల్లో పోటీకి యువత సన్నాహాలు	సర్పంచులై పల్లెను బాగుజేసుకోవాలనే ఆరాటం	టీమ్‌గా ఏర్పడి.. సర్పంచ్ పదవికి, అన్ని వార్డులకు పోటీ
అందరూ బాగా చదువుకున్నవారే..	ఉద్యోగాలు వదిలి వస్తున్న వారెందరో	వారికి ఊర్లలో పెరుగుతున్న మద్దతు

హైదరాబాద్, వెలుగు: ఊరి బాగు కోసం యూత్ ఏకమవుతున్నరు. చదువుకున్నోళ్లు, యువకులు సర్పంచ్ అయితే ఊరు బాగుపడుతదని ఆలోచనలు చేస్తున్నరు. మనలోనే ఒకరిని సర్పంచును చేసుకుందామని, పల్లెను బాగు చేసుకుందామని ముందుకొస్తున్నరు. ఇందుకోసం పెద్ద ఉద్యోగాలూ వదిలి వస్తున్నరు. అందరం కలసి పంచాయతీ ఎన్నికల్లో గెలుద్దామనుకుంట తోటి వాళ్లను, ఊళ్లోని యువతను కలుపుకొని పోతున్నరు. ఇంతకు ముందెన్నడూ లేనంతగా యువత ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతుండటంతో గ్రామ పంచాయతీ ఎన్నికలకు 'యువ'కళ వచ్చేసింది.

ఉద్యమం నాటి నుంచి..

తెలంగాణ ఉద్యమంలో ముందు నిలిచిన యువత, విద్యార్థులు 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో పోటీ చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలిచారు. తర్వాతి ఏడాది జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ రాజకీయ పార్టీల తరఫున బరిలోకి దిగి ఎమ్మెల్యేలు, ఎంపీలుగానూ గెలిచారు. తర్వాత కొందరు రాజకీయాల్నే కెరీర్‌గా మల్చుకుంటే, మరికొందరు మామూలుగా ఉండిపోయారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలతో మళ్లీ యువ ఉత్సాహం కనిపిస్తోంది. తమ ఊళ్లను బాగు చేసుకునేందుకు, ఇప్పుడున్న రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా యువత పంచాయతీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. వారిలో అత్యధికులు డిగ్రీలు, పీజీలు, వృత్తి విద్యా కోర్సులు చదివిన వారే ఉండడం గమనార్హం. అలాంటి వారికి గ్రామాల యువత నుంచి పెద్ద ఎత్తున మద్దతు కూడా లభిస్తోంది. కొన్ని గ్రామాల్లో యువత బృందాలుగా ఏర్పడి.. సర్పంచు నుంచి వార్డు మెంబర్ వరకూ తమ బృందంలోని సభ్యులనే పోటీకి దింపుతున్నారు. పెద్దపల్లి జిల్లా రొంపికుంటలో ఇదే విధంగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నామని అక్కడి యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ చెప్పారు. గెలిస్తే ఊరు కోసం చేయాల్సిన పనులను ముందే తీర్మానించుకున్నామని తెలిపారు.

మిగతా 4లో...

నాయకులు కమీషన్ల కోసం పనిచేస్తున్నరు



నేను హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో ఎల్ఎల్‌బీ చదువుతున్న. హైదరాబాద్‌కు 46 కిలోమీటర్ల దూరంలో ఉన్న మా తక్కళ్లపల్లి తండా ఇటీవలే పంచాయతీగా మారింది. మా ఊరు చుట్టూ ఉన్న కోళ్లఫారాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నం. ఇక్కడ నాయకులుగా చెలామణి అవుతున్నవాళ్లు కమీషన్లు తీసుకుని ఫారాల యజమానులకు సహకరిస్తున్నరు. పవర్‌ప్లాంటుతోనూ సమస్యలున్నాయి. స్కూలు ఉన్నా పిల్లలు చదువుపై ఆసక్తి చూపడం లేదు. తల్లిదండ్రులను చైతన్య పరిచి, పిల్లలను బడి వైపు మళ్లించాలి. ప్రభుత్వ పథకాలు గ్రామస్తులకు అందజేయాలె. నేను పోటీకి సిద్ధమవుతుంటే.. విరమించుకోవాలని ఒత్తిడి చేస్తున్నరు.

- విజయ్‌నాయక్, రంగారెడ్డి

అవినీతి పోవాలంటే యువత రావాలె



మాది రామగిరి మండలంలో కొత్తగా పంచాయతీగా మారిన రాజాపూర్ గ్రామం. 900 ఓట్లున్న మా పల్లెలో అధికశాతం యువ ఓటర్లే. ఇప్పుడున్న రాజకీయ నాయకుల్లో చాలా మంది కాంట్రాక్టుల కోసం, రాజకీయాల కోసం పదవులను వాడుకుంటున్నవారే. చదువుకున్నవారు, యువత రాజకీయాల్లోకి రావాలి. అప్పుడే దేశం అవినీతి రహితమవుతుంది. నేను ఎంబీఏ పూర్తి చేశా. ఇక్కడి యువత, నా స్నేహితుల మద్దతులో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నాను. నేను గెలిస్తే.. ఊళ్లో మూతబడి ఉన్న పాఠశాలను తెరిపిస్తా. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణను గ్రామీణ విద్యార్థులకు చేరువ చేస్త.

- మాటేటి రాజబాపు, పెద్దపల్లి జిల్లా



03

పొగడ్తలు తప్ప పైసలేవి?

మోడీ బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రధానా?

రాష్ట్రంపై కేంద్రం వివక్ష ▪ పోరాటం ఆపబోం: కేటీఆర్

'ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్‌కీబాత్ సందర్భంగా తెలంగాణలోని మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు బాగున్నాయని చెప్పారు. 2016లో నాటి నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియా భగీరథకు రూ.19,205 కోట్లు, కాకతీయకు రూ.5 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశారు. వీటిపై మొన్న పార్లమెంట్‌లో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నిస్తే ఆ సిఫార్సులను రద్దు చేశామని కేంద్ర మంత్రి చెప్పారు. ఇదేం పద్ధతి?. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోంది. ఇక్కడి పథకాలను ప్రశంసిస్తున్నారు తప్ప నిధులు ఇవ్వడం లేదు. కేంద్రం తీరు మార్చుకోకుంటే రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో బీజేపీ డిపాజిట్ కోల్పోక తప్పదు'

- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేసీఆర్ ఎంపీగా పోటీ చేయరు

కేబినెట్‌లో ఎవరుంటరో నాకు తెలియదు
కాంగ్రెస్ పార్టీ క్రైసిస్‌లో ఉంది
మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్

03

16 ఎంపీ సీట్లు టీఆర్ఎస్‌కే!

వీడీపీ అసోసియేట్స్ తాజా సర్వే
మెజార్టీకి ఎన్డీయే దూరమేనని అంచనా

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారాన్ని సొంతం చేసుకున్న టీఆర్ఎస్ పార్టీనే.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటనుందట. రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో 16 సీట్లు కారు ఖాతాలోనే పడతాయట. వీడీపీ అసోషియేట్స్ తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే తిరిగి పవర్‌లోకి రావడం కష్టమేనని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏకు కూడా అంత సీన్ లేదని తేలింది. ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలే కీలకంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. దేశవ్యాప్తంగా 542 లోక్‌సభ స్థానాలపై వీడీపీ అసోసియేట్స్ సంస్థ డిసెంబర్ 20 నుంచి జనవరి 2 వరకు ఒపీనియన్ పోల్స్ నిర్వహించింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీ అధికారంలోకి వస్తుందని సర్వే చేపట్టింది. ఆ వివరాలను శనివారం తన ట్విట్టర్ ఖాతాలో ప్రకటించింది.

02



వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
87.00	87.00	87.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
87.00	87.00	86.00



11

అయినా.. మన చేతుల్లోనే!

సిడ్నీ టెస్ట్‌లో పోరాడుతున్న ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్

ఆసీస్‌తో నాలుగో టెస్ట్‌లో టీమిండియా జోరు కొనసాగుతోంది. మనోళ్ల పేస్, స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు కంగారులు పోరాడుతున్నారు. కుల్దీప్, జడేజా మాయాజాలంతో ఆసీస్ ఇప్పటికే ఆరు వికెట్లు కోల్పోయింది. ఆసీస్ బ్యాట్స్‌మన్ పోటీ ఇచ్చే ప్రయత్నం చేసినా ఇంకా 386 పరుగులు వెనకబడే ఉన్నారు. చివరి రెండు రోజుల్లో పిచ్ స్పిన్‌కు మరింత అనుకూలిస్తుంది. నాలుగో రోజు ఉదయమే మిగతా నాలుగు వికెట్లు కూల్చేసి ఆసీస్‌ను ఫాలోఆన్‌లో పడేసేందుకు కోహ్లీసేన వ్యూహాలు రచిస్తోంది. అయితే ఆదివారం వర్ష సూచనలు ఉండటం టీమిండియాను టెన్షన్ పెడుతోంది.



'సూపర్' వేగంతో 'బూమ్ సోనిక్'

ఫైటర్ జెట్లకే పరిమితమైన సూపర్ సోనిక్ వేగం, సాధారణ విమానాలకూ రానుంది. మామూలు విమానాల్లో బిజినెస్ క్లాస్‌కు ఎంత ఖర్చవుతుందో, అదే రేటులో 'బూమ్ సోనిక్' విమానం తక్కువ సమయంలో గమ్యాన్ని చేర్చగలదు. ధ్వనికి 2.2 రెట్ల వేగంతో దూసుకెళ్లే ఈ జెట్‌ను ఈ ఏడాదే టెస్ట్ చేయనున్నారు. ప్రస్తుతం రెండు సీట్లతో ఉన్న ప్రొటోటైప్‌ను రూపొందిస్తున్నారు. టెక్నాలజీ తయారీ పూర్తైతే పూర్తి జెట్‌ను తయారు చేస్తారు. ఇందులో 55 మంది ప్రయాణించొచ్చు.



278 కేజీలు.. 21 కోట్లు

వేలంలో ట్యూనా చేపకు రికార్డు ధర


టోక్యో: గోదావరిలో దొరికే పులస చేప రేటు కిలో రూ.వెయ్యి రెండు వేలు అంటేనే అమ్మో అనుకుంటాం.. కానీ జపాన్‌లో ఓ చేప రేటు ఏకంగా రికార్డు స్థాయిలో కోట్లు పలికింది. 278 కేజీల భారీ బ్లూఫిన్ ట్యూనా చేపను 31 లక్షల అమెరికా డాలర్ల(మన కరెన్సీలో 21.5 కోట్ల)కు కొనుగోలు చేశాడు సుషీ రెస్టారెంట్ల ఓనర్ కియోషి కిమురా. అత్యంత రుచికరమైన ఈ ట్యూనా చేపలను టోక్యో టొయోసు మార్కెట్‌లో ఏటా న్యూఇయర్ సందర్భంగా వేలం వేస్తుంటారు. 2013లోనూ కిమురానే 155 మిలియన్ యన్‌లు(రూ.9 కోట్లు) చెల్లించి ట్యూనా చేపను దక్కించుకున్నారు. ఈసారి దానికి రెట్టింపు ధర కంటే ఎక్కువ పలికింది.



కుంభమేళాకు రాహుల్

కుటుంబ పెద్దల బాటలో కాంగ్రెస్ చీఫ్

లక్నో: రాహుల్ గాంధీ తన కుటుంబ పెద్దల తరహాలోనే ఈసారి ప్రయాగ రాజ్ లో జరిగే అర్ధ కుంభమేళాకు హాజరుకానున్నారు. “ఆచారాలు,సంప్రదాయాలు పాటించడంలో రాహుల్ ఎప్పుడూ ముందుంటారు. ఆయన ముత్తాత జవహర్ లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరా గాంధీ, తల్లి సోనియా గాంధీ కూడా గతంలో కుంభమేళాకు హాజరయ్యారు. ఈ సంప్రదాయాన్ని పాటిస్తూ ఈసారి రాహుల్ కూడా కుంభమేళాకు వెళతారు ” అని కాంగ్రెస్ ప్రతినిధి నదీమ్ జావెద్ అన్నారు. మరికొన్ని నెలల్లో లోక్ సభ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో కుంభమేళాకు రాహుల్ హాజరవడం వల్ల గెలుపు అవకాశాలు మెరుగుపడతాయని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. కాగా కుంభమేళాకు రాహుల్‌ను ఆహ్వానిస్తూ ఉత్తరప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సిద్ధార్థ్ నాథ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాఫెల్ డీల్ పై అబద్ధాలాడినందుకు చుట్టుకున్న పాపాలను గంగలో మునిగి ప్రక్షాళన చేసుకోవాలని సింగ్ కామెంట్ చేశారు.



వృద్ధులు, దివ్యాంగులకు 8న టోకెన్లు: టీటీడీ

తిరుమల, వెలుగు: తిరుమల శ్రీవారి దర్శనం కోసం దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఈ నెల 8న 4 వేల టోకెన్లు జారీ చేస్తామని టీటీడీ శనివారం ప్రకటించింది. ఉదయం 10 గంటల స్లాట్‌కు వెయ్యి, మధ్యాహ్నం 2 గంటలకు 2 వేలు, మధ్యాహ్నం3 గంటల స్లాట్‌కు మరో వెయ్యి టోకెన్లు ఇవ్వనున్నారు. ఐదేళ్లలోపు చంటి పిల్లలున్న తల్లిదండ్రులకు ఈ నెల 9న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒకటిన్న వరకు సుపథం మార్గం ద్వారా దర్శనానికి అనుమతిస్తారు. సాధారణ రోజుల్లో ఏడాదిలోపు చంటిపిల్లలున్న తల్లిదండ్రులకే సుపథ మార్గం ద్వారా దర్శనం ఉంటుంది.

మే 3 నుంచి ఎంసెట్

- ఎనిమిది ఎంట్రన్స్‌ల షెడ్యూల్ విడుదల
- పాత వర్సిటీలకే నిర్వహణ బాధ్యతలు
- ఏప్రిల్ నెలాఖరులో నోటిఫికేషన్లు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి శనివారం షెడ్యూల్ విడుదల చేశారు. మే 3 నుంచి 9 వరకు ఎంసెట్ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. మే 3, 4, 6 తేదీల్లో ఇంజనీరింగ్ ప్రవేశాలకు, మే 8, 9 తేదీల్లో అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మొత్తంగా ఎంట్రెన్స్ పరీక్షలు మే 3న ఎంసెట్‌తో ప్రారంభమై, మే 31న ఎడ్‌సెట్‌తో ముగుస్తాయన్నారు.

వరుసగా ఎగ్జామ్స్

ఈ ఏడాది జాతీయస్థాయి ప్రవేశపరీక్షలను దృష్టిలో పెట్టుకొని, రాష్ట్రంలో పరీక్షల షెడ్యూల్ రూపొందించినట్టు పాపిరెడ్డి తెలిపారు. ఐదు రోజుల పాటు ఎంసెట్ పరీక్ష ఉంటుందని, మే 5న నీట్ పరీక్ష నేపథ్యంలో ఆ రోజు పరీక్షలకు గ్యాప్ ఇచ్చామని వెల్లడించారు. గతేడాది ప్రవేశపరీక్షలు నిర్వహించిన యూనివర్సిటీలకే.. ఈసారి నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. త్వరలో సెట్స్ కమిటీలు ఏర్పాటు చేసి, ఏప్రిల్ నెలాఖరులో నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. సెట్స్ కన్వీనర్ల నియామకం కోసం మూడు పేర్లను ప్రతిపాదించాలని ఆయా వర్సిటీలకు త్వరలో లేఖలు రాస్తామన్నారు.

ఎంట్రన్స్ పరీక్షల తేదీలివే

సెట్	తేదీ	నిర్వహించే వర్సిటీ
ఎంసెట్	మే 3,4,6 తేదీల్లో (ఇంజనీరింగ్)	జేఎన్టీయూహెచ్
	మే 8,9 తేదీల్లో (అగ్రికల్చర్)	జేఎన్టీయూహెచ్
ఈసెట్	మే 11	జేఎన్టీయూహెచ్
పీఈసెట్	మే 20 నుంచి	మహాత్మాగాంధీ
ఐసెట్	మే 23, 24	కాకతీయ
లాసెట్	మే 26	ఉస్మానియా
పీజీలాసెట్	మే 26	ఉస్మానియా
పీజీఈసెట్	మే 27 నుంచి 29 వరకు	ఉస్మానియా
ఎడ్‌సెట్	మే 30, 31	ఉస్మానియా

అఖిలేశ్ ఇంట్లో సీబీఐ సోదాలు

ఇసుక అక్రమ మైనింగ్ కేసులో తెలంగాణ సహా 14 చోట్ల దాడులు

న్యూఢిల్లీ: ఇసుక అక్రమ మైనింగ్‌కు సంబంధించి ఉత్తర్ ప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ సహా ఆ పార్టీ నేత ఇళ్లపై సీబీఐ అధికారులు దాడులు చేశారు. శనివారం ఏకకాలంలో 14 చోట్ల సోదాలు నిర్వహించారు. అఖిలేశ్‌కు సమన్లు ఇచ్చే అవకాశాలున్నట్టు అధికారులు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని జాలౌన్, హామిర్‌పూర్, లక్నో జిల్లాలతో పాటు ఢిల్లీలోని అఖిలేశ్, ఆయన తరఫు బంధువుల ఇళ్లపైనా దాడులు చేసినట్టు అధికారులు తెలిపారు. మహిళను రేప్ చేసిన ఘటనలో 2017లో అరెస్ట్ అయిన సమాజ్‌వాదీ పార్టీ నేత గాయత్రి ప్రజాపతిని సీబీఐ విచారించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

ఐఏఎస్ చంద్రకళ ఇళ్లలోనూ..

అవినీతిపై సోషల్ మీడియాలో ఫైట్ చేస్తూ లేడీ దబాంగ్ అనిపించుకున్న ఐఏఎస్ అధికారి చంద్రకళ (కరీంనగర్ జిల్లా రామగుండం ఆమె స్వస్థలం) ఇంట్లోనూ అధికారులు సోదాలు చేశారు. 2012-16 మధ్య కాలంలో ఇసుక అక్రమ మైనింగ్ లైసెన్సులను పునరుద్ధరించి కొందరు ఐఏఎస్‌లు సహా ప్రభుత్వ అధికారులు సహకరించారన్న ఆరోపణల నేపథ్యంలో సీబీఐ ఈ దాడులు చేసింది.

16 ఎంపీ సీట్లు టీఆర్ఎస్‌వే!

రాష్ట్రంలో కారువైపే ఓటరు ● వీడీపీ అసోసియేట్స్ తాజా సర్వేలో వెల్లడి



- ఎన్డీయేకు మళ్లీ పవర్ కష్టమే.. 225 సీట్లకే పరిమితం
- యూపీఏకు 167 సీట్లే.. ఇతరులకు 150 స్థానాలు
- అధికారాన్ని నిర్ణయించేది ప్రాంతీయ పార్టీలే
- ప్రధానిగా మోడీకే జనం ఓటు
- మోడీకి 40శాతం, రాహుల్‌కు 24శాతం మద్దతు

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో రెండోసారి అధికారాన్ని కైవసం చేసుకున్న టీఆర్ఎస్ పార్టీ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే సత్తాను చాటనుంది. రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో 16 సీట్లు కారు ఖాతాలో పడతాయని వీడీపీ అసోసియేట్స్ తాజా సర్వేలో వెల్లడైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే తిరిగి పవర్‌లోకి రావడం కష్టమేనని, అది మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోకపోవచ్చని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏకు కూడా అంత సీన్ లేదని తేలింది. ప్రాంతీయ పార్టీలు కీలకంగా మారే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా 542 లోక్‌సభ స్థానాలపై వీడీపీ అసోసియేట్స్ సంస్థ డిసెంబర్ 20 నుంచి జనవరి 2 వరకు ఒపీనియన్ పోల్స్ నిర్వహించింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీ అధికారంలోకి వస్తుందని సర్వే చేపట్టింది. ఆ వివరాలను శనివారం తన ట్విట్టర్ ఖాతాలో ప్రకటించింది. తెలంగాణలో టీఆర్ఎస్‌కు ఎదురులేదని, 16 స్థానాలను కైవసం చేసుకుంటుందని సంస్థ అంచనా వేసింది. రాష్ట్రంలో పార్టీలకు పోలయ్యే ఓట్ల శాతాలూ లెక్కేసింది. టీఆర్ఎస్ 44.4శాతం, కాంగ్రెస్, 31, బీజేపీ 11.4, ఎంఐఎం 4, టీడీపీ 3, సీపీఎం 0.5, సీపీఐ 0.5, టీజేఎస్ 0.4, ఎటూ చెప్పలేనివాళ్లు 4శాతం ఉండవచ్చని పేర్కొంది. దక్షిణాదిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రంలోని మొత్తం 130 ఎంపీ సీట్లలో ఎన్డీఏకు 12, యూపీఏకు 61, ఇతరులకు 57 సీట్లు రావొచ్చని వివరించింది.

ఎన్డీయేకు నో.. యూపీఏకూ నో

2014 ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఈ సారి మాత్రం మ్యాజిక్ ఫిగర్‌ను కూడా అందుకునే పరిస్థితి కనిపించడం లేదు. అధికారంలోకి రావాలంటే లోక్‌సభలోని మొత్తం 543 స్థానాల్లో 282 సీట్ల(మ్యాజిక్ ఫిగర్)ను దక్కించుకోవాలి. గత ఎన్నికల్లో ఎన్డీయే 336 సీట్లలో విజయం సాధించింది. అందులో బీజేపీనే 286 సీట్లు కైవసం చేసుకొని ఒంటరిగానే మ్యాజిక్ ఫిగర్‌ను దాటేసింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మాత్రం ఎన్డీయేకు 225 (బీజేపీకి 201) సీట్లే వస్తాయని వీడీపీ అసోసియేట్స్ అంచనా వేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ గతంలో కంటే ఈసారి మెరుగైన ఫలితాలను సాధిస్తుందని, అయినా లాభం లేదని పేర్కొంది. 2014లో యూపీఏకు 60 సీట్లు రాగా.. అందులో కాంగ్రెస్‌కు వచ్చినవి 44 మాత్రమే. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే యూపీఏకు 167 సీట్లు (కాంగ్రెస్‌కు 110సీట్లు) రావొచ్చని, ఇతరులకు 150 సీట్లు రావొచ్చని తాజా సర్వేలో తేలింది. అటు ఎన్డీయే కానీ.. ఇటు యూపీఏ కానీ అధికారంలోకి రావడం కష్టమని తేలిపోయింది. ఎన్డీయే 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత అందులో నుంచి కొన్ని పార్టీలు బయటకు వచ్చేశాయి. ఇంకొన్ని పార్టీలు ఈసారి ఒంటరిగా బరిలోకి దిగుతామని చెప్తున్నాయి. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో ఎన్డీయే మళ్లీ పవర్‌లోకి రావడం కష్టమని, యూపీఏ కనీసం దరిదాపుల్లోకి కూడా రాకపోవచ్చని తాజా సర్వే వివరాలు వెల్లడిస్తున్నాయి. ఈసారి కేంద్రంలో అధికారాన్ని నిర్ణయించేది ప్రాంతీయ పార్టీలేనని తెలుస్తోంది. ఇతరులకు 150 సీట్లు వస్తాయని, అందులో ప్రాంతీయ పార్టీల బలమే ఎక్కువని సర్వేలో వెల్లడైంది.

2014 ఫలితాలు (మొత్తం సీట్లు 543)

ఎన్డీయే	యూపీఏ	ఇతరులు
336	60	147

సర్వే ప్రకారం ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే (542 స్థానాల్లో సర్వే..)

ఎన్డీయే	యూపీఏ	ఇతరులు
225	167	150

మళ్లీ మోడీ వైపే

మోడీనే మళ్లీ ప్రధాని కావాలని దేశంలోని అత్యధిక శాతం ఓటర్లు భావిస్తున్నట్లు వీడీపీ అసోసియేట్స్ పేర్కొంది. మోడీని 40శాతం మంది కోరుకుంటున్నారని, కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ వైపు 24శాతం మంది ఉన్నారని తెలిపింది. సోనియా వైపు 3శాతం, నితీశ్‌కుమార్ వైపు 2శాతం, అరవింద్ కేజ్రీవాల్ వైపు 2శాతం, మాయావతి వైపు 2శాతం, కేసీఆర్ వైపు 2శాతం, మమతా బెనర్జీ వైపు 2శాతం, శరద్‌పవార్ వైపు 1శాతం, నవీన్‌పట్నాయక్ వైపు 1శాతం, చంద్రబాబు వైపు 1శాతం ఓటర్లు ఉన్నారంది.

ఉత్తరప్రదేశ్‌లో టగ్ ఆఫ్ వార్

కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉండాలో నిర్ణయించే ఉత్తరప్రదేశ్‌లో ఈసారి లోక్‌సభ ఎన్నికలు టగ్ ఆఫ్ వార్‌గా నడవనున్నాయి. ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్డీ మహాకూటమిగా ఏర్పడితే.. బీజేపీ ఎదురీదాల్సిందేనని సర్వేలో తేలింది. మొత్తం 80 సీట్లు ఉన్న యూపీలో కూటమికి 40, బీజేపీకి 38, కాంగ్రెస్‌కు 2 సీట్లు రావొచ్చని వీడీపీ అంచనా వేసింది.

కేసీఆరే ప్రధాని కావాలంటున్న తెలంగాణ

ప్రధానిగా కేసీఆర్‌ను చూడాలని తెలంగాణ ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లు సర్వేలో తేలింది. మోడీ కన్నా కేసీఆర్ ప్రధాని అయితేనే బాగుంటుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నట్లు వెల్లడైంది. కేసీఆర్ వైపు 35శాతం, మోడీ వైపు 27శాతం, రాహుల్ వైపు 28శాతం మంది తెలంగాణ ఓటర్లు ఉన్నారని వీడీపీ తెలిపింది. అటు ఏపీ ప్రజల్లో చంద్రబాబును ప్రధానిగా చూసుకోవాలని 30శాతం మంది ఆశిస్తున్నారని, మోడీవైపు 17 శాతం, రాహుల్‌వైపు కేవలం 5శాతం మంది ఉన్నట్లు పేర్కొంది. తెలంగాణలో కేసీఆర్ తర్వాత రాహుల్‌ను, ఏపీలో చంద్రబాబు తర్వాత మోడీనే ఆదరించడం గమనార్హం.



తప్పులకు ఎన్నికల సంఘానిదే బాధ్యత

- ఓటర్ల జాబితా తప్పులపై హైకోర్టు
- ఎన్నికలు నిర్వహిస్తే సమర్థంగా పని చేసినట్టు కాదు
- అర్హులందరూ ఉంటేనే జాబితాకు అర్థమని వ్యాఖ్య

హైదరాబాద్, వెలుగు: ఓటర్ల జాబితాలో తప్పులకు రాష్ట్ర ఎన్నికల సంఘానిదే బాధ్యత అని హైకోర్టు పేర్కొంది. అర్హులందరూ ఓటర్ల జాబితాలో ఉన్నప్పుడే దానికో అర్థమంటూ వ్యాఖ్యానించింది. పంచాయతీ ఎన్నికలను నిర్వహించినంత మాత్రాన చిత్తశుద్ధి చాటుకున్నట్టు కాదని, అర్హులందరూ ఓటర్ల జాబితాలో ఉన్నప్పుడే ఎన్నికల సంఘం సమర్థంగా పనిచేసినట్టని వ్యాఖ్యానించింది. తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీ బాధ్యత ఎన్నికల సంఘం భుజాలపై ఉందని జస్టిస్ పీవీ సంజయ్ కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు గ్రామ పరిధిలోని చామలోనిబావికి చెందిన 1-319 నెంబరు గల ఇంటోళ్ల పేర్లు వేర్వేరు వార్డుల ఓటర్ల జాబితాలో ఉండడంపై వేసిన వ్యాజ్యాన్ని శుక్రవారం ఆయన విచారించారు. ఆ ఇంట్లోని మంతిపల్లి దుర్గయ్య, ఆయన భార్యాకుమార్తెలు యాదవమ్మ, మమతలు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారించిన జడ్జి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి ఓటర్ల జాబితా తయారు చేయడం కచ్చితంగా ఎన్నికల సంఘం వైఫల్యమేనని మండిపడ్డారు. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు కాబట్టి.. జాబితాను సరిచేసి రెండు లేదా మూడో దశలో ఆ ఊరికి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. అందుకు తగినట్టు ఎన్నికల షెడ్యూల్‌ను మార్చాలని సూచించారు. ఓటర్ల జాబితాను సరిగ్గా సిద్ధం చేయకుండా ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తే దానికి అర్థమే లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

సలి జర తగ్గింది

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్‌లో 11 డిగ్రీలు

హైదరాబాద్, వెలుగు: మొన్నటిదాకా వణికించిన చలి కొద్దికొద్దిగా తగ్గుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



పలు ప్రాంతాల్లో మంచుకురిసే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 2వ తేదీన మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రత 11 డిగ్రీలు నమోదైంది. ఖమ్మంలో 17, నల్లగొండ, భద్రాచలం, హన్మకొండల్లో 16 డిగ్రీలు, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 15, నిజామాబాద్, హకీంపేట ప్రాంతాల్లో 14 డిగ్రీల చొప్పున టెంపరేచర్ ఉంది. మెదక్‌లో టెంపరేచర్ అత్యధికంగా 33 డిగ్రీలకు పెరిగింది.

మీది వరల్డ్ క్లాస్ మెట్రో

ఫ్రెంచ్ నేషనల్ రైల్వేస్ చైర్మన్ గిలామ్ ప్రశంస

హైదరాబాద్, వెలుగు: ప్రపంచంలోని అత్యుత్తమ మెట్రో రైళ్లల్లో హైదరాబాద్ మెట్రో ఒకటని ఫ్రెంచ్ నేషనల్ రైల్వేస్ ఎస్ఎన్‌సీఎఫ్ చైర్మన్ గిలామ్ పెపీ ప్రశంసించారు. తమ ఎస్ఎన్‌సీఎఫ్ గ్రూప్ సంస్థ కియోలిస్ ఈమధ్య చేసిన సర్వేలో ప్రయాణికులు మెచ్చిన మెట్రో విభాగం (మెరుగైన నిర్వహణ, సమయపాలన)లో తొలిస్థానం దక్కించుకుందని చెప్పారు. శనివారం హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డితో పెపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెపీ మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రోలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం సాహసోపేత నిర్ణయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో మెట్రో రైల్, లైట్ రైల్, ట్రామ్ వే, బస్ సిస్టమ్‌లను కియోలిస్ నిర్వహిస్తోందన్నారు. హైదరాబాద్ మెట్రో స్టేషన్ల డిజైన్, నిర్మాణంలో వినూత్న పద్ధతులు అమలు చేశామని పెపీకి ఎన్‌వీఎస్‌రెడ్డి వివరించారు. మెట్రో రైల్ రెండో దశ విస్తరణ ప్రణాళికలను వివరించారు. కాగా, ఫ్రాన్స్‌లో తాము రైల్వేను నిర్వహిస్తున్న తీరు, కల్పించిన సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఎన్‌వీఎస్‌రెడ్డిని పెపీ ఆహ్వానించారు. తమ అధికారులకు హైదరాబాద్ మెట్రో అనుభవాలు, విజయగాథను వివరించాలని కోరారు.



రైతుబంధుకు ‘పంచాయతీ’ అడ్డుకాదు

- సాయం అందని 15% మందికి త్వరలోనే అందజేత
- ఇప్పటికి 44 లక్షల మందికిపైగా రెండో విడత పెట్టుబడి

హైదరాబాద్, వెలుగు: యాసంగి సాగుకు రైతు బంధు సాయం తుది దశకు వచ్చింది. పంచాయతీ ఎన్నికలున్నా రైతు బంధుకు ఎలాంటి ఇబ్బందులుండవని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 51 లక్షల మందికి రెండో విడత (యాసంగి) సాయం అందించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించగా ఇప్పటికే 85% మంది రైతులకు (44 లక్షలకు పైగా) రైతుబంధు పెట్టుబడిని అందించినట్టు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో 52 లక్షల మందికి పెట్టుబడి సాయం అందించగా, రెండో విడత వచ్చేసరికి ఎన్నికలు రావడం, చెక్కులు కాకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు పెట్టడంతో వ్యవసాయ శాఖ కొత్తగా ఓ యాప్‌ను తయారు చేయించింది. రైతుల బ్యాంకు ఖాతాలు, ఇతర వివరాలను సేకరించి అందులో పొందుపరిచింది. ఇటు కొత్తవారికి, పాస్‌బుక్‌లేని వాళ్లకు రైతుబంధు ఇవ్వొద్దనీ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో కొత్తవారికి పథకం అందలేదు. యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేసిన 85శాతం మందికి రూ.4,725 కోట్ల మేర పెట్టుబడి సాయాన్ని అధికారులు పంపిణీ చేశారు. మిగిలిపోయిన ఐదారు లక్షల మందికి ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే వారి వివరాలను రిజర్వ్ బ్యాంక్‌కు పంపించారు. అందులో కొందరు జన్‌ధన్ యోజన కింద తెరిచిన ఖాతాలను వాడకపోవడం వల్ల బ్యాంకులు ఆ ఖాతాలకు సేవలను ఆపేశాయి. అలా లక్షల ఖాతాలకు సేవలు నిలిచిపోయాయి. దీంతో వారి అకౌంట్లలో డబ్బు పడలేదు. అలాంటి వాళ్లను గుర్తించి మరోసారి వివరాలను సేకరించాలని అధికారులు నిర్ణయించారు. జనవరి నెల ప్రారంభం నుంచే ఆ ప్రక్రియ జరగాల్సి ఉన్నా, ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులు, డబ్బు కొరత కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని అధికారులు చెప్పారు. త్వరలోనే వివరాలను అప్‌లోడ్ చేసి డబ్బును రైతుల అకౌంట్లలో వేస్తామని వారు చెబుతున్నారు.



బెంగళూరు సెంట్రల్ నుంచి ప్రకాశ్‌రాజ్ పోటీ

బెంగళూరు: వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నట్లు సినీ నటుడు ప్రకాశ్ రాజ్ శనివారం ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేస్తానని ట్విటర్ ద్వారా వెల్లడించారు. ‘సిటిజెన్స్ వాయిస్ ఇన్ పార్లమెంట్’ యాష్‌ట్యాగ్‌తో తన ఫొటో, బెంగళూరు పరిధిలోని 8 నియోజక వర్గాల మ్యాప్‌ను ట్వీట్ చేశారు. త్వరలో మరిన్ని విషయాలను వెల్లడిస్తానని చెప్పారు.

4,169 మందికి హజ్ చాన్స్

హైదరాబాద్, వెలుగు: హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 4,169 మందిని పంపేందుకు కేంద్ర హజ్ కమిటీ అనుమతిచ్చిందని తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్, స్పెషల్ ఆఫీసర్ ఎస్ఏ షుకూర్ తెలిపారు. హజ్ యాత్రకు 13,368 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 70 ఏళ్లకు పైబడిన 484 మందిని డ్రా లేకుండా ఎంపిక చేశామన్నారు. మిగతా 3,685 సీట్ల కోసం 12,884 మంది పోటీలో ఉన్నారని, డ్రా ద్వారా యాత్రికులను ఎంపిక చేస్తామని చెప్పారు.

ఫిబ్రవరి 20న ‘ఎమ్మెల్సీ’ ఓటర్ల తుది జాబితా

హైదరాబాద్, వెలుగు: రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల తుది జాబితాను వచ్చేనెల 20న ప్రకటిస్తామని సీఈఓ రజత్ కుమార్ చెప్పారు. 1న ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలకు ఈ నెల 31 వరకు గడువు ఉందన్నారు. ఫిర్యాదులు స్వీకరించి వచ్చేనెల 15 నాటికి జాబితా సరి చేస్తామని చెప్పారు. ఫైనల్ ఓటర్ లిస్టును వచ్చే నెల 20వ తేదీన విడుదల చేస్తామన్నారు.

మాల్యా.. పరారీలో ఉన్న నేరస్తుడే




- ఎఫ్ఈవో చట్టం కింద ప్రకటించిన ముంబై ప్రత్యేక కోర్టు
- దేశంలోని ఆయన ఆస్తులు సీజ్ చేసేందుకు ఈడీకి అవకాశం

ముంబై: దేశంలోని బ్యాంకులకు రూ.9 వేల కోట్ల మేరకు రుణాలను ఎగ్గొట్టిన కేసులో లిక్కర్ కింగ్ విజయ్‌మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తునిగా ముంబై కోర్టు ప్రకటించింది. ఈ మేరకు శనివారం ముంబైలోని ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ) కోర్టు తీర్పు వెలువరించింది. దీంతో దేశంలోని మాల్యా ఆస్తులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం సీజ్ చేసే అవకాశం లభించింది. ఫ్యూజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ యాక్ట్(ఎఫ్ఈవో) 2018 అమలులోకి వచ్చిన తర్వాత పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తునిగా ప్రకటించిన మొట్టమొదటి వ్యాపారవేత్త మాల్యానే. ప్రస్తుతం బ్రిటన్‌లో తలదాచుకుంటున్న మాల్యాను ఎఫ్ఈవో చట్టం ప్రకారం పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తునిగా ప్రకటించాలని, దేశంలోని ఆయన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ పీఎంఎల్ఏ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పిటిషన్ దాఖలు చేసింది. మాల్యా, ఈడీ తరఫు న్యాయవాదుల వాదనలను విన్న ప్రత్యేక న్యాయమూర్తి ఎంఎస్ అజ్మీ.. మాల్యాను ఎఫ్ఈవో చట్టంలోని సెక్షన్ 12 కింద పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తునిగా ప్రకటించారు. వేలాది కోట్ల ఆర్థిక నేరాలకు సంబంధించి హైప్రొఫైల్ వ్యాపారవేత్తలైన నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీ లాంటి వారిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. విదేశాలకు పరారైన ఇలాంటి ఆర్థిక నేరస్తులను పట్టుకునేందుకు ఎఫ్ఈవో చట్టానికి గత ఆగస్టులో రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. దేశంలో చట్టపరమైన చర్యలను తప్పించుకునేందుకు విదేశాలకు పరారయ్యే ఆర్థిక నేరగాళ్లను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. రూ.వంద కోట్లు లేదా అంతకుమించి ఆర్థిక నేరాలకు పాల్పడి, అరెస్ట్ వారెంట్ జారీ అయి, ప్రాసిక్యూషన్‌ను తప్పించుకునేందుకు విదేశాలకు వెళ్లిపోయిన వ్యక్తిని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తునిగా పరిగణిస్తారు. మాల్యాను తమకు అప్పగించాలని భారత అధికారులు సమర్పించిన ఆధారాలు, మాల్యా కోసం సిద్ధం చేసిన ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలు వీడియోలను పరిశీలించిన లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ కోర్టు మాల్యా అప్పగింతకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2016లో మార్చిలో బ్రిటన్‌కు వెళ్లిపోయిన మాల్యా.. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు.

17 నుంచి అసెంబ్లీ

ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్



- అదే రోజు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- స్పీకర్ ఎన్నికకు షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ కూడా
- 18న స్పీకర్ ఎన్నిక.. బీఏసీ భేటీ
- 19న గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర శాసనసభ తొలి సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 17న సమావేశాలు ప్రారంభమై.. 20వ తేదీతో ముగియనున్నాయి. శనివారం ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 17వ తేదీ ఏకాదశి అయినందున ఆ రోజు నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు సీఎంవో వర్గాలు తెలిపాయి. ప్రస్తుత శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేల్లో సీనియర్ అయిన ఎంఐఎం సభ్యుడు ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రొటెం స్పీకర్‌గా ఎంపికయ్యారు. చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఆయన ఆరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 16వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 17న కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ కార్యక్రమం రెండు గంటల పాటు సాగుతుంది. అదే రోజు అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక షెడ్యూల్ ప్రకటించి.. నామినేషన్లు స్వీకరిస్తారు. 18న స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఎన్నిక పూర్తి కాగానే నూతన స్పీకర్‌ను సభా నాయకుడు, సీఎం కేసీఆర్, ప్రధాన ప్రతిపక్ష నేత, ఇతర పార్టీల శాసన సభా పక్ష నాయకులు చైర్‌లో కూర్చోబెడతారు. ఆ తర్వాత స్పీకర్ పూర్తిస్థాయి సభాధ్యక్షునిగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం బీఏసీ సమావేశం జరుగుతుంది. 19న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. 20వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం శాసనసభలో ప్రవేశపెట్టి, దానికి ఆమోదం తెలుపుతారు. అనంతరం అసెంబ్లీ వాయిదా పడుతుంది.

21 నుంచి కేసీఆర్ యాగం

ఈ నెల 21 నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగు రోజులపాటు చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం నిర్వహిస్తున్నట్లు సమాచారం. అందుకే యాగానికి ముందుగానే అసెంబ్లీ సమావేశాలు పూర్తి చేయాలని ఆయన భావించినట్లుగా తెలుస్తోంది.

ప్రభుత్వం అనుమతిస్తేనే వివరాలిస్తాం

జగన్‌పై దాడి కేసు విషయంలో ఎన్ఐఏకు తేల్చిచెప్పిన ఏపీ పోలీసులు

విశాఖపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డిపై దాడి కేసు దర్యాప్తు సమాచారాన్ని ఎన్ఐఏకు ఇచ్చేందుకు ఏపీ పోలీసులు నిరాకరించారు. ఏపీ హైకోర్టు ఆదేశాలతో ఎన్ఐఏ ఈ కేసు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో శనివారం కేసు దర్యాప్తు సమాచారం ఇవ్వాలని ఏపీ పోలీసులను ఎన్ఐఏ కోరింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా వివరాలు ఇవ్వలేమని పోలీసులు చెప్పారు.

9 లక్షలు కట్టండి

జానా, షబ్బీర్‌కు ఇంటెలిజెన్స్ నోటీసులు

హైదరాబాద్, వెలుగు: కాంగ్రెస్ నేత జానారెడ్డి, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీకి రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం శనివారం నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ బుల్లెట్‌ప్రూఫ్ వాహనం ఉపయోగించినందుకు బిల్ చెల్లించాలని పేర్కొంది. కిలోమీటర్‌కు రూ.37, డ్రైవర్ బత్తా రోజుకు రూ.100 చొప్పున ఇద్దరు నేతలు మొత్తం 9 లక్షలు చెల్లించాలని సూచించింది.

పొగడ్తలు తప్ప పైసలేవి?

రాష్ట్రంపై కేంద్రం వివక్ష ● పోరాటం ఆపబోం: కేటీఆర్



- బీజేపీ పాలిత రాష్ట్రాలకే మోడీ ప్రధానా?
- ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలి
- లేకపోతే 17 ఎంపీ సీట్లలో బీజేపీకి డిపాజిట్లు గల్లంతే

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇక్కడి పథకాలను ప్రశంసిస్తున్నారు తప్ప నిధులు ఇవ్వడం లేదని అన్నారు. 'ప్రధాని మోడీ మన్‌కీబాత్ సందర్భంగా తెలంగాణలోని మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు బాగున్నాయని చెప్పారు. 2016లో నాటి నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియా భగీరథకు రూ.19,205 కోట్లు, కాకతీయకు రూ.5 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశారు. వీటిపై మొన్న పార్లమెంట్‌లో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నిస్తే ఆ సిఫార్సులను రద్దు చేశామని కేంద్ర మంత్రి చెప్పారు. ఇదేం పద్ధతి?' అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో సాగునీటి ప్రాజెక్టుల ఖర్చులో 25 శాతం భరిస్తామని కేంద్రం ఒప్పుకుందని, ఒక్క ఏడాదిలోనే ఆ రాష్ట్రానికి రూ.3,831 కోట్లు ఇచ్చిందని తెలిపారు. మోడీ బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రధానమంత్రా అని ప్రశ్నించారు. శనివారం కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికైనా కేంద్రం తీరు మార్చుకోకుంటే రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో బీజేపీ డిపాజిట్ కోల్పోక తప్పదని హెచ్చరించారు. 'ఏపీలో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చారు. మహారాష్ట్ర ప్రాజెక్ట్‌లకు సాయం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల పథకాల్లో ఏదో ఒక ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇవ్వాలని స్వయంగా సీఎం విజ్ఞప్తి చేసినా కేంద్రం స్పందించడం లేదు' అని అన్నారు. బీజేపీ పక్షపాత వైఖరిని ప్రజలు గమనించారు కాబట్టే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 103 స్థానాల్లో డిపాజిట్ గల్లంతు చేశారని విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించిన రోజు ప్రధాని ఆ పథకాన్ని ప్రశంసించారని, ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టడానికి ఉత్సాహం చూపుతున్న కేంద్ర ప్రభుత్వం, వాటి అమలుకు రాష్ట్రం ఎన్ని ఇబ్బందులను ఎదుర్కొంటుందో గుర్తించడం లేదని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి చోటులేదన్న చిల్లర బుద్ధితోనే కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన కంపా నిధులు, జీఎస్టీ బకాయిల్లోనూ మొండిచేయి చూపుతున్నారని పేర్కొన్నారు. ఐటీఐఆర్, ట్రైబల్ వర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇలా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని కేంద్రంపై మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పుపై బీజేపీ నేతలు ఆత్మవిమర్శ చేసుకుంటే మంచిదన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి

గీత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కేటీఆర్ అన్నారు. గీత కార్మికుల సహాయార్థం బీఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు కేటీఆర్‌కు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ వృత్తిదారుల కోసం ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఫౌండేషన్ సేవలు ఎనలేనివని ప్రశంసించారు.

పాలనాదక్షతకు ఇదే నిదర్శనం

తెలంగాణలో పరిపాలన ప్రజల కోణంలో సాగుతోందని, ఇందుకు మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతంలోని 40 గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు తమ ప్రాంతాన్ని తెలంగాణలో కలుపాలని కోరడమే నిదర్శనమని కేటీఆర్ ట్వీట్ చేశారు.

రేపటి నుంచే 'పంచాయతీ'

తొలి విడత ఎలక్షన్ల ప్రక్రియ షురూ

- ఎన్నికల నిర్వహణ, భద్రతకు భారీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్
- కోడ్ ఉన్నా అసెంబ్లీ నిర్వహించుకోవచ్చు: నాగిరెడ్డి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సోమవారం (7వ తేదీ) నుంచి ప్రారంభమవుతోంది. తొలివిడతలో ఎలక్షన్లు జరిగే పంచాయతీలకు నామినేషన్లు మొదలవుతున్నాయి. మొత్తంగా మూడు విడతల్లో జరిగే ఈ ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి, ప్రభుత్వ సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం వారు కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సిబ్బంది, పోలింగ్ మెటీరియల్, సెక్యూరిటీ ప్లాన్, వాహనాలు, పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్, బడ్జెట్ తదితర అంశాలపై సూచనలు చేశారు. కలెక్టర్లు ఎన్నికలకు పూర్తి సన్నద్ధంగా ఉండాలని, సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వెబ్ కాస్టింగ్, వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

భద్రతపైనే ఎక్కువ దృష్టి

పంచాయతీ ఎలక్షన్ల ప్రక్రియ 7వ తేదీ నుంచి మొదలవుతుండటంతో గ్రామాల వారీగా సెక్యూరిటీపై దృష్టిపెట్టామని వి.నాగిరెడ్డి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు పోలీసు భద్రత కొనసాగుతుందన్నారు. ఎన్నికల అధికారి చెప్పేంత వరకు పోలీసులు పోలింగ్ కేంద్రాన్ని విడిచివెళ్లరాదని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే రంగంలోకి దింపేందుకు స్ట్రైకింగ్ ఫోర్సెస్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్‌ను మండల స్థాయిలో అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నికలు సవ్యంగా జరిగేందుకు అందరూ అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు కూడా ఓటర్లను ప్రలోభపెట్టకుండా, నిబంధనల ప్రకారం ప్రచారం చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో అసెంబ్లీ సమావేశాలు జరగడంలో తప్పులేదని వివరించారు.

నామినేషన్ రాక ముందే ఏకగ్రీవం చెల్లదు

గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయేతర ఎన్నికలని, ఓ ఆదర్శవంతమైన ఆలోచనతో దానిని అమలు చేస్తున్నారని నాగిరెడ్డి చెప్పారు. రూ.10 లక్షల వరకు పారితోషికం ఇచ్చే పద్ధతి ఉందని, అంతకన్నా ఎక్కువ ఇచ్చినా ఇబ్బందేమీ లేదని పేర్కొన్నారు. అయితే నామినేషన్లు మొదలుకాకముందే ఏకగ్రీవాలు చేస్తే చెల్లవని నాగిరెడ్డి స్పష్టం చేశారు. బలవంతపు ఏకగ్రీవాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అబ్జర్వర్లు ఇకపై జిల్లాల్లో అందుబాటులో ఉంటారని, వారికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

కేసీఆర్ ఎంపీగా పోటీ చేయరు

- కేబినెట్‌లో ఎవరుంటారో నాకు తెలియదు
- మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్

హైదరాబాద్, వెలుగు: సీఎం కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోరని కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. నల్లగొండ, కరీంనగర్ లోక్‌సభ స్థానాల్లో ఎక్కడో ఓ చోటు నుంచి కేసీఆర్ ఎంపీగా పోటీ చేస్తారని జరుగుతున్న ప్రచారంపై మీడియా ప్రశ్నించగా.. 'రాష్ట్రంలో చేయాల్సిన పని బోలెడుంది. పాలనపై కేసీఆర్ దృష్టి పెట్టారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల వద్దకు వెళ్లి చూసి వస్తున్నారు. ఇవన్నీ వదిలేసి ఎంపీగా పోవాల్సిన అవసరం లేదు' అని అన్నారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆరేనని, తాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ నిర్మాణంపై దృష్టి పెడుతానని చెప్పారు. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో మాత్రమే తాము అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబడ్డామని, లోక్‌సభ ఎన్నికల నాటికి అక్కడ పుంజుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ క్రైసిస్‌లో ఉందన్నారు.

ఆ చిప్‌లు చంద్రబాబుకే తెలుసు

ఈవీఎంలను ట్యాంపర్ చేశారన్న ఆరోపణలపై కేటీఆర్ స్పందిస్తూ.. 'కంప్యూటర్లను కనుగొన్నది చంద్రబాబు. ఆ చిప్‌లు.. ఇంకా ఏమైనా ఉంటే ఆయనకే తెలుస్తాయి. ఆయనకే ఆ అవకాశం ఉంటుంది. మాకేమీ తెలియదు. ఈవీఎంలపై నెపం వేయకుండా క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకోవాలి. ఎంపీ ఎన్నికల ప్రచారానికి చంద్రబాబు వస్తారని అనుకోవట్లేదు. సీఎం స్థాయి వ్యక్తి గోడ గడియారాలపై స్పందించడం దురదృష్టకరం' అని అన్నారు. చంద్రబాబును చూసి ప్రజలు టీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదని, తమ ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడింది కాబట్టే మద్దతు ఇచ్చారన్నారు. ఫెడరల్ ఫ్రంట్‌లో భాగంగా మాయావతిని ప్రధాని అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించబోతున్నారనే ప్రచారంపై ప్రశ్నించగా తనకు ఆ విషయం తెలియదన్నారు. ఇదీ మీడియానే రాస్తున్నదన్నారు. కేబినెట్‌లో ఎవరెవరుంటారో తెలియదని, 15 రోజుల్లోపే విస్తరణ ఉండవచ్చనట్టు సంకేతాలిచ్చారు.

కేటీఆర్‌పై కేసులు పెట్టరెందుకు?: పొన్నం

హైదరాబాద్, వెలుగు: పంచాయతీల్లో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.10 లక్షలిస్తామని ఎన్నికల సంఘం ప్రకటిస్తే.. రూ.15 లక్షలిస్తామంటున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులెందుకు పెట్టరని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ శనివారం ప్రశ్నించారు. రాజకీయాలంటేనే జుగుప్స కలిగించేలా టీఆర్ఎస్ చేసిందని విమర్శించారు. గెలిచామనే అహంకారం పనికిరాదని, ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని సూచించారు. రిటైర్మెంట్ వయసు 61ఏళ్లకు పొడగిస్తామన్న హామీ అమలు చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ప్రభావం పంచాయతీ ఎన్నికలపై పడదన్నారు.



వీవీప్యాట్ స్లిప్‌లు ఎందుకు లెక్కించరు?

పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి

హైదరాబాద్, వెలుగు: అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలతోపాటు వీవీ ప్యాట్‌ల స్లిప్పులను ఎందుకు లెక్కించరని పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను దేశవ్యాప్త చర్చకు తీసుకువస్తామని చెప్పారు. వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపుపై ఎన్నికల అధికారులు ఎందుకు సమాధానం చెప్పరని ప్రశ్నించారు. శనివారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ చెప్పినట్లు వినలేదనే సూర్యాపేట కలెక్టర్ సురేంద్ర మోహన్‌ను బదిలీ చేశారని ఆరోపించారు. గ్రామాల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకోని వారిపై అధికార పార్టీ నేతలు కేసులు పెడుతున్నారన్నారు.



శనివారం గాంధీభవన్‌లో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ ఉత్తమ్. పక్కన జానారెడ్డి

ఆ ముచ్చట మళ్లీ వద్దు

- అసెంబ్లీ ఎన్నికల తప్పిదాలు జరగొద్దు
- లోక్‌సభ అభ్యర్థులను ముందుగానే ప్రకటించాలి
- కాంగ్రెస్ సమీక్షలో నేతలు

హైదరాబాద్, వెలుగు: "అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పిదాలు లోక్‌సభ ఎన్నికల్లో జరగకుండా చూడాల్సిన బాధ్యత హైకమాండ్‌పై ఉంది. అభ్యర్థుల ప్రకటనలో ఆలస్యం వల్ల ప్రచారం చేసుకునే సమయం లేక ఓడిపోయాం" అని పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు తమ ఓటమికి గల కారణాలను వివరించారు. పంచాయతీ ఎన్నికలకు ముందే లోక్‌సభ అభ్యర్థులను ప్రకటిస్తే రెండింటి ప్రచారం ఒకేసారి చేసుకోవచ్చని సూచించారు. శనివారం గాంధీభవన్‌లో రెండో రోజు కూడా కాంగ్రెస్ లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమీక్షలు కొనసాగాయి. నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థులు, ఆ ప్రాంత నేతలు, డీసీసీ అధ్యక్షులు హాజరయ్యారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా, ఏఐసీసీ కార్యదర్శి సలీం అహ్మద్, సీనియర్ నేతలు జానారెడ్డి, చిన్నారెడ్డి, నాగం జనార్దన్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సీతక్క తదితరులు పాల్గొన్నారు. కనీసం ప్రచార సామగ్రిని కూడా పార్టీ సకాలంలో పంపించలేకపోయిందని, తమ మేనిఫెస్టో బాగానే ఉన్నప్పటికీ అది జనంలోకి చేరలేకపోయిందని ఓడిపోయిన నేతలు వాపోయారు. పోలీసు అధికారులను, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులను అధికార పార్టీ తమకు అనుకూలంగా వినియోగించుకోవడం, పలు అక్రమాలకు పాల్పడడం కూడా తమ ఓటమికి కారణమని కొందరు చెప్పారు.

పొత్తే నా ఓటమికి కారణం: కోమటిరెడ్డి

పొత్తుల వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోయానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సమీక్ష తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. మహాకూటమి వద్దని ఎన్నికల ముందే తాను చెప్పానని, 'సీట్లే పంచుకోలేని వాళ్లు రాష్ట్రాన్ని ఏమి పాలిస్తార'ని కేసీఆర్ అన్న మాటలను జనం నమ్మారని చెప్పారు. కూటమి గెలిస్తే చంద్రబాబు పాలన చేస్తారనే ప్రచారాన్ని కూడా వాళ్లు ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. ఒంటరిగా పోటీ చేస్తే కనీసం 40 నుంచి 45 సీట్లు వచ్చేవని అభిప్రాయపడ్డారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులు లేకుండా పోటీ చేస్తే 7 నుంచి 8 స్థానాలను గెలుచుకుంటామని చెప్పారు. అధిష్ఠానం ఆదేశిస్తే నల్లగొండ స్థానం నుంచి బరిలో ఉంటానన్నారు.

నేడు హైదరాబాద్ ఎంపీ సెగ్మెంట్‌పై సమీక్ష

ఆదివారం ఉదయం గాంధీభవన్‌లో హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ సమావేశం మాత్రమే జరగనుంది. సిటీలోని ఒక్క అసెంబ్లీ సీటును కూడా కాంగ్రెస్ గెలుచుకోలేకపోయింది. పీసీసీ చీఫ్ ఉత్తమ్ ఆదివారం సాయంత్రం యూరప్ పర్యటనకు వెళ్తుండటంతో మిగతా సమీక్షలు వాయిదా పడ్డాయి.

నేతలకు విందు ఇవ్వనున్న డీకే అరుణ

కాంగ్రెస్ సీనియర్ నేత డీకే అరుణ ఆదివారం సాయంత్రం గండిపేటలోని తన ఫామ్‌హౌజ్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో విందు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. విందుకు హాజరు కావాల్సిందిగా పార్టీ ముఖ్య నేతలను కూడా ఆహ్వానించినట్లు సమాచారం.



ఈసారి సూపర్ బ్లడ్ వూల్ఫ్ మూన్

- ఈ నెల 20, 21 తేదీల్లో అరుదైన చంద్రగ్రహణం
- అమెరికా, పశ్చిమ ఐరోపా, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో చూడొచ్చు
- ఇండియన్లు సహా ఆసియాలో చాలా మందికి నో చాన్స్

గతేడాది సూపర్ బ్లడ్ మూన్‌ను అందరూ చూసే ఉంటారు. అచ్చం అలాంటి అద్భుత దృశ్యమే మరోసారి ఆవిష్కృతం కానుంది. అత్యంత అరుదుగా కనిపించే చంద్రగ్రహణం ఈ నెల 20, 21 తేదీల్లో (వివిధ దేశాల టైమ్ జోన్స్ ప్రకారం) ఆకాశంలో కనువిందు చేయనుంది. దానికి సైంటిస్టులు 'సూపర్ బ్లడ్ వూల్ఫ్ మూన్' అని పేరు పెట్టారు. పేరుకు తగ్గట్టే గ్రహణం కూడా సంపూర్ణ చంద్రగ్రహణం, సూపర్ బ్లడ్ మూన్, వూల్ఫ్ మూన్‌లా మూడు విధాలుగా కనబడుతుంది. పశ్చిమ ఐరోపా, ఆఫ్రికాల్లోని కొన్ని ప్రాంతాలతోపాటు అమెరికా అంతటా ఈ అరుదైన ఖగోళ దృశ్యాన్ని చూడొచ్చు. కానీ భారత్ సహా ఆసియాలోని చాలామందికి ఆ అవకాశం లేదని నేషనల్ జియోగ్రాఫిక్ చానల్ చెప్పింది. 2021 మే 26 వరకు మరో సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడే అవకాశం లేకపోవడంతో ఈ బ్లడ్ మూన్ ప్రాధాన్యం సంతరించుకుంది.

ఏంటీ సూపర్ బ్లడ్ వూల్ఫ్ మూన్?

సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖపైకి వచ్చి చంద్రునిపై సూర్యకాంతి పడకుండా భూమి పూర్తిగా అడ్డుకున్నప్పుడు చంద్రగ్రహణం ఏర్పడు తుంది. సాధారణ దూరంతో పోలిస్తే భూమికి మరింత దగ్గరగా చంద్రుడు వచ్చినపుడు పెద్దగా, ప్రకాశవంతంగా కనిపిస్తాడు. అప్పుడు దాన్ని సూపర్ మూన్ అంటారు. అయితే కొద్దిమొత్తంలో కాంతి భూ వాతావరణం ద్వారా ప్రయాణించి చంద్రునికి చేరుతుంది. ఆ సమయంలో ఎక్కువ తరంగదైర్ఘ్యం ఉన్న ఎరుపు రంగు మనకు కనిపిస్తుంది. అందుకే చంద్రుడు ఎర్రగా కనిపిస్తాడు. దాన్ని బ్లడ్ మూన్ అంటారు. ఇక ఈ వూల్ఫ్ సంగతేంటంటే.. శీతాకాలంలో కనిపించే పౌర్ణమి చంద్రుడికి అమెరికన్లు పెట్టిన ముద్దు పేరు.

ఏ సమయంలో కనబడుతుంది?

ఇండియన్ టైం (ఐఎస్‌టీ) ప్రకారం ఈ నెల 21న ఉదయం 10:11 గంటలకు (తూర్పు కాలమానం ప్రకారం ఈ నెల 20 రాత్రి 11:41 గంటలకు) సంపూర్ణ చంద్రగ్రహణం మొదలవుతుంది. 62 నిమిషాలపాటు కనువిందు చేస్తుంది. గ్రహణ ప్రక్రియ అంతా 3.5 గంటలపాటు సాగుతుంది. అమెరికన్లు, గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, పశ్చిమ యూరప్, పశ్చిమ ఆఫ్రికా ప్రజలు దీన్ని చూడొచ్చు.

ఎలా చూడటం?

ఈ చంద్రగ్రహణాన్ని చూసేందుకు ఎలాంటి పరికరాలు అవసరం లేదు. సాధారణ కంటితోనే చూడొచ్చు. ఇండియాలో కనబడదు కాబట్టి చూడాలనుకుంటే ఇంటర్నెట్ లైవ్ స్ట్రీమ్‌పై ఆధారపడక తప్పదు.

8, 9 తేదీల్లో సమ్మెను జయప్రదం చేయండి

కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాల పిలుపు

హైదరాబాద్, వెలుగు: కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 8,9 తేదీల్లో జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సాయిబాబు, టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు మాట్లాడారు. 'బీజేపీ పాలనలో రైతులు, కార్మికులు, కూలీల బతుకులు దిగజారాయి, సంపన్నుల ఆస్తులు అనేక రేట్లు పెరుగుతున్నాయి. 73 % సంపద కేవలం ఒక్కశాతంగా ఉన్న ధనవంతుల చేతుల్లోనే ఉంది. ప్రధాని మోదీ ఇచ్చిన అచ్చేదిన్, మేక్ ఇన్ ఇండియా, రైతేరాజు, శ్రమేవ జయతే నినాదాలు గాల్లో కలిసిపోయాయి. కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తున్నారు. ఏడో పే కమిషన్ నిర్ణయించిన 18 వేల రూపాయల కనీస వేతనం అమలును పట్టించుకోవడం లేదు' అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రత్నాకర్‌రావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అచ్యుతరామారావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగారెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ కోర్సులకు ఓకే

హైదరాబాద్, వెలుగు: దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తేవాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్ణయించింది. అర్హత ఉండి, ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ కోర్సులను ఆఫర్ చేయాలనుకుంటున్న విద్యా సంస్థలు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 2019-20 విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సులు ప్రారంభిస్తున్నట్టు తెలిపింది. సోమవారం నుంచి ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులను పంపాలని కోరింది.

మిషెల్‌కు ఫిబ్రవరి 27వరకు కస్టడీ

న్యూ ఢిల్లీ: అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణం కేసులో మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్‌కు ఢిల్లీ కోర్టు శనివారం జ్యుడిషియల్ కస్టడీ విధించింది. స్పెషల్ జడ్జి అరవింద్ కుమార్ ఎదుట మిషెల్‌ను హాజరుపరిచారు. మనీల్యాండరింగ్ కేసులో దర్యాప్తునకు జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించాల్సిందిగా ఈడీ కోరింది. దీంతో మిషెల్‌ను ఈడీ కేసులకు సంబంధించి ఫిబ్రవరి 26వరకు, సీబీఐ కేసులకు సంబంధించి ఫిబ్రవరి 27వరకు జ్యుడిషియల్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు.

అండమాన్‌లో 'ఎల్లో అలర్ట్'

'పబుక్' తుఫాను నేపథ్యంలో ప్రకటించిన కేంద్ర హోం శాఖ

న్యూఢిల్లీ: 'పబుక్' తుఫాను దూసుకొస్తుండటంతో అండమాన్, నికోబార్ దీవుల్లో 'ఎల్లో అలర్ట్' ప్రకటించినట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. ఈనెల 7వరకు సముద్రం కల్లోలంగా ఉంటుందని, అండమాన్ దీవులు, అండమాన్ సముద్రం, బంగాళాఖాతం పరిధి ప్రాంతాలపై ఈ ప్రభావం ఉంటుందని చెప్పింది. గల్ఫ్‌ఆఫ్ థాయ్‌లో పుట్టిన పబుక్ గంటకు 10 కిలోమీటర్ల వేగంతో ముందుకు సాగుతోందని హోం శాఖ అధికారి ఒకరు చెప్పారు. ఆదివారం నికోబార్ దీవుల్లో సముద్రం కల్లోలం మరింత తీవ్రంగా ఉంటుందని తెలిపారు.

హిమాచల్‌లో రోడ్డు ప్రమాదం, ఏడుగురు మృతి

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిరిమార్ జిల్లాలో శనివారం ప్రైవేటు స్కూల్ బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడింది. ఈ ఘటనలో ఆరుగురు విద్యార్థులు, డ్రైవర్ చనిపోయారు. కొండ ప్రాంతంలో మలుపు వద్ద బస్సు అదుపుతప్పడంతో ఈ ఘటన జరిగిందని అడిషనల్ కమిషనర్ లలిత్ జైన్ చెప్పారు. "చనిపోయినవారిలో ఆరుగురు పదేళ్లలోపు చిన్నారులు, 12మందికి గాయాలయ్యాయి. వారిని హాస్పిటల్‌కు తరలించి, ఘటనపై దర్యాప్తు చేస్తున్నాం' అని లలిత్ చెప్పారు.

యంగ్ లీడర్స్..

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోటికిపైగా యువ ఓటర్లు, 20 లక్షల మందికిపైగా కొత్తవారు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం 2018 మే నాటికి 1.37 కోట్ల మంది గ్రామీణ ఓటర్లుండగా.. డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 1.49 కోట్లకు చేరింది. అంటే 12 లక్షల మంది యువత కొత్తగా పంచాయతీ ఎన్నికల్లో ఓటేయనున్నారు. మొత్తంగా గ్రామీణ ఓటర్లలో 60 లక్షల మందికిపైగా 34 ఏళ్లలోపు వారే ఉంటారని అంచనా. దీంతో యువత ఓటర్లే పంచాయతీ ఎన్నికల గెలుపోటములను నిర్ణయించనున్నారు.



ఊరు కోసం ఉద్యోగాలు వదిలి..

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మర్లపాట్ తండా యువకుడు భాస్కర్ నాయక్ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. ఇప్పుడా ఉద్యోగాన్ని వదిలి సొంతూరు వెళ్లిపోయారు. ఇటీవలే గ్రామ పంచాయతీగా మారిన తమ తండాను అభివృద్ధి పథంలోకి నడిపించడానికే ఈ నిర్ణయం తీసుకున్నానని చెబుతున్నాడు. ఎల్ఎల్‌బీ చదువుతున్న పాతికేళ్ల యువకుడు విజయ్‌నాయక్ చాలాకాలంగా తమ ఊరిని పట్టి పీడిస్తున్న సమస్యలపై పోరాటానికి పంచాయతీ ఎన్నికలను వేదికగా చేసుకుంటున్నాడు. సూర్యాపేట జిల్లా ఉండ్రుగొండ పంచాయతీ నుంచి 24 ఏండ్ల శైలజ బరిలోకి దిగుతున్నారు. తమ గ్రామ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం, ఊర్లో మౌలిక వసతుల కల్పనే తన ధ్యేయమంటున్నారు ఆమె.

యువత రావాలి..

కొంతమంది అభ్యుదయవాదులు యువకులు రాజకీయాల్లోకి రావాలని, పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం స్వచ్ఛంద సంస్థ సభ్యులు పలు గ్రామాల్లో యువతను సమావేశపర్చి చైతన్యం కల్పిస్తున్నారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తున్నారు. చదువుకున్న యువత రాజకీయాల్లో ఉంటేనే దేశ భవిష్యత్ బాగుంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు కూచన మల్లయ్య చెబుతున్నారు.

మా ఊరు.. మా మేనిఫెస్టో

మెదక్ జిల్లా లక్ష్మీనగర్‌లో వినూత్న ప్రయోగం

మెదక్, వెలుగు: సాధారణంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎలక్షన్ల సమయంలో రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలు రూపొందించి ప్రకటిస్తుంటాయి. కానీ మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామం పంచాయతీ ఎన్నికల కోసం ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించుకుని ప్రత్యేకత చాటుతోంది. లక్ష్మీనగర్ విలేజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 12 పేజీల బుక్‌లెట్‌గా ఈ విలేజ్ పీపుల్స్ మేనిఫెస్టోను సిద్ధం చేసుకున్నారు. గ్రామాభివృద్ధి కోసం అందరూ కలసి చేయాల్సిన పనులు, పెండింగ్ పనులు, గ్రామ సభ నిర్వహణకు, సేంద్రియ వ్యవసాయం, స్వయం ఉపాధి కోర్సులు, యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, వైద్య శిబిరాల నిర్వహణ, స్వయం సహాయక సంఘాల మహిళల సమావేశాల నిర్వహణ వంటి వాటి కోసం అన్ని వసతులతో వేదికల ఏర్పాటు, పశువైద్యశాల, ఫంక్షన్ హాల్, గెస్ట్‌హౌజ్, గ్రౌండ్ ఏర్పాటు వంటి అంశాలను అందులో చేర్చారు. అలాగే ప్రజల



డిమాండ్లు, గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలిపే అవకాశాన్ని కల్పించారు. ఈ అంశాలన్నింటిపై హామీ ఇస్తూ సర్పంచ్ అభ్యర్థులు రూ.100 బాండ్ పేపర్ మీద ఒప్పంద పత్రం ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. లక్ష్మీనగర్ గ్రామ జనాభా 946. అందులో ఓటర్లు 832 మంది. త్వరలోనే ఊర్లో ప్రతి ఇంటికి విలేజ్ పీపుల్స్ మేనిఫెస్టో బుక్‌లెట్లను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉన్నతాశయంతో రాజకీయాల్లోకి..

నేను ఎల్ఎల్‌బీ పూర్తి చేశాను. మాది తిమ్మాపూర్ మండలం నేదునూరు. ఎల్ఎండీ ముంపు గ్రామం. రోశయ్య సీఎంగా ఉన్నప్పుడు మా ఊళ్లో పవర్‌ప్లాంట్ పెడతామంటే, ఉద్యోగాలొస్తాయని ఆశపడి రైతులు భూములిచ్చారు. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు పూర్తిజేయలె. ముంపు బాధితులకు పునరావాసం కల్పించలే. నేను గెలిస్తే ఈ రెండింటిని సాధించి తీరుతా.

- వడ్లూరి శంకర్, కరీంనగర్

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

మాది నర్సంపేట మండలం ఇటిక్యాలపల్లి. సర్పంచులుగా గెలిచినవారు వాళ్ల స్వార్థమే చూసుకుంటున్నారు. లక్షలు పోసి గెలిచి మళ్లీ సంపాదించుకునేందుకు పదవిని వాడుకుంటున్నారు. ఊరికి రావాల్సిన నిధులపై అధికారులను ప్రశ్నించలేకపోతున్నారు. గ్రామంలో రోడ్లు, వీధి లైట్లు వంటి మౌలిక వసతుల కల్పన, అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయడమే నా లక్ష్యం. ఆదర్శ గ్రామంగా నిలిచిన గంగదేవిపల్లికి వెళ్లి అవగాహన తెచ్చుకున్నా. ఇటిక్యాలపల్లిని ఆధునిక వ్యవసాయంలో ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతా..

- నాంపల్లి మురళీధర్, వరంగల్ రూరల్ జిల్లా

సంక్రాంతికి 5,252 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, వెలుగు:

సంక్రాంతి పండుగ నేపథ్యంలో టీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోందని ఆర్ఎం యాదగిరి తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు 5,252 బస్సులు నడుపుతామన్నారు. ఎంజీబీఎస్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులపై 50శాతం అదనపు చార్జీ వసూలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఏపీలోని ముఖ్య పట్టణాలకు ప్రత్యేక బస్సులు వేసినట్లు చెప్పారు. ఆదిలాబాద్‌కు 225, నిజామాబాద్‌కు 291, కరీంనగర్‌కు 670, వరంగల్‌కు 454, ఖమ్మంకు 674, నల్లగొండకు 411, మెదక్‌కు 200 బస్సులు, ఏపీలోని వివిధ ప్రాంతాలకు 1,579 బస్సులు నడపనున్నట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు వెయ్యి బస్సులకు వెసులుబాటు కల్పించామన్నారు. www.tsrtconline.in లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని సూచించారు. రిజర్వేషన్లలో విశాఖ, అమలాపురం, రాజోలు వంటి ప్రాంతాలకు డిమాండ్ ఉందని పేర్కొన్నారు. సమాచారం కోసం ఆర్టీసీ అధికారులు 24గంటలు అందుబాటులో ఉంటారన్నారు.

బస్సులు ప్రారంభమయ్యే సెంటర్లు ఇవే..

హైదరాబాద్‌లో రద్దీ దృష్ట్యా బస్సుల ప్రారంభ పాయింట్లను మార్చామని ఆర్ఎం చెప్పారు. అంతర్రాష్ట్ర, వోల్వో బస్సులకు మాత్రం మినహాయింపు ఉందన్నారు. 'నల్లగొండ వెళ్లే బస్సులు దిల్‌సుఖ్‌నగర్ నుంచి, వరంగల్ బస్సులు ఉప్పల్ నుంచి ఉంటాయి. కర్నూలు, అనంతపురం జిల్లాలకు వెళ్లే రెగ్యులర్ బస్సులు ఎంజీబీఎస్ నుంచి, స్పెషల్ బస్సులు సీబీఎస్ నుంచి ఉంటాయి. వికారాబాద్, తిరుపతి, మహబూబ్‌నగర్, బెంగళూరు బస్సులు ఎంజీబీఎస్ నుంచి వెళ్తాయి. విజయవాడ వైపు వెళ్లే బస్సులు మాత్రం సిటీలోని పలు సెంటర్ల నుంచి అందుబాటులో ఉంటాయి.' అని ఆయన తెలిపారు.



- 10వ తేదీ నుంచి అందుబాటులోకి
- 50% అదనపు చార్జీ వసూలు
- రంగారెడ్డి ఆర్ఎం యాదగిరి

నాలుగు ప్రత్యేక రైళ్లు..

పండుగ రద్దీ దృష్ట్యా నాలుగు ప్రత్యేక రైళ్లు నడుపుతామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. 11న గం.4.30కు సికింద్రాబాద్ నుంచి సికింద్రాబాద్-విశాఖపట్నం సువిధ రైలు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఇదే రైలు 12వ తేదీ మధ్యాహ్నం 3.35గంటలకు తిరిగి సికింద్రాబాద్‌కు వస్తుందన్నారు. 17న రాత్రి 9గంటలకు కాకినాడ పోర్ట్ నుంచి కాకినాడ పోర్ట్-లింగంపల్లి సువిధ రైలు వస్తుందన్నారు. 20న 9.50 గంటలకు మచిలీపట్నంలో మచిలీపట్నం-సికింద్రాబాద్ సువిధ రైలు బయలుదేరుతుందని తెలిపారు.

బీసీలు ఎదగొద్దనే రిజర్వేషన్ల తగ్గింపు


- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం
- సుప్రీంలో రిట్ పిటిషన్ వేయాలి: ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్,వెలుగు: బీసీలు నాయకులుగా ఎదగొద్దనే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు తగ్గించారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. రిజర్వేషన్ల తగ్గింపు ఆర్డినెన్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల తగ్గింపును వ్యతిరేకిస్తూ శనివారం ఇందిరాపార్క్ వద్ద టీజేఎస్ నిరసన దీక్ష చేపట్టింది. కోదండరాం మాట్లాడుతూ.. రాజకీయాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగితేనే రాజకీయ వ్యవస్థ బలపడుతుందని చెప్పారు.తగ్గించిన రిజర్వేషన్లు రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ కొనసాగుతాయని చెప్పారు. గతంలో సమస్య న్యాయస్థానంలో ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం 34 % రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య గుర్తు చేశారు. బీసీలపై కసితోనే కేసీఆర్ రిజర్వేషన్లు తగ్గించారని విమర్శించారు. దీంతో 1,500 మంది బీసీలు సర్పంచ్ అయ్యే అవకాశం కోల్పోయారన్నారు. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వే ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల్లోనూ ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేయాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు.

సెల్ఫీ దిగబోయి..

- ఐర్లాండ్‌లో ఇండియన్ స్టూడెంట్ మృతి

లండన్: ఐర్లాండ్‌లోని 'క్లిఫ్స్ ఆఫ్‌మొహర్' సందర్శనకు వెళ్లిన ఇండియన్ స్టూడెంట్ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయాడు. కొండ శిఖరంపై సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో కాలుజారి కిందపడ్డాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే చనిపోయాడని అధికారులు చెప్పారు. చుట్టూ ఉన్న టూరిస్టులు చూస్తుండగానే ఈ ఘటన జరిగిందన్నారు. మృతుడు డబ్లిన్‌లో చదువుతున్న ఇండియన్‌స్టూడెంట్ అని వారు ధ్రువీకరించారు. చనిపోయిన విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియ రాలేదని చెప్పారు. కాగా, అక్కడున్న వందలాది టూరిస్టులను విచారించి, ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందేనని పోలీసులు నిర్ధారించారు. మృతుడి వివరాలు పరిశీలించి, ఇండియాలోని సంబంధీకులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 2017లో ఓ హంగేరియన్‌కూడా ఇలాగే చనిపోయాడని అధికారులు చెప్పారు.



మేఘాలయ సర్కార్‌కు వంద కోట్ల జరిమానా

జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పు

న్యూఢిల్లీ : అక్రమ మైనింగ్‌ను ఆపలేకపోయినందుకు మేఘాలయ ప్రభుత్వానికి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) రూ.100 కోట్ల జరిమానా విధించింది. 2014లో బొగ్గు గనుల అక్రమ మైనింగ్‌ను నిషేధించాలని ఎన్జీటి తీర్పునిచ్చింది. దీన్ని అమలు చేయడంలో విఫలమైనందుకు, రెండు నెలల్లోగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) వద్ద రూ.100కోట్లు జమ చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఎన్జీటి ఆదేశించింది. అలాగే అక్రమంగా బొగ్గు తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాల్లో క్రేన్లను, ఇతర వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించింది. మేఘాలయలోని ఓ అక్రమ బొగ్గు గనుల్లో 23 రోజుల కిందట 15 మంది కార్మికులు చిక్కుకుపోయారు. డిసెంబరు 13న గనిలో చిక్కుకుపోయిన కార్మికుల ఆచూకీ ఇప్పటి వరకు తెలియ రాలేదు. దీని పై మేఘాలయ సర్కార్ పై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

32 ఏండ్లుగా అక్కడ 'పంచాయతీ' లేదు!

మంచిర్యాల, వెలుగు:

పంచాయతీ ఎన్నికల వేళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసక్తికర అంశాలు తెరపైకొస్తున్నాయి. 32 ఏళ్లుగా పంచాయతీ ఎన్నికలకు దూరంగా ఉన్న ఓ గ్రామం 'సర్పంచ్' కోసం ఉద్యమ బాట పడితే.. వద్దన్నా తమను విడదీసి 'పంచాయతీ' పెట్టారని మరో గ్రామం పోరు చేస్తోంది.

గిరిజనులే లేరు.. 'ఎస్టీ' రిజర్వేషన్

మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం గూడెం గ్రామం రంగంపల్లి అనే పల్లెతో కలిపి పంచాయతీగా కొనసాగుతోంది. 2,953 మంది జనాభా, 707 కుటుంబాలు, 1,749 మంది ఓటర్లు. ఏదైనా గ్రామాన్ని ఏజెన్సీగా గుర్తించాలంటే 50% గిరిజనులుండాలి. ఈ గ్రామంలో గిరిజనులెవరూ లేరు. కానీ రిజర్వేషన్ మాత్రం ఎస్టీ. 1987 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం.. గూడెంను షెడ్యూల్ తెగలకు రిజర్వ్ చేశారు. సర్పంచ్‌తోపాటు పది వార్డుల్లో ఐదు వార్డులు ఎస్టీలకు కేటాయించారు. దీంతో సర్పంచ్, ఐదు వార్డులకు నామినేషన్లు వేసే పరిస్థితి లేదు. మిగిలిన ఐదు వార్డుల్లో ఎన్నికలనూ వీరు బహిష్కరిస్తూ వస్తున్నారు. ఊరు పేరు గూడెం కావడం, గుట్టల మధ్య ఇది ఉండడంతో అప్పట్లో దీన్ని గిరిజన గ్రామంగా నోటిఫైడ్ చేసి ఉండొచ్చు. ఈ సారి కూడా రిజర్వేషన్ ఎస్టీ కావడంతో ఎన్నికలు డౌటే. రిజర్వేషన్‌ను జనరల్‌గా మార్చాలని గ్రామస్తులు ఏళ్లుగా ఆందోళన చేస్తున్నారు. 1996లో లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించారు. గత ఎన్నికల సమయంలో 'ఊరు కోసం.. పోరు దీక్ష' అంటూ పెద్ద ఉద్యమమే నడిపారు. అయినా



- మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం 'గూడెం' పరిస్థితి
- ఒక్క గిరిజనుడూ లేకున్నా ఏజెన్సీ గ్రామంగా నోటిఫైడ్
- 'జనరల్'గా మార్చాలని ఏళ్లుగా పోరాటం

ఫలితం లేదు. రాష్ట్రపతి డీనోటిఫై చేస్తే తప్ప ఇక్కడ ఎన్నికలు జరిగే అవకాశం లేదు.

ఎవర్నడిగి 'పంచాయతీ' చేశారు?

రాష్ట్రమంతటా 'మాకు ప్రత్యేక గ్రామ పంచాయతీ' కావాలని ఉద్యమాలు జరుగుతుంటే.. ఓ గ్రామం మాత్రం తమను ఎందుకు విడదీసి పంచాయతీగా మార్చారని గరంగరం అవుతోంది. మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం వెంకటాపూర్ పంచాయతీ నుంచి విడిపోయిన వందుర్‌గూడ పరిస్థితి ఇది. ఇన్నాళ్లూ వెంకటాపూర్ పంచాయతీలో కొనసాగిన వందుర్‌గూడను ప్రభుత్వం కొత్త పంచాయతీగా ప్రకటించింది. 600లకుపైగా జనాభా ఉన్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నా..190 మంది జనాభా, 162 మంది ఓటర్లు ఉన్నారు. ఇది 'షెడ్యూల్డ్ ప్రాంతం' అని, ఏ నిర్ణయం తీసుకోవాలన్నా 'పెసా' చట్టం ప్రకారం గ్రామ సభ పెట్టాలనే నిబంధన ఉన్నా, అధికారులు ఇష్టానుసారం చేశారని గ్రామస్తులంటున్నారు. వందుర్‌గూడను వెంకటాపూర్‌లోనే ఉంచాలంటూ వీరంతా ఇటీవల మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. గ్రామంలో ఫ్లెక్సీలు కట్టి నల్లగుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. వెంకటాపూర్‌లో కలపకుంటే ఓటెయ్యమని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.



మెరికల్లారా, ఇక్కడే ఉండండి

- విదేశీ విద్యార్థులకు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ పిలుపు
- గొప్ప ప్రతిభావంతులను కోల్పోతున్నామని వ్యాఖ్య

వాషింగ్టన్: ''ప్రతిభ ఉన్న విదేశీ విద్యార్థులు అమెరికాలోని ఉత్తమ ఇన్‌స్టిట్యూట్లలో చదువుకుని తర్వాత దేశాన్ని వదిలి వెళ్తున్నారు. మెరిట్ ఉన్న వాళ్లందరూ ఇక్కడే ఉండండి. అమెరికా కంపెనీల అభివృద్ధికి సాయపడండి'' అని యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో ట్రంప్ మాట్లాడుతూ, అమెరికా గొప్ప గొప్ప ప్రతిభావంతులను కోల్పోతోందని, ఇక్కడి తెలివితక్కువ ఇమిగ్రేషన్ పాలసీ వల్లే ఇలా జరుగుతోందని విమర్శించారు. లీగల్ ఇమిగ్రేషన్ సిస్టమ్‌లోని లొసుగులకు ముగింపు పలకడం ద్వారా మెరిట్ ఆధారంగా విదేశీయుల రాకను ప్రోత్సహించాలని చెప్పారు. ఎవరైనా సరే చట్టబద్ధంగా, ప్రతిభ ఆధారంగానే అమెరికాకు వలస రావాలని తాము భావిస్తున్నామన్నారు. ''మనకు గొప్ప ప్రతిభ కలిగిన వ్యక్తులు కావాలి. అయితే ఇన్నాళ్లూ అందరూ వచ్చినట్లుగా వాళ్లు దేశంలోకి రాకూడదు. మెరిట్ ఆధారంగానే రావాలి''అని ట్రంప్ అన్నారు.

ఇలా జరగకూడదు

''నాకు పెద్ద పెద్ద టెక్ కంపెనీల నుంచి ఫోన్లు వస్తున్నాయి. దేశంలోని ఉత్తమ ఇన్‌స్టిట్యూట్లలో చదువుకున్న వారిని ఇక్కడ టాప్ స్థానాల్లో ఉంచలేకపోతున్నామని ఆ కంపెనీలు చెబుతున్నాయి. దీంతో ప్రతిభ గల వారంతా తిరిగి చైనా, జపాన్ వంటి దేశాలకు తరలివెళ్తున్నారు. ఇలా జరగకూడదు. మనం గొప్ప ప్రతిభావంతులను కోల్పోతున్నాం'' అని చెప్పారు.

విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉద్యోగం చేసుకునే విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపైనా ట్రంప్ మాట్లాడారు. దీనిపై వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో డెమోక్రటిక్ కాంగ్రెషనల్ నాయకత్వంతో చర్చించినట్లు చెప్పారు. ఆశ్రయం కోరుకునే వారికి చట్టబద్ధమైన దారులు ఉన్నాయన్నారు.

అవసరమైతే ఎమర్జెన్సీ పెడతా

గోడ కడతా !





- మెక్సికో బోర్డర్‌లో కట్టితీరతాం
- దేశ భద్రత కోసం దేనికైనా సిద్ధం
- అమెరికా ప్రెసిడెంట్‌ట్రంప్

వాషింగ్టన్:

మెక్సికో బోర్డర్‌లో గోడ నిర్మించే విషయంలో వెనక్కు తగ్గేదిలేదని అమెరికా ప్రెసిడెంట్‌ట్రంప్ మరోసారి స్పష్టంచేశారు. అవసరమైతే నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటించైనా గోడను కడతామని అన్నారు. దేశ భద్రత విషయంలో రాజీపడేది లేదని తేల్చిచెప్పారు. అక్రమ వలసలను అడ్డుకోడానికి మెక్సికో బోర్డర్‌లో గోడ కట్టాలని ట్రంప్ సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం 5 బిలియన్‌డాలర్లు కేటాయించాలంటూ స్పెండింగ్ బిల్లులో ప్రతిపాదించింది. ఈ బిల్లును డెమోక్రాట్లు అడ్డుకున్నారు. సొంత పార్టీ నేతల్లోనూ అసంతృప్తి వ్యక్తమైంది. ఈ విషయంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ట్రంప్‌ఇంతకుముందే ప్రకటించారు. సభలో స్పెండింగ్ బిల్లు ఆమోదం పొందకపోవడంతో ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వం కూడా స్తంభించింది. దేశవ్యాప్తంగా 8 లక్షలకు పైగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు మూడు వారాలుగా జీతాలు నిలిచిపోయాయి. షట్‌డౌన్ కొనసాగుతుండడంతో ప్రజలు, ఉద్యోగులకు అవస్థలు తప్పడంలేదు. ఈ నేపథ్యంలో స్పెండింగ్ బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం డెమోక్రాట్లతో చర్చలు జరుపుతోంది. గోడ కట్టేందుకు అంత మొత్తంలో నిధులు కేటాయించేందుకు వారు అంగీకరించడంలేదు. శుక్రవారం జరిగిన చర్చలు కొంత ఫలవంతంగా జరిగాయని రిపబ్లికన్లు చెబుతున్నారు. ఓవైపు చర్చలు జరుగుతుండగా మరోవైపు ఎంపీల అనుమతితో పని లేకుండా బిల్లును పాస్‌చేసేందుకు నేషనల్ ఎమర్జెన్సీ విధించే అవకాశాన్నీ పరిశీలిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. దేశభద్రత విషయంలో దేనికైనా సిద్ధమేనని ప్రకటించారు.

ఎమర్జెన్సీ విషయంలో ప్రెసిడెంట్ ట్రంప్ వ్యాఖ్య కేవలం బెదిరింపు చర్యేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎమర్జెన్సీ విధిస్తే స్పెండింగ్ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం అక్కర్లేదు. గోడకు అవసరమైన నిధుల కేటాయింపులో కాంగ్రెస్ ఆంక్షలు పనిచేయవు. బిల్లును పాస్‌చేసి గోడ నిర్మాణం కొనసాగించవచ్చు. అయితే, ఇలా ఎమర్జెన్సీ సమయంలో జారీ చేసిన బిల్లు కావడం తో దానికి అవసరమయ్యే నిధులు కూడా డిఫెన్స్‌శాఖకు కేటాయించిన నిధులనే ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. అంటే, ఇతర అవసరాలకోసం రక్షణ శాఖకు కేటాయించిన సొమ్ములోంచి ఈ గోడకు నిధులు సమకూర్చుకోవాలన్నమాట. పైపెచ్చు ఎమర్జెన్సీ విధించడం కూడా అంత తేలిక కాదని విశ్లేషకులు అంటున్నారు.


డ్రీమర్స్‌కోసం డెమోక్రాట్ల పట్టు

చిన్నతనంలో అక్రమంగా దేశంలోకి అడుగుపెట్టి, గ్రీన్ కార్డ్‌కోసం ఎదురుచూసే వాళ్లను డ్రీమర్స్‌అని పిలుస్తారు. వీళ్లను కూడా వారివారి సొంత దేశాలకు పంపించేయాలని ట్రంప్‌సర్కారు ప్రయత్నిస్తోంది. కానీ ఏళ్ల తరబడి ఇక్కడే పెరిగిన వారిని వెనక్కి పంపించొద్దని, డిపోర్టేషన్‌నుంచి వారికి రక్షణ కల్పించాలని డెమోక్రాట్లు డిమాండ్‌చేస్తున్నారు. అయితే, వీళ్ల కోసం బోర్డర్ వాల్ విషయంలో రాజీపడబోమని చెబుతున్నారు.

షట్‌డౌన్ ప్రభావం..

అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ కార్యకలాపాలకోసం విడుదలయ్యే ప్రభుత్వ నిధులకు కోత పడుతుంది. ప్రస్తుతం 25 శాతం విభాగాలకు నిధులు నిలిచిపోయాయి. ప్రభుత్వంలోని తొమ్మిది విభాగాలు.. హోంలాండ్ సెక్యూరిటీ, జస్టిస్, హౌజింగ్, అగ్రికల్చర్, కామర్స్, ఇంటీరియర్, ట్రెజరీ డిపార్ట్‌మెంట్లపై షట్‌డౌన్ ప్రభావం పడింది. ఫెడరల్ ఫండింగ్ అందుకునే నేటివ్ అమెరికన్ తెగలు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. సిబ్బంది రాకపోవడంతో జాతీయ పార్కుల్లో భద్రత కొరవడింది. సందర్శకులకు ప్రమాదకరంగా తయారయ్యాయి.

ట్రంప్‌కు డెమోక్రాట్ రాజా మద్దతు



వాషింగ్టన్: మెక్సికో బోర్డర్‌లో అడ్డుగోడ ఉండాల్సిందేనని భారత సంతతి అమెరికన్, డెమోక్రాటిక్ నేత రాజా కృష్ణమూర్తి చెప్పారు. ఈ విషయంలో ప్రెసిడెంట్‌ట్రంప్‌కు మద్దతిస్తానని తేల్చి చెప్పారు. అక్రమ వలసలను అడ్డుకోవడానికి భౌతికంగా ఓ నిర్మాణం అవసరమేనని అన్నారు. ఇప్పటికే అక్కడ ఫెన్సింగ్‌ఉంది కానీ అది మాత్రమే సరిపోదని కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. అక్రమ వలసలను అడ్డుకోవడానికి, బోర్డర్‌ను రక్షించుకోవడానికి అంతా పోరాడాలని పిలుపునిచ్చారు. బోర్డర్‌లో గోడకట్టే విషయంలో కాంగ్రెస్ సభ్యుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. డెమోక్రాట్లతో పాటు కొందరు సొంతపార్టీ నేతలు కూడా ట్రంప్‌నిర్ణయాన్ని తప్పుబట్టారు. గోడ నిర్మాణంవల్ల ప్రజాధనం వృధా అవుతుందని వాదిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షానికి చెందిన కృష్ణమూర్తి ప్రెసిడెంట్‌కు మద్దతుగా మాట్లాడడం విశేషం.

మోడీని రెండు ప్రశ్నలు అడగండి

ప్రజల్ని కోరిన కాంగ్రెస్ చీఫ్ రాహుల్

న్యూఢిల్లీ : రాఫెల్ డీల్ పై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ దాడిని కొనసాగిస్తూనే ఉన్నారు. ఒప్పందానికి సంబంధించి పార్లమెంటులో శుక్రవారం రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ కు తాను రెండు చిన్న ప్రశ్నలు వేస్తే, ఆమె జవాబు చెప్పలేదన్నారు.ఈనేపథ్యంలో ఆ రెండు ప్రశ్నలను ప్రజలు, ప్రధాని మోడీని అడగాలన్నారు.

ఈమేరకు శనివారం ఆయన ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ తో పాటు పార్లమెంటులో తాను వేసిన రెండు ప్రశ్నలకు సంబంధించిన వీడియోను రాహుల్ జత చేశారు. ఈ వీడియోను అందరికీ షేర్ చేయాలన్నారు. రాహుల్ అడిగిన ప్రశ్నలు ఇవి :

- అనిల్ అంబానీకి ఆఫ్‌సెట్ కాంట్రాక్ట్ ఎవరు ఇచ్చారు ?
- రాఫెల్ డీల్ ను ప్రధాని మోడీ మార్చినప్పుడు రక్షణ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పారా ?

ఈ రెండు ప్రశ్నలకు ' అవును ' లేదా ' కాదు ' అని సమాధానం చెప్పాలని రాహుల్ కోరారు.

దాడులు ఆగలేదు

శబరిమల చల్లారలేదు



- బీజేపీ ఎంపీ ఇంటిపైనా బాంబు దాడులు
- కేరళ అంతటా హైఅలర్ట్

కన్నూర్/ తిరువనంతపురం: శబరిమల వివాదంతో కేరళ అట్టుడికిపోతోంది. అయ్యప్ప ఆలయంలో 50 ఏళ్లలోపు మహిళలకు ప్రవేశం కల్పించడాన్ని నిరసిస్తూ హిందూ సంస్థలు చేస్తున్న ఆందోళనలు శనివారం కూడా కొనసాగాయి. విధ్వంసానికి పాల్పడిన 1800 మంది ఆందోళనకారుల్ని ఇంతవరకు అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు. ఉత్తర కేరళలోని కన్నూర్ జిల్లాలో బీజేపీఆరెస్సెస్, అధికార సీపీఎం కార్యకర్తలు విధ్వంసానికి పాల్పడ్డారు. పలువురి ఇళ్లు, షాపులపై దాడులు జరిగాయి. ఆందోళనకారులు చాలా చోట్ల బాంబులు విసురుకున్నారు. శనివారం తెల్లవారుజామున మాడపీడికాయిల్‌లో సీపీఎం ఎమ్మెల్యే ఎ.ఎన్. షంషీర్ ఇంటిపై బాంబుతో దాడులకు పాల్పడ్డారు. వేదియిల్ పీడికియలో బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ వి.మురళీధరన్ ఇంటిపైనా బాంబులు విసిరారు. తలస్సెరి దగ్గర కన్నూర్ జిల్లా సీపీఎం జిల్లా మాజీ సెక్రటరీ పి.శశి ఇంటిపైనా దాడి జరిగింది. అయితే ఈ దాడుల్లో ఎవరూ గాయపడలేదని పోలీసులు చెప్పారు.ఈ వరుస దాడులతో ఏడాదిపాటుగా ప్రశాంతంగా ఉన్న కన్నూర్ జిల్లాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కన్నూర్‌తోపాటు కోజికోడ్‌కు దగ్గర్లోని పెరంబ్రా, పథనంథిట్ట జిల్లాలోని ఆదూర్, మలప్పురమ్ జిల్లాలో కూడా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత, శనివారం తెల్లవారుజాము నుంచి వరుస బాంబు దాడులు జరిగాయి. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా హైఅలర్ట్‌ను ప్రకటించారు. దాడులకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ లోక్‌నాథ్ బెహరా ఆదేశాలు జారీచేశారు. కన్నూర్ విధ్వంసానికి సంబంధించి శుక్ర, శనివారాల్లో 260 మందిని అరెస్టు చేశారు. మరో ఘటనలో పెరియరమ్‌లోని ఆరెస్సె ఆఫీసుకు గుర్తు తెలియని కొందరు నిప్పు పెట్టారు. పెరుంబరలో సీపీఎం కార్యకర్తపై శుక్రవారం రాత్రి దాడి జరిగింది. తలస్సెరిలో ఆరెస్సెస్ నాయకుడు కె.చంద్రశేఖరన్‌పై దాడిచేయడమేకాకుండా ఆయన ఇంటిని కూడా ధ్వంసం చేశారు. 25 మంది లెఫ్ట్ కార్యకర్తలు ఈ దాడిలో పాల్గొన్నారని ఆరెస్సెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ దాడులకు మీరు కారణమంటే మీరు కారణమని బీజేపీఆరెస్సెస్, సీపీఎం పరస్పరం విమర్శలు చేసుకున్నాయి. మరోవైపు, రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు ఆరెస్సెస్ ప్రయత్నిస్తోందని సీపీఎంరాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ ఆరోపించారు. శాంతిచర్చల్ని అడ్డుకునేందుకు ఆరెస్సెస్ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. తమ ఆధ్వర్యంలో నడుస్తున్న దేవాలయాలు, విద్యాసంస్థలను ఆరెస్సెస్‌బీజేపీ ఆయుధాగారాలుగా మార్చుతున్నాయని బాలకృష్ణన్ ఆరోపించారు.

యూపీఏ హయాంలో

'రక్షణ వ్యవస్థ బలహీనానికి కుట్ర'

బారిపద (ఒడిశా) : యూపీఏ హయాంలో దేశ రక్షణ వ్యవస్థను బలహీనపరడానికి కుట్ర జరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. ఈ విషయాలు ఒక్కటొక్కటిగా ఇప్పుడే బయటపడుతున్నాయన్నారు. దీనిని కాంగ్రెస్ లీడర్లు జీర్ణించుకోలేక కేంద్ర ప్రభుత్వం పై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఒడిశాలోని బారిపదలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో మోడీ ఆరోపించారు. ఈనేపథ్యంలో దేశానికి కాపలాదారుడి (చౌకీదార్)గా ఉన్న వ్యక్తిని తొలగించాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారన్నారు. '' కాపలాదారుడు ఉన్నంత కాలం వారి ఆటలు సాగవు '' అని ఆయన అన్నారు. ఆగస్టా వెస్ట్ లాండ్ కుంభకోణాన్ని ప్రస్తావిస్తూ, ఇందులో మధ్యవర్తిగా ఉన్న క్రిస్టియన్ మిషెల్ కు అప్పట్లో ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఒ) లో జరిగిందంతా తెలుసునన్నారు. రక్షణ వ్యవహారాలకు సంబంధించి కేబినెట్ కమిటీ లో ఏమేం చర్చలు జరిగాయో కూడా తెలుసునన్నారు. ''బహుశా అప్పటి ప్రధాని కంటే మిషెల్ దగ్గరే ఎక్కువ సమాచారం ఉండొచ్చు '' అని మోడీ అన్నారు. ఈపరిస్థితుల్లో క్రిస్టియన్ మిషెల్ ను కాపాడటానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.



పలములో పీఎం ఆవాస్ యోజన పథకం లబ్దిదారుకు ఇంటి తాళాలు ఇస్తున్న ప్రధాని మోడీ

వాళ్లకు రైతులంటే ఓటు బ్యాంక్

- కాంగ్రెస్ పై ప్రధాని మోడీ ఆరోపణలు
- జార్ఖండ్ పర్యటనలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన

దల్తోన్ గంజ్ (జార్ఖండ్):

రైతుల్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగానే చూశాయి తప్ప వారి సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. తాము వారిని అన్నదాతలుగా చూస్తున్నామన్నారు.రైతులకు సంబంధించి కాంగ్రెస్, బీజేపీకి మధ్య ఉన్న తేడా అదేనన్నారు. ప్రధాని మోడీ శనివారం జార్ఖండ్ పర్యటన సందర్భంగా అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పలములో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ కాంగ్రెస్ పనితీరుపై మండిపడ్డారు. గత ప్రభుత్వాలు రైతులకు చేసింది ఏమీ లేదన్నారు. కేవలం కబుర్లు చెప్పి కాలం గడిపాయని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలు కాంగ్రెస్ పట్టించుకోలేదనడానికి ఆగిపోయిన మండల్ ఆనకట్ట నిర్మాణ పనులే నిదర్శనమని మోడీ చెప్పారు. రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోందే గడవని స్థితిని కాంగ్రెస్ కల్పించిందన్నారు. అలాంటి కాంగ్రెస్ ఇప్పుడు రుణ మాఫీ పై రైతులను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. అయితే జార్ఖండ్, బీహార్ ప్రభుత్వాలు మాత్రం రైతుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని ఆయన మెచ్చుకున్నారు. రూ. 2,391.36 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న మండల్ డ్యామ్ కు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ డ్యాం పూర్తయితే మొత్తం 19,604 హెక్టార్ల భూమికి నీటి సదుపాయం కలుగుతుంది. ఈ ఆనకట్ట వల్ల బీహార్ లోని గయతో పాటు జార్ఖండ్ లోని వేలాది ఎకరాల భూమికి నీరు అందుతుంది.

అందరికీ ఇళ్లు, అదే మా లక్ష్యం

పట్టణ లేదా పల్లె ప్రాంతాలు ఎక్కడైనా సరే అందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నదే తమ సర్కార్ లక్ష్యమని మోడీ చెప్పారు. దీనికోసమే ' ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన ' (పీఎంఏవై) పథకాన్ని తీసుకొచ్చామన్నారు. గ్యాస్ కనెక్షన్, కరెంటు,టాయిలెట్ల వంటి అన్ని సదుపాయాలతో ఈ పథకం కింద ప్రభుత్వం పేదవారికి ఇళ్లు కట్టిస్తుందన్నారు. ఈసందర్భంగా కొంతమంది పీఎంఏవై లబ్దిదారులకు ఆయన ఇంటి తాళాలు అందచేశారు. పథకాల అమలులో పారదర్శకతకు కేంద్రం పెద్ద పీట వేసిందన్నారు. దళారీ వ్యవస్థను అంతం చేశామన్నారు. లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో డైరెక్ట్‌గా నిధులు జమ అయ్యేలా ఏర్పాట్లు చేశామని ప్రధాని అన్నారు.

ప్రభుత్వం వల్లే ఇదంతా: బీజేపీ

న్యూఢిల్లీ: కేరళలో ఆందోళనలు హింసాత్మకంగా మారడానికి ఎల్ డీఎఫ్ ప్రభుత్వమే కారణమని బీజేపీ ఆరోపించింది. సున్నితమైన అంశంపై కేరళ ప్రభుత్వం సరిగా వ్యవహరించలేదని తప్పుబట్టింది. ఇది హిందువులకు సంబంధించిన విషయం.. అధికార పార్టీ లేదా తమ పార్టీకి సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసింది. శనివారం బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నర్సింహారావు మీడియాతో మాట్లాడుతూ.." రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో సీపీఎం గూండాలు ఇదంతా చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలపై హింసకు పాల్పడిన చరిత్ర సీపీఎంకు ఉంది. అయితే ఇప్పుడు భక్తులను కూడా వదలట్లేదు. డీవైఎఫ్ఐ, ఎస్ డీపీఐ కార్యకర్తల ద్వారా హింసకు పాల్పడుతున్నారు. రెండ్రోజుల క్రితం భక్తుడు చనిపోయాడు. మా ఎంపీ ఇంటిపై బాంబు విసిరారు" అని అన్నారు.

కాలిఫోర్నియాలో మళ్లీ పేలిన గన్

ముగ్గురు మృతి, నలుగురికి గాయాలు

కాలిఫోర్నియా:

కాలిఫోర్నియాలో మరోసారి కాల్పుల కలకలం చోటుచేసుకుంది. శుక్రవారం అర్ధరాత్రి ప్రాంతంలో లాస్‌ఏంజిలిస్ దగ్గర్లోని గేమింగ్ జోన్‌లో ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారని పోలీసులు చెప్పారు. బుల్లెట్ గాయాలపాలైన నలుగురిని ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. బాధితులంతా మగవాళ్లేనని చెప్పారు. గేమింగ్ జోన్‌లో జరిగిన ఓ గొడవే దీనికి కారణమని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. కాల్పుల ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతానికి వెళ్లొద్దంటూ పోలీసులు ట్విట్టర్‌లో ప్రజలను హెచ్చరించారు.



యూపీలో కాంగ్రెస్ ఒంటరి పోరే..

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో అవసరమైతే ఒంటరిగానే పోటీ చేస్తామని కాంగ్రెస్ పేర్కొంది. రానున్న లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ లేకుండా యూపీ వరకు కూటమిని ఏర్పాటు చేయడానికి సమాజ్ వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ ఒక అంగీకారానికి వచ్చినట్లు వార్తలొచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ స్పందించింది. '' ఎవరెవరితో జత కడుతున్నారన్నది ముఖ్యం కాదు. ఎన్నికలకు మా కేడర్ సిద్ధంగా ఉంది. పొత్తుల గురించి మేం ఎవరితోనూ చర్చలు జరపలేదు '' అని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు పీఎల్ పూనియా అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతి శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు.

ఎంపీలో రైతు రుణ మాఫీకి కేబినెట్ ఓకే

భోపాల్ : మధ్యప్రదేశ్ లో రైతుల రుణ మాఫీకి కమల్ నాథ్ కేబినెట్ అంగీకరించింది. రెండు లక్షల వరకు రుణాన్ని మాఫీ చేస్తూ తీసుకున్న నిర్ణయానికి మధ్యప్రదేశ్ కేబినెట్ శనివారం ఓకే చెప్పింది. ఈమేరకు మధ్యప్రదేశ్ కేబినెట్ శనివారం ఒక నిర్ణయం తీసుకుంది. 2018 మార్చి 31 వరకు తీసుకున్న రుణాలను మాత్రమే మాఫీ చేస్తామని ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలిరోజుల్లో ముఖ్యమంత్రి కమల్ నాథ్ చెప్పారు. అయితే గడువును 2018 డిసెంబర్ 12 వరకు సర్కార్ పొడిగించింది. రుణ మాఫీ పై రైతుల్ని కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ ఎడాపెడా విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఎంపీ ప్రభుత్వం మాఫీకి కార్యాచరణ మొదలుపెట్టింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పెద్ద సంఖ్యలో రైతులకు లాభం కలుగుతుంది.

పొగమంచుతో ప్రమాదం



○ ఒకదానికొకటి నాలుగు వాహనాలు ఢీ

ఖమ్మం, వెలుగు: జిల్లా ప్రజలకు పొగ మంచు చుక్కలు చూపిస్తోంది. ఉదయాన్నే కురుస్తున్న పొగ మంచుతో మెయిన్ రోడ్డుపై వాహనాలకు ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా మంచు కురుస్తూనే ఉంది. శనివారం ఉదయం ఖమ్మం నగర శివారులో నిర్మిస్తున్న కొత్త కలెక్టరేట్ వద్ద పొగమంచు ప్రభావంతో నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ముందు వెళ్తున్న ట్యాంకర్ లారీ డ్రైవర్ ఒక్కసారిగా దగ్గరకు వచ్చిన వాహనాన్ని చూసి సడెన్ బ్రేక్ వేయగా, దాని వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. దాని వెనుక వచ్చిన మరో లారీ బస్సును ఢీకొట్టగా, ఆ తర్వాత వచ్చిన కారు లారీని ఢీకొట్టింది. ఒకదాని తర్వాత మరొకటిగా దగ్గరకు వచ్చినా పొగమంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడంతో ఈ ప్రమాదాలు జరిగాయని వాహనదారులు చెబుతున్నారు. సడన్ గా బ్రేక్ వేసినా అప్పటికే స్వల్పంగా నాలుగు వాహనాలు ఢీకొన్నాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకున్నా, వాహనాలు మాత్రం డ్యామేజీ అయ్యాయి. మరోవైపు నగరంలోని టీడీపీ ఆఫీస్ సమీపంలో ఓ చెట్టు శనివారం ఉదయం కూలిపోయింది. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారుడికి గాయాలయ్యాయి. బైక్ పై వెళ్తున్న సమయంలో చెట్టు ఒక్కసారిగా కూలి మీదపడడంతో బైక్ మీదనుంచి కింద పడ్డాడు.. స్థానికులు వచ్చి అతడిని కాపాడగా, తర్వాత మున్సిపాలిటీ సిబ్బంది వచ్చి చెట్టును తొలగించారు.

బీసీలను అణగదొక్కేందుకే రిజర్వేషన్ల తగ్గింపు

రాజన్నసిరిసిల్ల, వెలుగు: రాష్ట్ర ప్రభుత్వం బీసీలను అణగదొక్కడానికే రిజర్వేషన్లను తగ్గించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణాలో బీసీలు 53శాతం ఉంటే.. గతంలో ఉన్న 34 శాతాన్ని 23శాతానికి తగ్గించడం బాధాకరమన్నారు. బీసీలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా లెక్కలు చేసి చూపించకుండా సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపిస్తోందన్నారు. బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, జడ్పీ ఎన్నికలకు ఇవే రిజర్వేషన్లు వర్తిస్తే బీసీలు చాలా నష్టపోతారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సర్దుబాట్లో భాగంగా సపోర్ట్ చేయొచ్చని పార్టీ స్థానిక నేతలకు ఆదేశాలిచ్చామన్నారు. బీజేపీ కేంద్రంలో అవినీతిలో కూరుకుపోయిందని, రాఫెల్ కుంభకోణంపై సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికలు కార్పొరేట్ గా మారాయన్నారు. శబరిమలలో మహిళల ప్రవేశానికి సుప్రీంకోర్టు తీర్పునిస్తే.. మతతత్వ పార్టీలు రాజకీయం చేస్తున్నాయన్నారు. మల్లేశం, వేణు, అశోక్, కొమురయ్య ఉన్నారు.

తల్లి మరణిస్తుందని..

○ కొడుకు ఆత్మహత్య

నల్లగొండ, వెలుగు: కొన్ని గంటల్లో తన తల్లి చనిపోతుందని డాక్టర్లు చెప్పడంతో మనస్తాపానికి గురైన కొడుకు మర్రి ప్రకాష్ (30) రైలు కింద పడి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి మరణ వార్త తన చెవిన పడడం ఇష్టంలేక తల్లి కంటే ముందుగానే చనిపోవాలని డిసైడయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ మండలం అప్పాజిపేటకు చెందిన మర్రి ప్రకాష్(30) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అతడి తల్లి భానుమతి అలియాస్ గిద్దమ్మ (65) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు దవాఖానల చుట్టూ తింపాడు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించిందని, మరో రెండు గంటలకు మించి బతకదని శనివారం భానుమతిని పరీక్షించిన డాక్టర్లు చెప్పారు. దీంతో తన కళ్ల ఎదుట తన తల్లి చనిపోవడం చూసి తట్టుకోలేని ప్రకాష్ ఎల్లారెడ్డిగూడెం సమీపంలో శనివారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్సై అచ్యుతరావు తెలిపారు.

ఏ ఎన్నికల్లో అయినా నామినేషన్ కీలకమైంది. క్యాండిడేట్ల నామినేషన్ ఫారం సరిగా ఉంటేనే పోటీలో ఉండే అవకాశం ఉంటుంది. నామినేషన్ ఫారంలో అన్ని వివరాలు సరిగా రాయకున్నా, సరైన పత్రాలు జతచేయకున్నా స్క్రూటినీలో రిజెక్ట్ అవుతుంది. అపుడు పోటీ చేసే అవకాశం కోల్పోతారు. అందువల్ల ఈ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ నియమ నిబంధనలు, జతచేయాల్సిన పత్రాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...



తొలిదశకు పాత ఖాతా ఓకే

హైదరాబాద్ : గ్రామ పంచాయతీ తొలిదశ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల బ్యాంక్ ఖాతాల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కొంత వెసులుబాటు కల్పించింది. తొలిదశ ఎన్నికలకు సోమవారం(7వతేదీ) నుంచి నామినేషన్ దాఖలు ప్రారంభం కానుంది. అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలను తెరవాల్సి ఉంది. ఈనెల 8, 9 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె కారణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం తొలిదశ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమకు ఇప్పటికే ఉన్న బ్యాంకు ఖాతాను ఎన్నికల ఖాతాగా చూపించే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు శనివారం రాత్రి ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. అయితే పాత బ్యాంకు అకౌంట్ లో ఎన్నికలు పూర్తి అయ్యేంత వరకు(ఈనెలాఖరు) ఎన్నికల ఖర్చు లావాదేవీలు తప్ప ఇతర లావాదేవీలు నిర్వహించొద్దని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ఇట్లెయ్యాలె నామినేషన్

సర్పంచ్, వార్డుమెంబర్ పదవులకు.. ● నామినేషన్ వేస్తున్నారా, ఇవి గుర్తుంచుకోండి

మెదక్, వెలుగు:

ఏ ఎన్నికల్లో అయినా నామినేషన్ కీలకమైంది. క్యాండిడేట్ల నామినేషన్ ఫారం సరిగా ఉంటేనే పోటీలో ఉండే అవకాశం ఉంటుంది. నామినేషన్ ఫారంలో అన్ని వివరాలు సరిగా రాయకున్నా, సరైన పత్రాలు జతచేయకున్నా స్క్రూటినీలో రిజెక్ట్ అవుతుంది. అపుడు పోటీ చేసే అవకాశం కోల్పోతారు. అందువల్ల ఈ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ నియమ నిబంధనలు, జతచేయాల్సిన పత్రాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...

- సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోటీ చేయదలచుకున్న క్యాండెట్ లు 7 నుంచి 9వ తేదీ వరకు ఉదయం 10:30 నుంచి సాయంత్రం5:00 గంటల లోపు సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌కు సమర్పించాలి.
- క్యాండెట్, ప్రపోసర్ సంతకం చేసిన నామినేషన్ ఫారాన్ని క్యాండెట్ స్వయంగా లేదా ప్రపోసర్ ద్వారా, నిర్ణిత సమయంలో ఆర్‌ఓకు అందజేయాలి. 9వ తేదీ సాయంత్రం 5:30 గంటల తరువాత ఎట్టిపరిస్థితిలో నామినేషన్లు స్వీకరించరు.
- షెడ్యూల్డు తెగలు (ఎస్టీ), షెడ్యూల్డు కులాలకు(ఎస్సీ), వెనుకబడిన తరగతులకు(బీసీ)లకు రిజర్వు చేయని గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డుమెంబర్ పదవికి నామినేషన్ దాఖలు చేసే క్యాండిడేట్ తన తెగ, కులానికి సంబంధించిన కుల సర్టిఫికెట్ సమర్పించాలి.
- ఒక క్యాండిడేట్ ఒక పదవికి వేర్వేరు ప్రపోసర్స్‌తో వేర్వేరు నామినేషన్ పత్రాలను దాఖలు చేయొచ్చు. సర్పంచ్, వార్డు మెంబర్ పదవికి అత్యధికంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఒక క్యాండిడేట్ ఒకటి కంటే ఎక్కువ వార్డు మెంబర్ స్థానాలకు నామినేషన్ దాఖలు చేయొచ్చు. కానీ ఒక వార్డు మినహా మిగతా వార్డులకు నామినేషన్లు విత్‌డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేయకుంటే అతడు/ఆమె వేసిన అన్ని నామినేషన్లు చెల్లనివిగా భావించి, వారు ఏ వార్డు స్థానంలో పోటీ చేయడానికి అనుమతించరు.
- నామినేషన్ పత్రంలో క్యాండిడేట్, ప్రపోసర్ తప్పక సంతకం చేయాలి.

డిపాజిట్ చెల్లింపు ఇలా

ఎన్నికల నియమావళి ప్రకారం రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధేశించిన డిపాజిట్ సొమ్మును ప్రతీ అభ్యర్థి సంబంధిత గ్రామ పంచాయతీ ఖాతా ఉన్న ప్రభుత్వ ఖజానా(ట్రెజరీ) గానీ, బ్యాంకులో గానీ జమచేసి రశీదును రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. అలాకాకపోతే నామినేషన్ పత్రాలు సమర్పించే సమయంలో రిటర్నింగ్ అధికారి వద్ద డిపాజిట్ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించి రశీదు తీసుకోవాలి. అభ్యర్థి ఒకే సీటు కోసం ఒకటి కన్నా ఎక్కువ నామినేషన్ పత్రాలు సమర్పించినప్పటికీ ఒక డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుంది.

- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా డిపాజిట్ రాయితీ పొందేందుకు వీలుంటుంది. అభ్యర్థుల నామినేషన్ పత్రం రిజెక్టు అయినా, అభ్యర్థి ఉపసంహరించుకున్నా డిపాజిట్ మొత్తాన్ని తిరిగి ఇస్తారు.

అప్పీలుకు అవకాశం

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు దాఖలైన నామినేషన్ రిజెక్టు అయిన సందర్భంలో సదరు అభ్యర్థులు ఆర్డీవో, సబ్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ సమక్షంలో రిటర్నింగ్ ఆఫీసర్ నిర్ణయంపై అప్పీలు చేసుకునే అవకాశం ఉంటుంది. నామినేషన్ల పరిశీలన కోసం నిర్ణయించిన తర్వాత రోజు మాత్రమే అప్పీలు దాఖలు చేసే రైట్ ఉంటుంది. ఒకే రోజు ఛాన్సు ఉంటుంది కాబట్టి నామినేషన్ తిరస్కరించిన వెంటనే అప్పిలేట్ అధికారికి అప్పీలు దాఖలు చేయాలి.

- ఒక క్యాండిడేట్ సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు రెండింటికీ పోటీ చేయొచ్చు. కానీ 2018 తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలోని 243(1) ప్రకారం వార్డు మెంబర్ పదవులకు జరిగే ఎన్నికల్లో ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ వార్డుల నుంచి పోటీ చేసేందుకు అవకాశం లేదు.

నేర చరిత్ర, ఆస్తులు, అప్పుల వివరాలు

రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధేశించిన నమూనాలో ప్రతీ అభ్యర్థి తమ నేర చరిత్ర, ఆస్తులు, లోన్లు, విద్యార్హతకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఇద్దరు సాక్షుల ద్వారా ధ్రువీకరించిన స్వీయ ప్రకటనను(డిక్లరేషన్) నామినేషన్ పత్రంతో పాటు తప్పక దాఖలు చేయాలి. ఆయా వివరాలు సరిగా పొందుపరచకుంటే ఆదేశాలు ఉల్లంఘించినట్టుగా భావించి రిటర్నింగ్ అధికారి నామినేషన్ రిజెక్టు చేస్తారు.

కొత్త ఖాతా తెరవాలి

ఎన్నికల ఖర్చు పర్యవేక్షణలో భాగంగా ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ప్రతీ అభ్యర్థి ప్రత్యేక బ్యాంకు అకౌంట్‌ను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ అకౌంట్‌ను అభ్యర్థి నామినేషన్ పేపర్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు సమర్పించే రోజుకు కనీసం ఒకరోజు ముందు ప్రారంభించాల్సి ఉంటుంది. నామినేషన్ దాఖలు చేసేటపుడు సదరు బ్యాంకు అకౌంట్ నెంబర్‌ను రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎన్నికల లావాదేవీలను ఈ బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే జరపాల్సి ఉంటుంది. పోటీచేసే అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో ఖర్చు చేసే మొత్తాన్ని ఈ బ్యాంకు అకౌంట్‌లో జమచేయాలి. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి 45 రోజుల్లోపు జెండాలు, బ్యానర్లు, పాంప్లెట్లు, వాల్‌రైటింగ్, ఆడియో, వీడియో విజువల్ తదితర రూపాల్లో చేసిన ఎన్నికల ఖర్చు వివరాలను నిర్ణీత నమూనాలో ఎంపీడీవోకు సమర్పించాలి. ఎన్నికల ఖర్చు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితిని మించొద్దు.

ఐదూళ్లల్లో ఎన్నికల్లేవ్

సర్పంచ్ ఎన్నికలు అంటే ఊర్లల్లో జరిగే హడావిడి అంతా ఇంతా కాదు. పోటీకి నేనంటే నేను నిలబడతానని చాలా మంది ముందుకు వస్తారు. ఎలాగైనా గెలువాలని నానా తంటాలు పడుతుంటారు. కానీ అమ్రాబాద్ మండలంలోని ఐదు గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువయ్యారు. అంటే ఎవరూ నిలబడడం లేదని కాదు.. అవి ఏజెన్సీ గ్రామాలు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏజెన్సీ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌గా ఎస్టీలే పోటీ చేయాలి. దీంతో ఆ గ్రామాల్లో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేకపోవడంతో ఈ సారి సర్పంచ్ ఎన్నికలు లేనట్లే.

అచ్చంపేట, వెలుగు :

అమ్రాబాద్ మండలం ఏజెన్సీ ప్రాంతం. మండల పరిధిలోని కుమ్మరోనిపల్లి, ప్రశాంత్ నగర్, లక్ష్మాపురం, వంగురోనిపల్లి, కల్మూలోనిపల్లి గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రిజర్వేషన్ ఎస్టీలకు వచ్చింది. ఎస్టీ ఓటర్లు లేకపోవడంతో ప్రస్తుతం ఆ గ్రామాల్లో సర్పంచ్ పదవికి ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు.



○ ఏజెన్సీ పంచాయతీల్లో ఎస్టీలకే రిజర్వ్..
○ ఆ గ్రామాల్లో ఎస్టీలు లేరు..
○ ప్రతి గ్రామంలో నాలుగు వార్డులకే ఎన్నికలు

రెండోసారి అదే పరిస్థితి

మండల పరిధిలోని కుమ్మర పల్లె గ్రామంలో 2013లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు కూడా అక్కడ ఎస్టీ అభ్యర్థులు లేకపోవడంతో ఎన్నికలు నిర్వహించలేదు. ఈ గ్రామంలో మొత్తం 964 మంది ఓటర్లు ఉన్నారు .ఈ గ్రామంలో ఎనిమిది వార్డులున్నాయి. ఇందులో నాలుగు ఎస్టీ 4 జనరల్‌కు కేటాయించారు.

తండాలు విడిపోవడంతో..

అమ్రాబాద్ మండలంలోని ప్రశాంత్ నగర్, లక్ష్మాపూర్, వంగురోనిపల్లి, కల్మూలోనిపల్లి గ్రామాల్లో కూడా సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తండాలను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంతో వీటికి అనుబంధంగా ఉన్న తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయి. లక్ష్మాపూర్ గ్రామానికి అనుబంధంగా ఉన్న తండాను గ్రామ పంచాయతీగా మార్చడంతో లక్ష్మాపూర్, లక్ష్మాపూర్ తండా వేర్వేరు గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ప్రస్తుతం లక్ష్మాపూర్ గ్రామంలో 565 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఒక్కరు కూడా ఎస్టీలు లేకపోవడం గమనార్హం. గతంలో కుమ్మరోనిపల్లి, వంగురోనిపల్లి గ్రామాలు కలిసి ఒకే గ్రామ పంచాయతీ గా ఉండడం తో 2013లో కేవలం కుమ్మరోనిపల్లి గ్రామ పంచాయతీకి మాత్రమే ఎన్నికలు జరగలేదు. ప్రస్తుతం వంగురోనిపల్లి కూడా ప్రత్యేక గ్రామ పంచాయతీగా మారడంతో ఈ గ్రామంలో 523 మంది ఓటర్లు ఉన్నా సర్పంచ్ ఒక్క అభ్యర్థి లేరు. 2013 ఎన్నికల్లో కల్మూలోనిపల్లి పంచాయతీలో తెలుగుపల్లి గ్రామం కలిసి ఉండేది. తెలుగుపల్లి గ్రామంలో ఉన్న ఏకైక గిరిజన కుటుంబం నుంచి ఎవరో ఒకరు సర్పంచ్‌గా ఉన్నారు. ప్రస్తుతం తెలుగుపల్లి కూడా ప్రత్యేక పంచాయతీగా మారడంతో 492 మంది ఓటర్లు ఉన్న కల్మూలోనిపల్లిలో ఎన్నికలు జరగడం లేదు. అదేవిధంగా మన్ననూరు గ్రామ పంచాయతీలో విలీనంగా ఉన్న ప్రశాంత్ నగర్ కూడా ప్రస్తుతం ప్రత్యేక పంచాయతీగా మారడంతో ఇక్కడ కూడా ఎస్టీలు లేరు.

ప్రతి గ్రామంలో నాలుగు వార్డులకే..

సర్పంచ్ పదవికి ఎన్నికలు జరగని ప్రతి గ్రామంలో నాలుగు వార్డులకు మాత్రం ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఐదు గ్రామాల్లో ఒక్కో గ్రామంలో 8 వార్డులు ఉండగా అందులో నాలుగు వార్డులు ఎస్టీలకు 4 వార్డులు జనరల్ కేటగిరికి కేటాయించారు. ఇందులో జనరల్ కేటగిరీకి ఉన్న నాలుగు వార్డులకు ప్రతి గ్రామంలో ఎన్నికలు జరగనున్నాయి. తమ గ్రామాల్లో ఎన్నికలు జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే ఎన్నికలు..

సురేష్ మోహన్, డీపీవో నాగర్‌కర్నూల్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో కేవలం ఎస్టీలకు మాత్రమే పంచాయతీ రిజర్వేషన్ కేటాయించాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నందున వారికే కేటాయించాం. అక్కడ ఎస్టీ అభ్యర్థులు లేకపోతే ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదు. ఈ విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి తదుపరి ఆదేశాల ప్రకారం అక్కడ చర్యలు తీసుకుంటాం. ఆ గ్రామాల్లో అర్హత ఉన్న వార్డులకు మాత్రం ఎన్నికలు నిర్వహిస్తాం.

- సురేశ్ మోహన్, డీపీవో

దొంగల ముఠాను పట్టేసిండ్రు

○ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఏడుగురి పట్టివేత
○ రివాల్వర్, 32 బుల్లెట్లు స్వాధీనం

సిద్దిపేట, వెలుగు: జనశక్తి మిలిటెంట్ల పేరిట ముఠాగా ఏర్పడి బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఏడుగురు ముఠా సభ్యులను పట్టుకున్నట్టు పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ వెల్లడించారు. శనివారం రాత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన మండల లక్ష్మీనర్సయ్య కొంత మందితో ముఠాగా ఏర్పడి పలువురిని బెదిరించినట్టు తెలిపారు. కొద్ది రోజుల క్రితం కొండపాక మండలానికి చెందిన ఒక ప్రభుత్వ అధికారిని రూ.16లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తర్వాత అతడిని బెదిరించి రూ.50 వేలు వసూలు చేశాడు. ఈ విషయంపై సదరు ప్రభుత్వ ఉద్యోగి కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ప్రత్యేక టీమ్‌తో విచారణ ప్రారంభించి ముఠాలోని ఒక సభ్యున్ని పట్టుకుని పూర్తి సమాచారాన్ని రాబట్టినట్టు వివరించారు. శుక్రవారం ముఠా నాయకునితో పాటు ఎర్రోళ్ల రాములు, వంగల సంతోష్, గంగాధరి మహేందర్, దుర్గం మల్లాగౌడ్, రాజశేఖర్, మల్లేశం గౌడ్‌ను పట్టుకున్నారు. వారి నుంచి రివాల్వర్‌తో పాటు 32 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ ముఠా సభ్యులు కొద్ది రోజులుగా సిద్దిపేటతో పాటు సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాల్లో బెదిరించి వసూళ్లకు పాల్పడినట్టు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచి విచారించనున్నట్టు తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



'క్యాట్' లో నిట్‌కు ర్యాంకుల పంట

వరంగల్, వెలుగు : జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం విడుదల చేసిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (క్యాట్ 2018)లో 20 మందికి పైగా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు నిట్ వరంగల్ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు తెలిపారు. వీరికి దేశంలో ఉన్న అత్యుత్తమ మేనేజ్‌మెంట్ కాలేజీల్లో సీటు సాధించనున్నారన్నారు. క్యాట్ పరీక్షల్లో విజయం సాధించిన వారిలో మెకానికల్ ఫైనల్ ఇయర్ విద్యార్థి నిపుణ్ అగర్వాల్ 99.92 శాతం, ఈఈఈ ఫైనలియర్ విద్యార్థి తరుణ్ కటకి 99.85 పర్సంటైల్ స్కోర్ సాధించారు. వీరిద్దరి తర్వాత మరో ఇరవై మందికి పైగా మంచి స్కోర్ సాధించారు. వీరిలో సివిల్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థి సమీర్ అహ్మద్ 97.12, కంప్యూటర్ సైన్స్ నుంచి పార్థ్ గోస్వామి 97.04, కెమికల్ ఇంజినీరింగ్ నుంచి గౌరవ్ మాలిక్ 96, మెటలర్జికల్ నుంచి తపాస్‌దాస్ 95.17 తదితరులు ఉన్నారు. ఇప్పటి వరకు పరిశీలించిన ఫలితాలను బట్టి ఇరవై మందికి పైగా విద్యార్థులు క్యాట్‌లో విజయం సాధించారన్నారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

నిట్‌లో సైన్స్ ఫెస్టివల్ షురూ

కాజీపేట, వెలుగు : రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 31 జిల్లాల నుంచి స్టూడెంట్స్ వారి ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఇందులో ప్రధాన ఆకర్షణగా శ్రీహరికోటకు చెందిన ఇస్రో ఎగ్జిబిట్ ఉండటం విశేషం. కార్యక్రమాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తోపాటు కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డితోపాటు జనవిజ్ఞాన వేదిక సభ్యులు ప్రారంభించారు. సైన్స్ ఫెస్టివల్‌కు వివిధ జిల్లాల నుంచి దాదాపు 500 మంది స్టూడెంట్స్ హాజరయ్యారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అందె సత్యం, కార్యదర్శి వరప్రసాద్, ప్రొఫెసర్లు వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, రామచంద్రం, శ్రీనిధి అనంత కుమార్ పాల్గొన్నారు.



సైన్స్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ తూర్పు ఎమ్మెల్యే వినయ్ భాస్కర్


రైతుల పంట పండింది

○ వేరుశనగ క్వింటాల్‌కు రూ.6,200 గరిష్ట ధర

వనపర్తి, వెలుగు : వేరుశనగకు హబ్‌గా మారిన వనపర్తి జిల్లాలో ఈ సారి రికార్డు ధర లభిస్తోంది. శుక్ర, శనివారాల్లో క్వింటాలుకు రూ.6,200 లభించింది. దీంతో రైతులకు లాభాలు రానున్నాయి. ఈ సారి యాసంగి పంటగా రైతులు అక్టోబర్, నవంబర్ నెలల్లో వేరుశనగ సాగు చేశారు. జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం చేతికొచ్చింది. గతంలో లోవోల్టేజీ సమస్యతో సాగు నీటికి రైతులు ఇబ్బందిపడ్డారు. ధర రూ.4 వేలు కూడా వచ్చేది కాదు. దీంతో నష్టపోయేవారు. ప్రస్తుతం రైతులు తమ పంట పండిందని చెబుతున్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ రోజురోజుకూ పోటెత్తుతోంది. ప్రతీ రోజు 15 వేల బస్తాల పల్లీలు మార్కెట్‌కు వస్తుండడంతో వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఇక్కడికి వస్తున్నారు. దీంతో వేరుశనగ సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లాభాలు రాలేదని, ఈ సారి చివరి వరకు ధరలు స్థిరంగా ఉంటే రైతులకు లాభసాటిగా ఉంటుందని అంటున్నారు.

మిర్చి ధర ఊరిస్తున్నది

- సాగు తగ్గినా పెరిగిన దిగుబడి
- మార్కెట్‌కు తెస్తున్న రైతులు
- ఆశాజనకంగా ప్రారంభ ధర



హైదరాబాద్, వెలుగు: రైతుల ఆశలన్నీ ఎండు మిర్చీ పైనే ఉన్నాయి. రాష్ట్రంలో పత్తి తర్వాత రెండో ప్రధాన పంటగా మిర్చి పండుతోంది. గతేడాది ఎదురైన చేదు అనుభవాలతో రైతులు ఈసారి సాగు తగ్గించారు. అయితే కాలం కలిసిరావడంతో దిగుబడి పెరిగింది. దానికి తగ్గట్టుగానే ప్రస్తుతం మార్కెట్లో ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల ప్రారంభం నుంచే మిరప తోటలు ఏరడం ఊపందుకుంది. కల్లాలు ఎండుమిర్చితో కళకళలాడుతున్నాయి. కొన్ని చోట్ల ముందస్తుగా ఏరిన రైతులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. శుక్రవారం వరంగల్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.8వేల నుంచి రూ.9200దాకా ధర పలికింది. గత ఏడాది ఇదే సమయంలో రూ.6వేలు మాత్రమే ధర ఉన్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 49,617 హెక్టార్లలో మిరప పంట సాగయినట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో ఎక్కువగా వేశారు. దిగుబడులకు తగ్గట్టు ధర కూడా ఆశించిన రీతిలో ఉండడంతో గతేడాది జరిగిన నష్టాన్ని పూడ్చుకుంటామని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 15 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి రానున్నట్లు అంచనా వేస్తున్నారు.



గతేడాది చేదు అనుభవమే..

గతేడాది మిర్చీ రైతులకు చేదు అనుభవం ఎదురైంది. ఎక్కువ విస్తీర్ణంలో పంట వేయడం, దిగుబడి ఎక్కువ రావడంతో మార్కెట్లో ఆశించిన ధర రాలేదు. దాంతో కోల్డ్ స్టోరేజీలకు తరలించారు. కొంతమంది మార్కెట్‌కు తరలించగా విక్రయాలు లేక రోజుల తరబడి అక్కడే మకాం వేశారు. రోజుల కొద్దీ కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఖమ్మం మార్కెట్‌లో రైతులు ఆందోళనకు దిగిన ఘటన మరవలేనిది. అప్పట్లో క్వింటాల్ రూ.2వేల నుంచి రూ.2,500ల వరకే ధర వచ్చింది. ప్రస్తుతం కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న గత ఏడాది మిర్చిని రూ.11 నుంచి రూ.12వేల దాకా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

విదేశాలకు మన పండ్లు, కూరగాయలు

హైదరాబాద్, వెలుగు: పండ్లు, తాజా కూరగాయలను విదేశాలకు ఎగుమతి చేసేందుకు రాష్ట్ర ఉద్యానవన శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన వర్సిటీలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వర్సిటీలో సమీకృత ప్యాక్‌హౌస్‌లో ఆధునిక సదుపాయాల కల్పన, అభివృద్ధిపై అధికారులు చర్చించారు. ఇతర దేశాలకు పండ్లు, కూరగాయలు, పూలు ఎగుమతి చేయటానికి వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ అవసరమని పార్థసారథి అభిప్రాయపడ్డారు. ఎగుమతుల విషయంలో అన్ని రూల్స్‌ను సక్రమంగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏప్రిల్‌నుంచి మామిడి ఎగుమతులను ప్రారంభించాలన్నారు. దీనికి అనుగుణంగా ప్యాక్‌హౌస్‌ను ఆధునికీకరించాలని అధికారులను ఆదేశించారు.

పిల్లలకు 'రక్ష'

- అన్ని జిల్లాల్లోనూ బాల రక్షా భవన్‌లు
- ఒకే గొడుగు కిందికి పిల్లల సంరక్షణ విభాగాలు
- ఇప్పటికే 4 జిల్లాల్లో ప్రారంభం


హైదరాబాద్, వెలుగు: "హలో..హలో.. ఓ పదేళ్ల అమ్మాయికి పెళ్లి చేస్తున్నారిక్కడ".. చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోనొచ్చింది. వెంటనే వాళ్లు జిల్లా బాలల సంరక్షణాధికారిని అప్రమత్తం చేశారు. ఆయన మరో చోట ఉన్న రెస్క్యూ సిబ్బందికి సమాచారం చేరవేశారు. వారి నుంచి సీడబ్ల్యూసీకి ఆ విషయం చేరింది. వాళ్లు వెళ్లి బాలికను రక్షించేలోపే పెళ్లయిపోయింది. ఆ చిన్నారిని ఎక్కడో దూరంగా పంపేశారు ఆ అమ్మాయి బంధువులు. ఇలాంటివి ఒక్కటి కాదు.. ఎన్నో చేదు అనుభవాలు ఎదురయ్యాయి మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులకు. అందుకే 'ఆపద'లో ఉన్న పిల్లలకు సత్వర న్యాయం జరిగేలా ఆ అన్ని విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తున్నారు. 'బాల రక్షాభవన్'లను ఏర్పాటు చేస్తున్నారు. పిల్లలపై లైంగిక దాడి జరిగినా, వెట్టిచాకిరి, భిక్షాటనలో కనిపించినా, బాల కార్మికులుగా పని చేస్తున్నా, అనాథలుగా ఆశ్రయం కోసం వచ్చినా.. వేర్వేరు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదిక. అన్ని విభాగాలు ఈ బాల రక్షాభవన్ నుంచే పని చేస్తాయి. అక్కడే వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా బాలల రక్షణ విభాగం, జిల్లా ప్రొబేషనరీ ఆఫీసర్, శిశు సంరక్షణ కమిటీ, జువెనైల్, చైల్డ్ హెల్ప్ లైన్‌లన్నీ అక్కడి నుంచే పని చేస్తాయి. ఇప్పటికే మహబూబ్నగర్, సిద్దిపేట, మంచిర్యాల, సంగారెడ్డి జిల్లాల్లో బాల రక్షా భవన్‌లు పనిచేస్తున్నాయి. వీటికి మంచి స్పందన వస్తోంది. ఈ ఏడాది అన్ని జిల్లాల్లోనూ ఈ బాల రక్షా భవన్‌లను ఏర్పాటు చేస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీదేవి తెలిపారు. "మహిళలకు సఖి సెంటర్ల ద్వారా అన్ని సహాయాలు ఒకే భవనంలో అందేలా ఏర్పాటు చేశాం. అదే నమూనాలో బాల రక్షా భవనాలు ఏర్పాటవుతున్నాయి. పిల్లలకు సత్వర న్యాయం లభించేలా చూడడమే అంతిమ లక్ష్యం" అని ఆమె చెప్పారు.

ప్రయోజనాలివీ...

- ఘటన జరిగిన వెంటనే త్వరగా స్పందించి కాపాడి న్యాయం చేయడం తేలిక.
- బాధిత చిన్నారులను వెంటబెట్టుకొని వేర్వేరు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు.
- వివిధ విభాగాల మధ్య సమన్వయం తేలికవుతుంది. న్యాయం వేగంగా అందుతుంది.
- ప్రత్యేకంగా చైల్డ్ ఫ్రెండ్లీ రూంల ఏర్పాటు.
- పిల్లలు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేయడం సులభమవుతుంది.
- ఉన్నతాధికారులు తేలిగ్గా మిగతా విభాగాలను చూసుకునే వీలుంటుంది.

విద్యుత్ రంగంలో తెలంగాణ నంబర్ వన్

- అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత కేసీఆర్‌దే
- జెన్ కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు



హైదరాబాద్, వెలుగు: విద్యుత్ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ' డైరీని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నాటికి విద్యుత్ రంగం అనేక ఇబ్బందుల్లో ఉందని, అధునాతన టెక్నాలజీని ఉపయోగిస్తూ వాటిని అధిగమించామన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతరం విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఈ విషయంలో కేసీఆర్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారన్నారు. వచ్చే ఏడాది 1,080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పూర్తిచేసి సీఎంకు కానుకగా ఇద్దామని సీఎండీ ప్రభాకర్‌రావు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్‌లో రివర్స్ పంపింగ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి ఈ ఏడాది రూ.200 కోట్లు ఆదా చేశామన్నారు. కేటీపీఎస్‌లో 48 నెలల్లోనే 800 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రికార్డు సమయంలో నిర్మించామన్నారు. సీఎం కేసీఆర్ కలల ప్రాజెక్టు కాళేశ్వరానికి ఐదు వేల మెగావాట్ల విద్యుత్ అవసరమని, అందుకోసం సబ్‌స్టేషన్లను ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. విద్యుత్ సంస్థల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వీఏఓఏటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య సీఎండీ ప్రభాకర్‌రావును కోరారు. టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆ ఇద్దరి ఊరిలో..

ఎమ్మెల్యేల సొంతూరిలో సర్పంచ్ ఎవరు? ● రాజుపేట పంచాయతీపై సర్వత్రా చర్చ

రాష్ట్రమంతటా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం చేసేందుకు పాటుపడుతున్నారు. వారి వారి సొంత గ్రామాల్లో తమ పట్టు నిలుపుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కానీ ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని ఓ గ్రామంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఆ గ్రామం నుంచి ఇద్దరు ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్నారు. అదే రాజుపేట. ప్రస్తుతం ఆ గ్రామ పంచాయతీపై ఎవరు పట్టు నిలుపుకుంటారనే చర్చ జోరుగా సాగుతోంది.



ఖమ్మం, వెలుగు: పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సొంతూరు కూసుమంచి మండలంలోని రాజుపేట. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎమ్మెల్యేలు తమ స్వగ్రామాలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ రాజుపేట నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండడంతో సర్పంచ్ ఎన్నిక ఆసక్తి కరంగా మారింది. రాజుపేట మొన్నటి వరకు జనరల్ స్థానంగా ఉండగా కందాల ఉపేందర్ రెడ్డి సోదరుడు సురేందర్ రెడ్డి సర్పంచ్‌గా ఉన్నారు. ఈసారి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో మరో సారి కందాల కుటుంబ సభ్యులే కాంగ్రెస్ మద్దతుతో బరిలో నిలిచే అవకాశముంది. రాజుపేటలో మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీదే ఆధిపత్యం. గతంలో కందాల ఉపేందర్ రెడ్డి తండ్రి కందాల నర్సింహారెడ్డి రెండు సార్లు సర్పంచ్‌గా పనిచేశారు. 1987 నుంచి 1995 వరకు సీపీఎం మద్దతుతో రేలా ఇంద్రారెడ్డి సర్పంచ్‌గా గెలిచారు. ఆ తర్వాత బీసీకి రిజర్వ్ కాగా సీపీఎం మద్దతుతో కంపసాటి గోవింద్ విజయం సాధించారు. ఆ తర్వాత రెండు సార్లు టీడీపీ బలపర్చిన అభ్యర్థి గ్రామ పంచాయతీని గెలుచుకున్నారు. 2013 ఎన్నికల్లో మళ్లీ జనరల్ కు కేటాయించగా కాంగ్రెస్ మద్దతుతో కందాల సురేందర్ రెడ్డి గెలిచారు. గతంలో పెద్ద పంచాయతీగా ఉన్న రాజుపేట నుంచి గతంలో ఈశ్వర మాదారం, భగత్ వీడు తండాగా విడిపోగా, ఈసారి రాజుపేట బజార్, మంగళతండా విడిపోయి కొత్త పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ప్రస్తుతం గ్రామంలో ఏకగ్రీవం కోసం చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. అందరికీ ఆమోదయోగ్యమైతే రాజుపేటలో కాంగ్రెస్ మద్దతిచ్చిన అభ్యర్థిని ఏకగ్రీవం చేసి, రాజుపేట బజార్ గ్రామ పంచాయతీలో టీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థిని ఏకగ్రీవం చేసేందుకు అంతర్గతంగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో దీనిపై క్లారిటీ వచ్చే అవకాశముంది. రాజుపేట గ్రామాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసి ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే టీఆర్ఎస్ కూడా కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే సొంతూరులో టీఆర్ఎస్ మద్దతుదారుడిని గెలిపించి పార్టీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నేతలు ప్లాన్ చేస్తున్నారు.

కందాల, సండ్ర ఇద్దరూ కూటమి తరఫున గెలిచిన వారే.

కాగా ఈ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా తమ అభ్యర్థినే ఏకగ్రీవం చేయాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే దీనికి కాంగ్రెస్ సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. మొత్తానికి ఒకట్రెండు రోజుల్లో రాజుపేట ఏకగ్రీవం అవుతుందా, పోటీ తప్పదా అనే విషయం తేలే అవకాశముంది.

సహకార సమరంలో రూల్స్ పాటిద్దాం

నిజామాబాద్, వెలుగు: జిల్లాలో నిర్వహించే సహకార సంఘాల ఎన్నికల్లో నియమ నిబంధనలు పాటించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఎంఆర్ఎం రావు అన్నారు. సహకార ఎన్నికల కోసం నియమించిన ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. జిల్లాలో 87 ప్రాథమిక సహకార సంఘాలుండగా, ఒక్కో సొసైటీకి 13 మంది డైరెక్టర్లున్నారని, ఈ లెక్కన మొత్తం 1131 మంది డైరెక్టర్లకు ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలోని సహకార సంఘాలలో లక్షాయాభై వేల మంది సభ్యుల ఉన్నారన్నారు. ఓటర్ల జాబితాను మూడు సార్లు విడుదల చేశామనానరు. వ్యవసాయ పంట రుణం, వడ్డీ కలుపుకొని లక్ష రూపాయల లోపు బకాయిలున్న రైతులను కూడా ఓటరుగానే గుర్తించాలని ఇటీవలే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో మరో 2558 మంది ఓటర్లు అదనంగా కలిశారన్నారు. జిల్లా సహకార అధికారి కె. సింహాచలం మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో విద్యాశాఖ, సహకార శాఖ గెజిటెడ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఓటరు, అర్హులు, అనర్హులు, నామినేషన్ల విధివిధానాలపై అవగాహన కల్పించేందుకు ముందస్తుగా శిక్షణ ఇస్తున్నట్టుల వివరించారు.

కామారెడ్డిలో...

సహకార సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ సత్యానారాయణ పేర్కొన్నారు. సహకార ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్‌లోని జనహిత భవన్‌లో అధికారులకు శనివారం నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా లోపాలు తలెత్తకుండా పని చేయాలని సూచించారు. సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రెడ్డి పలు సూచనలు చేశారు.

పీజీటీ అభ్యర్థుల మెరిట్‌లిస్ట్ విడుదల

హైదరాబాద్, వెలుగు: పీజీటీ ఇంగ్లిష్, ఉర్దూ అభ్యర్థుల మెరిట్‌లిస్టు రాష్ట్ర రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ రిక్రూట్‌మెంట్ బోర్డు శనివారం విడుదల చేసింది. ఈ నెల 9 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని బోర్డు సీఈవో తెలిపారు. అభ్యర్థుల ర్యాంకుల క్రమంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలు వెబ్‌సైట్‌లో పొందుపరిచామని చెప్పారు. ఎంపికైన వారికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించామని తెలిపారు.

క్విక్ బైట్స్



'అన్నీ మనోళ్లే గెలవాలె'

మహబూబ్ నగర్, వెలుగు: గ్రామపంచాయతీ ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో మహబూబ్‌నగర్, హన్వాడ మండల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు అభివృద్ధిలో పోటీ పడాలని పదవుల కోసం కాదని హితవుపలికారు. సోమవారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో గ్రామాల్లోని నాయకులంతా ఒక తాటిపై నిలబడి అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో పోటీలో నిలిచిన అభ్యర్థులు గెలిచే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు పదవులు రాలేదని అధైర్య పడొద్దని సూచించారు. వార్డు సభ్యులను కూడా పనిచేసే కార్యకర్తలకే కేటాయించాలని నాయకులను నిర్దేశించారు.

దేశ కీర్తిని ఇంటర్నేషనల్ లెవల్‌లో చాటాలి

పాలమూరు జిల్లాకు చెంది న ఇంజినీరింగ్ స్టూడెంట్స్ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జయప్రకాశ్ ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెక్ ఉత్సవ్ ముగింపు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో అనేక మంది ఇంజినీర్లు ప్రజలకు ఉపయోగపడే అనేక అద్భుతాలను ఆవిష్కరించారని తెలిపారు. జేపీఎన్సీ కాలేజీ స్టూడెంట్స్ తయారు చేసిన అనేక ఉపకరణాలు భవిష్యత్తులో మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. మహబూబ్ నగర్ అభివృద్ధిపై స్టూడెంట్స్ రూపొందించిన డెమోలు అద్భుతమన్నారు.

'రిజర్వేషన్ల'పై సుప్రీంకు వెళ్తాం

హైదరాబాద్, వెలుగు: ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలు బీసీలకు వ్యతిరేకంగా ఉన్నాయని, అందువల్లే బీసీ రిజర్వేషన్లు దక్కించుకోలేక పోయామని ఓబీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో న్యాయం జరగలేదని, సుప్రీంకోర్టుకు వెళ్తామని తెలిపారు. శనివారం హైదరబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నేషనల్ ఓబీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జస్టిస్ ఈశ్వరయ్య, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తోపాటు పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ అబద్ధాలాడుతూ బీసీలను మోసం చేస్తున్నారని ఈశ్వరయ్య ఆరోపించారు. రాజకీయ పార్టీలకు సామాజిక స్పృహ ఉంటే బీసీలకు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో బీసీలను అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జాజుల ఆరోపించారు. ఈనెల 7న ఆర్డినెన్స్ ప్రతులను తగులబెట్టి రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని చెప్పారు. రాష్ట్రంలో రాచరిక ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో కూడా బీసీలను నిలబెట్టి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తంచేశారు.



భూమిని చదును చేస్తుండగా విగ్రహం బయటపడ్డది

మిర్యాలగూడ, వెలుగు: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని తుంగపాడు గ్రామంలో ప్రొక్లెయిన్‌తో భూమిని తవ్వుతుండగా రెండు ఫీట్ల పురాతన విష్ణుమూర్తి విగ్రహం బయటపడింది. కాగా శనివారం హెరిటేజ్ తెలంగాణ పురావస్తు శాఖ, నాగార్జున సాగర్ బుద్ధవనం ఇన్‌చార్జి యాట సోమశేఖర్ రెడ్డి విగ్రహం బయటపడిన స్థలాన్ని, విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహానికి సంబంధించిన వివరాలను పురావస్తు శాఖ ఉన్నతాధికారులకు పంపించి, వివరాలు తెలిసిన తర్వాత చరిత్రను తెలియజేస్తామన్నారు.

అడవులు అంటుకోకుండా

- దూలపల్లి అకాడమీలో సిబ్బందికి శిక్షణ

హైదరాబాద్, వెలుగు: అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు కిందటేడాది తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తుండడంతో.. ఈ ఏడాది కూడా కొనసాగించాలని రాష్ట అటవీశాఖ నిర్ణయించింది. వేసవిలో ప్రమాదాల నుంచి అడవుల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందంటూ ఈ ఏడాదిని 'అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణ సంవత్సరంగా' ప్రకటించింది. అగ్ని ప్రమాదాలను పసిగట్టి నష్టాలను తగ్గించేందుకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో ఒప్పందం చేసుకున్నామని అధికారులు తెలిపారు. అవసరమైన యంత్ర సామగ్రి వినియోగంపై దూలపల్లి అటవీ అకాడమీలో రెండ్రోజుల పాటు సిబ్బందికి శిక్షణ ఇచ్చామని పీసీసీఎఫ్ రఘువీర్ చెప్పారు. మంటలను ఆర్పే సమయంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై అగ్నిమాపకశాఖ అధికారులు అటవీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

గిరిజనులను పైకి తీసుకొద్దాం

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా

హైదరాబాద్, వెలుగు: గిరిజనుల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేయాలని ఆ శాఖ సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా సూచించారు. శనివారం జరిగిన ఐటీడీఏ పీవోలు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో సమీక్షించిన ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. వైద్యం, కుటుంబం సంక్షేమ శాఖ కమిషనర్ యోగితా రాణా అంటువ్యాధుల నివారణ, నవజాత శిశువుల ఆరోగ్య రక్షణ, మొబైల్ మెడికల్ యూనిట్ల సేవలపై అధికారులకు అవగాహన కల్పించారు. గిరిజన సంస్కృతిని తెలిపేలా ఉన్న పెయింటింగ్స్ తో క్యాలెండర్, గేయ సంపుటి(ల్యాబ్ మ్యానువల్)ని ఆవిష్కరించారు. తర్వాత వెల్ఫేర్ భవన్‌లోని ఈ స్టూడియోను అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు, ఉట్నూర్ ఐటీడీఏ పీవో కృష్ణ ఆదిత్య, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, గురుకులం అడిషనల్ డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఈ శంకర్‌రావు పాల్గొన్నారు.

నోడల్ ఆఫీసర్ల డ్యూటీలు మారినయ్



మాట్లాడుతున్న కలెక్టర్ అమయ్ కుమార్

సూర్యాపేట, వెలుగు: జిల్లాలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహంచేందుకు గతంలో నియమించిన నోడల్ అధికారుల విధులను స్వల్ప మార్పులు చేస్తూ కలెక్టర్ డి.అమయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మోడల్ కోడ్ నిర్వాహణ నోడల్ అధికారిగా డీఆర్వో పి.చంద్రయ్యను లా అండ్ ఆర్డర్ నోడల్ అధికారిగా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పూజితను, బ్యాలెట్ బాక్సుల నిర్వాహణ నోడల్ అధికారిగా జిల్లా మైనారిటీ అధికారి యల్.శ్రీనివాస్ ను, హెల్ప్ లైన్, కాంప్లెట్స్ నోడల్ అధికారిగా జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.బాబురావును, ఎన్నికల శిక్షణ నిర్వాహణ నోడల్ అధికారిగా జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ వేణు మనోహర్‌ను, ఎన్నికల సామగ్రి నిర్వాహణ నోడల్ అధికారిగా జిల్లా ప్లానింగ్ అధికారి టి.అశోక్ ను, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ మరియు ఖర్చుల నిర్వాహణ నోడల్ అధికారిగా అసిస్టెంట్ ఆడిట్ అధికారి ఏ.వెంకటేశ్వర రావు ను , అబ్జర్వర్ల కో ఆర్డినేషన్ నోడల్ అధికారిగా జిల్లా మేనేజర్ (సివిల్ సప్లై) బి. రాంపతిని, వాహనాల ఏర్పాట్ల నిర్వాహణ నోడల్ అధికారిగా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. భాస్కర్ రెడ్డి ని, మైక్రో అబ్జర్వర్ గా యల్. డి.యం.శ్రీనివాస్ ను, వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారిగా డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ ను, మీడియా కమ్యూనికేషన్ నోడల్ అధికారిగా సమాచార శాఖ , జి.ప్రసాద రావును, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా జిల్లా అధికారి డి.శ్రీధర్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



ట్రక్కుల వల్లే... ఢిల్లీ పొల్యూషన్

జాతీయ రాజధాని ఢిల్లీ ఎప్పట్లాగే వాయు కాలుష్యంతో కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టింది. గతంలోలా చుట్టుపక్కల పొలాల నుంచి వచ్చే పొగ లేదు. అయినా పొల్యూషన్ తగ్గట్లేదు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కారణాలను తెలుసుకోవటానికి తాజాగా స్టడీ మొదలు పెట్టింది. ఢిల్లీ గాలి ఎందుకు కలుషితమవుతోందో కళ్ల ముందు క్లియర్‌గా కనిపిస్తున్నా... ప్రత్యేకంగా రీసెర్చ్ చేయటమంటే, చంకలో గొడుగు పెట్టుకొని ఊరంతా వెతికినట్లు ఉంది.

విద్యుత్, వాటర్ బిల్లుల్లో సబ్సిడీలకు కేజ్రీవాల్ సర్కారు భారీగా నిధులు కేటాయిస్తుండటంతో ఖజానా ఖాళీ అవుతోంది. బడ్జెట్ కేటాయింపులు ఊహించని విధంగా మారుతున్నాయి. గవర్నమెంట్ రోజువారీ ఖర్చులు తీయటమే కష్టంగా ఉంది. ఫలితంగా సవరించిన 2018-19 బడ్జెట్ అంచనాల్లో కాలుష్య నివారణకు ఇచ్చిన నిధుల్లో పాతిక శాతం కోత పెట్టారు. మరోపక్క దేశ రాజధానిలో వారం రోజుల నుంచి పొల్యూషన్ ప్రమాదకర స్థాయిలో ఉంది. సిటీ రోడ్లపైకి వస్తున్న బండ్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటం కాలుష్యానికి ప్రధాన కారణం. ఆ వెహికిల్స్‌ని తగ్గించటానికి కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉన్న డెడికేటెడ్ బస్ కారిడార్లని తొలగించాలని కేజ్రీ సర్కారు చూస్తోంది. ప్రైవేట్ వాహనాల అమ్మకాలకు చెక్ పెట్టడం కోసం రవాణా శాఖ సౌత్, ఈస్ట్, నార్త్ మునిసిపల్ కార్పొరేషన్లలో కార్ల పార్కింగ్ చార్జీలు అమాంతంగాపెంచింది. వన్ టైం పార్కింగ్ ఛార్జీలు డిసెంబర్ 21న రూ.4 వేల నుంచి ఏకంగా రూ.75 వేలకు పెరిగాయి. అవి ఈ నెల నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. నగర పాలక సంస్థ తప్పుపట్టడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

కమర్షియల్ వాహనాల పార్కింగ్ ఛార్జీలను కూడా రూ.6 వేల నుంచి రూ.75 వేలకు పెంచారు. దీనిపై క్యాబ్ ఆపరేటర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, కార్ల ఓనర్లు; కమర్షియల్, నాన్ కమర్షియల్ వెహికిల్స్ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎయిర్ క్వాలిటీ పడిపోకుండా చూడటానికి ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ తీసుకున్న ఈ చర్య బాగానే ఉపయోగపడుతుంది. కానీ, దీన్ని సమర్థంగా, తక్షణం అమలుచేసే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వంలో లేదు. ఇది ఎన్నికల ఏడాది కావటం వల్లే నిక్కచ్చిగా వ్యవహరించటానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సర్కారు వెనకాడుతోంది.

ఇలాంటి పరిస్థితుల్లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టుని పెంచాలి. ఇదే సరైన పరిష్కారంగా నిపుణులు చెబుతున్నారు. కానీ, గత ఐదేళ్లుగా కేజ్రీవాల్ సర్కారు చేసింది శూన్యం. ఒక్క కొత్త బస్సునైనా కొనలేదు. ఆ మాటకొస్తే 2010 కామన్వెల్త్ గేమ్స్ తర్వాత ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో సిటీ బస్సుల సంఖ్య ఒక్కటైనా పెరిగితే ఒట్టు. త్వరలో వెయ్యి బస్సులు వస్తాయనిమాత్రం ఫీలర్లు వదులుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల్నికూడా కొంటారని టాక్. కానీ, క్లారిటీ లేదు. మెట్రో రైల్ మూడో దశ లేటవటంతో నాలుగో దశ ప్రస్తావన కరువైంది. ఢిల్లీలో సీఎన్‌జీ వెహికిల్స్‌ని ప్రవేశపెట్టడంతో పొల్యూషన్ కాస్త తగ్గింది. అయినాగానీ, గత ఎనిమిదేళ్లలో ఢిల్లీ కాలుష్యం ఐదు రెట్లు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి.


జాతీయ రాజధానిలో పొల్యూషన్‌కి ఇంకా చాలా కారణాలు ఉన్నాయి. వీటిలో వెహికిల్ పొల్యూషనే ముఖ్య ప్రమాదకారి. మొత్తం వాయు కాలుష్యంలో వాహనాల వాటా 63 శాతం. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటో మొబైల్స్ గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్నాయి. ఢిల్లీలో ప్రస్తుతం 70 లక్షలకు పైగా కార్లు ఉన్నాయి. రోజూ మరో 1400 కొత్త కార్లు వీటికి తోడవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్య నివారణ అనేది తాత్కాలిక నిర్ణయాలతో అయ్యే పని కాదు. దీనికోసం రాష్ట్రంలోని అన్ని పార్టీల లీడర్లు, వ్యాపార వర్గాలు ఒక్కతాటిపైకి వచ్చి సిన్సియర్‌గా, సీరియస్‌గా చర్చించటం చాలా అవసరం.

ట్రాఫిక్‌తోనే 65% కాలుష్యం

ట్రక్కులు వేల సంఖ్యలో రోడ్లెక్కుతున్నాయి. సిటీలోకి అర్ధరాత్రి తర్వాత వస్తున్న ఈ వాహనాలే గాలిలో 65 శాతం కాలుష్యం పేరుకుపోవటానికి కారణం. అసలు వీటిని నగరంలోకి రానివ్వొద్దని సుప్రీంకోర్టు చెప్పినా పట్టించుకున్న నాథుడే లేడు. ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్‌కి కల్తీ ఇంధనంకూడా కారణమే, ఫ్యూయెల్ పంపుల్లో 'వేపర్ రికవరీ సిస్టం' ఉండదు. అది ఉంటే గాల్లోకి విడుదలయ్యే కాలుష్య కారకాలు తగ్గుతాయి. ఇలాంటి వ్యవస్థలు ఎక్కువగా వెస్టర్న్ దేశాల్లో ఉన్నాయి. మన దగ్గర లేవు. కల్తీ ఇంధనం వల్ల కూడా గ్రీన్ హౌస్ వాయువుల విడుదల పెరుగుతోంది.

అయిదోసారి గెలుస్తారా!

నవీన్ పట్నాయక్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే వరుసగా అయిదోసారి సీఎం అవుతారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ బీజేపీ చేతిలోంచి జారిపోవడంతో నవీన్‌లో బెరుకు మొదలైంది. శివరాజ్ సింగ్, రమణ్ సింగ్‌ల హయాంలో వ్యవసాయాభివృద్ధి రేటు డబల్ డిజిట్ సాధించింది. ఒడిశాలో గడచిన ఎనిమిదేళ్లలో 2.8 శాతమే అగ్రికల్చర్ గ్రోత్ నమోదైంది. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. మరో వంక బీజేపీ 'లుక్ ఈస్ట్' పేరుతో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లను టార్గెట్ చేసుకుంది. మోడీ ఈసారి వారణాసి బదులు పూరి నుంచి లోక్‌సభకు పోటీ చేస్తారని వినికిడి.



నరేంద్ర మోడీ ఈసారి వారణాసి నుంచి కాకుండా పూరీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే వార్తలు షికారు చేస్తున్నాయి. బీజేపీ చేపట్టిన 'లుక్ ఈస్ట్'లో భాగంగా ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాల్లో బలం పుంజుకుంది. 2014లో నరేంద్ర మోడీ తన సొంత రాష్ట్రం వదిలేసి, యూపీకి రావడంతో బీజేపీ బాగా లాభం పొందింది. అదే తరహాలో ఇప్పుడు ఒడిశాకి మారినట్లయితే 'లుక్ ఈస్ట్' ప్రయోజనాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఇరుగుపొరుగున ఉండే పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలు రెండింటినీ టార్గెట్ చేసుకోవచ్చనికూడా బీజేపీ భావిస్తోంది.

ఇక, ఒడిశాలో 18 ఏళ్లకు పైగా పాతుకుపోయిన నాయకుడు నవీన్ పట్నాయక్. ఆయన ఒడిశాలో బిజూ జనతా దళ్ (బీజేడీ) తరపున 2000 నుంచి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. మరో నాలుగైదు నెలల్లో జనరల్ ఎలక్షన్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌కి, ఒడిశాకికూడా అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈసారికూడా నెగ్గితే వరుసగా అయిదోసారి ముఖ్యమంత్రి కాగలుగుతారు నవీన్. వ్యవసాయదారుల్లో తీవ్ర అసంతృప్తి మాత్రం బయటపడుతోంది. తాజాగా బీజేపీ స్టేటజీ ప్రకారం మోడీ కొత్తచోటు నుంచి లోక్‌సభకు పోటీ చేస్తారన్న వార్తలతో ఒడిశా సీన్ మారింది. ఇంతకాలం చూసీ చూడనట్లుగా ఊరుకున్న నవీన్ పట్నాయక్ జూలు విదిలించారు. తొమ్మిది పాయింట్లతో మోడీ పాలనపై చార్జిషీటు విడుదల చేశారు. బీజేడీ 21వ ఆవిర్భావ దినోత్సవం నాడే ఢంకా బజాయించడం జరిగింది.

దీని వెనక ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికలుకూడా ఉన్నాయి. వీటిలో బీజేపీ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ చేతుల్లోకి వెళ్లిపోయాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 15 ఏళ్లపాటు బీజేపీయే అధికారంలో ఉంది. అఖండంగా శివరాజ్ సింగ్ చౌహాన్ 13 ఏళ్లు, రమణ్ సింగ్ 15 ఏళ్లు అధికారంలో కొనసాగారు. వీరిద్దరూ సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగడంతో యాంటీ-ఇన్‌కంబెన్సీ దెబ్బ పడింది. ఇది సహజంగానే నవీన్ పట్నాయక్‌లో కొంచెం బెరుకు పుట్టించింది. గతంలో నవీన్ పట్నాయక్ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయేలోనే భాగస్వామిగా ఉండేవారు. 2007లో కంధమాల్‌లో క్రైస్తవ మిషనరీలపై దాడి జరగడంతో బీజేపీ మత రాజకీయాలకు పాల్పడుతోందన్న ఆరోపణతో తప్పుకున్నారు. 2009, 2014 ఎన్నికల్లో బీజేడీని ఒంటిచేత్తో అధికారానికి తీసుకొచ్చారు. ఆ రెండు ఎన్నికల్లోనూ బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికల్లోసైతం ఒడిశా నుంచి 2009లో ఒక్క సీటైనా గెలవకపోగా, 2014లో మాత్రం ఒకే ఒక్క సీటు (సుందర్‌గఢ్ నుంచి జోయల్ రామ్) బీజేపీ సంపాదించగలిగింది. బీజేడీతో కలిసున్నంతకాలం బీజేపీకి లోక్‌సభలో సీట్లు దక్కేవి. 1998లో బీజేపీ 7 సీట్లు, 1999లో 9 సీట్లు, 2004లో 7 సీట్లు దక్కించుకుంది. దీనిని బట్టి ఒడిశాలో నవీన్ పట్నాయక్ అండ లేకపోతే బీజేపీ ప్రభావం సున్నా అన్నది స్పష్టం.

ఇలా ఎంతకాలం బీజేడీపై ఆధారపడతామన్న ఆలోచనతోనే బీజేపీ 'లుక్ ఈస్ట్'ని జోరుగా తీసుకెళ్లాలని నిర్ణయించుకుంది. వారణాసి నుంచి పోటీ చేయాలనే మోడీ వ్యూహం ఫలించడంవల్లనే ఉత్తరప్రదేశ్‌లోని 80 సీట్లకుగాను బీజేపీ 73 సీట్లను సాధించగలిగింది. ఆ తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ బీజేపీ దెబ్బ తిన్నది. ఇప్పుడు నరేంద్ర మోడీ ఒడిశాకి మారదలిచారు. అయితే, నవీన్ పట్నాయక్ మాత్రం బీజేపీ ఎత్తుగడలను ఇప్పటి నుంచే ఢీకొడుతున్నారు. ఇటీవలి మూడు రాష్ట్రాలలోనూ ఓటమికి కారణాలు కేవలం యాంటీ-ఇన్‌కంబెన్సీ ఒక్కటే కాదని, రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంకూడా ప్రధాన కారణమేనని బీజేడీ శ్రేణులకు చెబుతున్నారు. 2014 జనరల్ ఎలక్షన్‌లో ఇచ్చిన హామీ మేరకు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ కమిటీ రిపోర్టుని అమలు చేయకుండా రైతులను బీజేపీ మోసగించిందని, రుణ మాఫీ విషయంలో ఊగిసలాడిందని ఆరోపణలు గుప్పించారు. వరి అమ్మకాలకు కేంద్రమే అడ్డంగా ఉందని మాత్రం నవీన్ పట్నాయక్ రైతుల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కనీస మద్దతు ధరగా రూ.2,950 ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేయించి, కేంద్రానికి పంపేసి చేతులు దులుపుకున్నారు. దీంతో రైతులు తమ ధాన్యానికి తగిన గిట్టుబాటు ధరకోసం ఎదురు చూసి, చివరకు అయినకాడికి అమ్ముకోవలసి వచ్చింది.

దీనినికూడా నవీన్ తనకు అనుకూలంగానే మలచుకుని వాదిస్తున్నారు. నిజంగానే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు రైతులకు మేలు చేస్తే ఎందుకు ఓడిపోయినట్లు? అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మంచి పరిపాలన అందిస్తున్నాగానీ కేంద్ర సహకరించడం లేదని, అందువల్లనే శివరాజ్ సింగ్, రమణ్ సింగ్ ఓడిపోవలసి వచ్చిందని వాదిస్తున్నారు. గతంలో నవీన్‌ని రెండు రూపాయల కిలో బియ్యం పథకం గట్టెక్కించింది. 2009లో ఈ పథకంద్వారానే ఒంటరి పోరులో గెలవగలిగారు. ప్రస్తుతం ఒడిశాలో కిలో రూపాయికే అందిస్తున్నారు. మునుపటిలా జనం నవీన్ మాటలకు తలాడించే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికీ రాష్ట్రంలో లక్షలాది మందికి రేషన్ కార్డులు లేవు. ఆయన ఒకదాని తర్వాత ఒకటి ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవడానికి లబ్ధిదారులు ఎక్కడని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. కేంద్ర జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద 61 లక్షల కుటుంబాలు రేషన్ తీసుకుంటుండగా, తన సొంత ఆహార పథకం కింద మరో 34 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తామంటున్నారు.

తెలంగాణలో అమలు చేస్తున్న 'రైతు బంధు' పథకాన్ని ఒడిశాలోనూ ఆరంభించారు. కేవలం రైతులకే కాకుండా వ్యవసాయాధార కుటుంబాలకుకూడా వర్తించేలా కొత్త స్కీమ్‌ని ప్రవేశపెట్టారు. ధెంకనాల్‌లో బీర్ బాట్లింగ్ ప్లాంట్‌ని మహిళలకు కేటాయిస్తామన్నారు. ఇంత చేస్తున్నాగానీ, బీజేడీ ఎమ్మెల్యేల పలుకుబడి బాగా తగ్గిందని తెలుస్తోంది. 40 నుంచి 50 స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చకపోతే నవీన్ పరిస్థితి గడ్డుగా మారడం ఖాయం. ఎన్నికలకి వ్యవధి ఉన్నందువల్ల ఈలోగా నవీన్ ఎన్ని పథకాలు ప్రకటిస్తారో చూడాలి. అలాగే, 'లుక్ ఈస్ట్'లో భాగంగా బీజేపీ ఎలాంటి ఎత్తుగడలు వేయనుందో!

నవీన్ లేకుండా బీజేపీ సున్న

నవీన్ పట్నాయక్ 2009లో ఎన్‌డియే నుంచి తప్పుకున్నాక బీజేపీ పరిస్థితి దిగజారింది. 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికల్లోసైతం ఒడిశా నుంచి 2009లో ఒక్క సీటైనా గెలవకపోగా, 2014లో మాత్రం ఒకే ఒక్క సీటు (సుందర్‌గఢ్ నుంచి జోయల్ రామ్) బీజేపీ సంపాదించగలిగింది. బీజేడీతో కలిసున్నంతకాలం బీజేపీకి లోక్‌సభలో సీట్లు దక్కేవి. 1998లో బీజేపీ 7 సీట్లు, 1999లో 9 సీట్లు, 2004లో 7 సీట్లు దక్కించుకుంది. దీనిని బట్టి ఒడిశాలో నవీన్ పట్నాయక్ అండ లేకపోతే బీజేపీ ప్రభావం సున్నా అన్నది స్పష్టం.



ఒడిశాలో సేద్యం అంతంతమాత్రం

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకంటే ఒడిశాయే పెద్ద వ్యవసాయాధారిత రాష్ట్రం. ఇక్కడి జనాభాలో 60 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. బీజేపీ ఓడిపోయిన రెండు రాష్ట్రాలతో పోలిస్తే... నవీన్ తన రాష్ట్ర రైతాంగానికి చేసింది అంతంతమాత్రమే! శివరాజ్ సింగ్ పాలనలో మధ్యప్రదేశ్ వ్యవసాయ రంగం డబల్ డిజిట్ అభివృద్ధిని సాధించింది. ఒడిశాలో 2011 నుంచి 2017 వరకు వ్యవసాయ రంగం సాధించింది కేవలం 2.8 శాతం మాత్రమే. అలాగే, ఛత్తీస్‌గఢ్‌లో వరికి క్వింటాల్ ఒక్కంటికీ 300 రూపాయల బోనస్ ప్రకటించింది. ఒడిశాలో రైతుల ఆత్మహత్యలు పెరగడంతో క్వింటాల్‌కి 100 రూపాయల ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించారు. 2015-16 లో ప్రకటించిన సబ్సిడీ ఇప్పటికీ ఒడిశా రైతుల చేతికి అందలేదు.

నాలీవుడ్‌కి మంచిరోజులొచ్చినట్లేనా?



దాదాపు 20 కోట్ల జనాభా ఉన్న నైజీరియాలో సినీ ఇండస్ట్రీకి 'నాలీవుడ్' పేరుతో ప్రత్యేక ఐడెంటిటీ ఉంది. అయితే, థియేటర్లలో చూడటం చాలా చాలా తక్కువ. అంతా కలిపితే వైడ్ స్క్రీన్ల సంఖ్య 150కి మించదు. మల్టీప్లెక్స్‌ల్లో సినిమా చూడడం ఖరీదైన వ్యవహారం. ఫిలిం డిస్ట్రిబ్యూషన్ అంతా వీడియో టేప్‌లు, వీసీడీలు, డీవీడీల రూపంలోనే సాగుతుంది. ఈ పరిస్థితుల్లో స్ట్రీమింగ్ మీడియా మేలు చేస్తుందనే ఆశలు పెరిగాయి.

'నాలీవుడ్'గా పిలుచుకునే నైజీరియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో స్ట్రీమింగ్ సర్వీస్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ప్రభావంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 2015లోనే డిస్ట్రిబ్యూషన్‌ను ప్రారంభించిన నెట్‌ఫ్లిక్స్ ప్రధానంగా బడా స్టార్లు, డైరెక్టర్ల సినిమాలపై దృష్టి సారించింది. ఆ క్రమంలోనే కున్లే అఫోలయాన్ డైరెక్ట్ చేసిన 'అక్టోబర్ 1', బియీ బాండెలా రూపొందించిన 'ఫిఫ్టీ అండ్ సెవెరల్ అదర్స్'లాంటి సినిమాలను పంపిణీ చేసింది. నైజీరియన్ మోస్ట్ పాపులర్ నటి జెనెవీవ్ నాజీ తొలిసారి దర్శకత్వం వహించిన 'లయన్ హార్ట్' సినిమాను వరల్డ్‌వైడ్‌గా డిస్ట్రిబ్యూట్ చేశారు. అదే మొట్టమొదటి 'నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్' నాలీవుడ్ సినిమాగా నిలిచింది. నెట్‌ఫ్లిక్స్ ప్రవేశంతో నాలీవుడ్‌లో నూతన శకం ఆరంభమైనట్లేనని, ఆఫ్రికన్ సినిమాలకు ప్రపంచంతో కనెక్టివిటీ పెరగడం ఖాయమని సగటు సినీజనం భావించారు. ఇందులో వాస్తవమెంత? నిజంగా నాలీవుడ్ ఫేట్‌ని నెట్‌ఫ్లిక్స్ మార్చగలదా? ఇండస్ట్రీపై బలంగా ప్రభావం చూపగలదా? అంటే తక్కున సమాధానం చెప్పలేం.

ఇతర దేశాల్లోని సినిమా ఇండస్ట్రీలతో పోల్చుకుంటే నాలీవుడ్ డిఫరెంట్‌గా ఉంటుంది. అక్కడి జనం థియేటర్లలో సినిమాలు చూడటం చాలా చాలా తక్కువ. డిస్ట్రిబ్యూషన్ అంతా వీడియో టేప్‌లు, వీసీడీలు, డీవీడీల రూపంలోనే సాగుతుంది. ఈ రకమైన వ్యవస్థ వల్లే నైజీరియన్ సినిమాలు యావత్ ఆఫ్రికాతోపాటు విదేశాలకూ విస్తరించగలిగాయి. నైజీరియాలో సినిమా థియేటర్లు తక్కువగా ఉండటం వల్లే నాలీవుడ్ ఫిలిం మేకర్స్ ఇప్పటికీ వీడియో డిస్ట్రిబ్యూషన్‌నే నమ్ముకుంటున్నారు.

19.33 కోట్ల జనాభా ఉన్న నైజీరియాలో అంతా కలిపితే వైడ్ స్క్రీన్ల సంఖ్య 150కి మించదు. పైగా ఈ మల్టీప్లెక్స్‌ల్లో సినిమా చూడడం ఖరీదైన వ్యవహారం. దాంతో వీడియో టేప్‌ల వ్యాపారమే ఎక్కువగా నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో స్ట్రీమింగ్ మీడియా ప్రవేశం ద్వారా ఇండస్ట్రీకి మేలు జరుగుతుందేమోనన్న ఆశలు పెరిగాయి. నైజీరియన్ నెట్‌ఫ్లిక్స్ తన హెడ్‌క్వార్టర్స్‌ను మాన్‌హట్టన్ (న్యూయార్క్) నుంచి లాగోస్‌కు తరలించడంలో ఇబ్బందులు ఎదుర్కొంది. స్థానికంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని డెవలప్ చేసుకోవడానికి నానా కష్టాలు పడింది. అన్నింటికీ మించి అప్పటికే పాతుకుపోయిన ఐరోకో టీవీ, మల్టీ ఛాయిస్ లాంటి సంస్థల నుంచి సవాళ్లు ఎదుర్కోవాల్సి వచ్చింది.

నెట్ లేనిచోట నెట్‌ఫ్లిక్స్ ఎలా?

స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్ దూసుకుపోయే పరిస్థితులు నైజీరియాలో లేవు. అక్కడ ఇంటర్నెట్ సేవలు పెద్దగా పెరగలేదు. ప్రస్తుతానికి విదేశాల్లో ఉంటోన్న నాలీవుడ్ అభిమానులే స్ట్రీమింగ్ కంపెనీలకు దిక్కు. ఇది ఎంత పెద్ద ఆటంకమో నెట్‌ఫ్లిక్స్‌కి తెలుసు. కాబట్టే ఆడియన్స్‌కు చేరువ కావడానికి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని సొంత నిధులతో డెవలప్ చేసుకుంటోంది. ప్రేక్షకులను ప్రభావితం చేయాలంటే ఇంకా భారీగా పెట్టుబడులు అవసరమవుతాయి. లోకల్ స్ట్రీమింగ్ కంపెనీల ప్రభావం, పైరసీ వల్ల కలిగే నష్టం ఇప్పుడిప్పుడే కనుమరుగవుతాయని చెప్పలేం. లోకల్ ఆడియెన్స్‌ని ఏ మేరకు పెంచుకుంటారనేదానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఈ విషయంలో నెట్‌ఫ్లిక్స్‌కు కొన్ని సానుకూలతలున్నాయి.

ఇదొక బంగారుబాతు

ఈ పాజిటివ్ పరిణామాలన్నీ నాలీవుడ్ నిర్మాతల్లో ఎలాంటి మార్పులు తీసుకొస్తాయన్నదీ ప్రధానమే. ఇప్పటిదాకా వచ్చి పడ్డ విదేశీ పెట్టుబడులు నాలీవుడ్ స్టయిల్‌ని మార్చలేకపోయాయి. లో-బడ్జెట్‌లో అరకొర సౌకర్యాల మధ్య అతి కొద్దిమంది నటీనటులతో వేగంగా సినిమాలు పూర్తి చేసేయడం 20 ఏండ్లుగా నడుస్తోంది. రొడ్డకొట్టుడు కథలు, సెక్స్, యాక్షన్ సీన్లతో నెట్టుకొచ్చే పరిస్థితి. అయినాసరే ఆఫ్రికా వ్యాప్తంగా నాలీవుడ్ సినిమాలకు బ్రహ్మరథం పడుతున్నారు. కొత్త ఫైనాన్షియర్లుసైతం జనం చూస్తున్నారనే వంకతో రొటీన్ సినిమాలు చుట్టేస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్‌గల సినిమాలు చాలా అరుదుగా వచ్చాయి. ఉన్నకాడికి లాభాలు దండుకుందామన్న ఆలోచనలే తప్ప నాలీవుడ్‌లో మార్పులకు విదేశీ సంస్థలు ఏ రకంగానూ పనిచేయలేదు. ప్రస్తుతానికి కొందరు అభిరుచిగల ప్రొడ్యూసర్లు మాత్రమే క్వాలిటీ ఉన్న సినిమాలు తీస్తున్నారు. ప్రేక్షకులకు మెరుగైన కంటెంట్ ఇవ్వాలనుకుంటున్నారు. నాలీవుడ్‌కి గ్లోబల్ మార్కెట్‌లో చోటు కల్పించాలని తహతహలాడుతున్నారు. ఇంకొందరు ఇన్వెస్టర్లు గ్రూపులుగా ఏర్పడి సినిమాలు తీసి, మల్టీప్లెక్స్‌ల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇలాంటివాళ్లంతా నెట్‌ఫ్లిక్స్ ద్వారా లాభం పొదగలుగుతారా? అనేదే కీలకాంశం. అదే జరిగితే గనుక ఇప్పుడు తీస్తున్న సినిమాల సంఖ్య, క్వాలిటీ పెరగడం ఖాయం. అంతిమంగా నాలీవుడ్ ప్రపంచ మూలల్లోకి వ్యాపించగలుగుతుంది. అలా జరగని పక్షంలో... నాలీవుడ్ క్రేజ్‌ని క్యాష్ చేసుకునే మిగతా సంస్థల్లాగే నెట్‌ఫ్లిక్స్‌కూడా రొటీన్‌గా ఉండిపోతుంది.

స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారాలమధ్య పోటీ



1980లనాటి ఆర్థిక సంక్షోభం తర్వాత అక్కడి థియేటర్లన్నీ మూతపడ్డాయి. 2000 సంవత్సరం తర్వాత మల్టీప్లెక్స్ కల్చర్ పుట్టుకొచ్చినా, అది లాగోస్, అబూజా లాంటి మెయిన్ సిటీలకే పరిమితమైపోయింది. ఈ దశలో నాలీవుడ్ ఇండస్ట్రీ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారాల్ని నమ్ముకుంది. ఇది సక్సెసయితే నైజీరియా సహా ఆఫ్రికాలోని ముఖ్య నగరాల్లో ఇంటర్నెట్ సేవలు పొందుతున్న సంపన్న వర్గాలు, ఎలైట్ సెక్షన్లను సులువుగా ఆకట్టుకునే అవకాశం ఉంది. నాలీవుడ్ మార్కెట్‌లోకి నెట్‌ఫ్లిక్స్ ప్రవేశిస్తే... 'ఐరోకో టీవీ', 'మల్టీ ఛాయిస్'ల్లాంటివి వెనకబడవచ్చు. ప్రస్తుతానికి నాలీవుడ్ కంటెంట్‌ని ప్రసారం చేస్తున్న అతి పెద్ద సంస్థ ఐరోకో టీవీ. సౌతాఫ్రికన్ టెలికాం దిగ్గజం 'మల్టీ ఛాయిస్' సైతం నాలీవుడ్ ఫిలిం డిస్ట్రిబ్యూషన్‌ను కంట్రోల్ చేసే స్థాయిలో ఉంది. వీటితోపాటు 'చానల్ ప్లస్' (ఫ్రాన్స్), 'స్టార్ టైమ్స్' (చైనా) కంపెనీలు కూడా నైజీరియాలో ఎంట్రీ ఇచ్చాయి. స్ట్రీమింగ్ కంపెనీల మధ్య పోటీ అంతిమంగా నాలీవుడ్‌పై మంచి ప్రభావం చూపొచ్చు. సబ్‌స్క్రిప్షన్ ధరలతోపాటు టీవీ చానెళ్ల ప్యాకేజీ రేట్లు కూడా దిగొచ్చే అవకాశముంది. కొత్త పెట్టుబడులు పెరిగేకొద్దీ సినిమాల్లో కంటెంట్, మౌలిక సదుపాయాలు పెరుగుతాయి. మిగతా ప్రపంచంతో నాలీవుడ్ కనెక్టివిటీ ఇంకా పెరుగుతుంది.



నైజీరియన్ కామెడీ

యూట్యూబ్‌లో 'మార్క్ ఏంజెల్-ఎమ్మాన్యుయెల్లా' కామెడీ స్కిట్లు చూసేవాళ్లకు నైజీరియా గురించి పరిచయం చేయనక్కర లేదు. వందుకు పైగా ఎపిసోడ్లలో వీళ్లిద్దరూ నవ్వులు పూయించారు. రెండు నుంచి ఏడెనిమిది నిమిషాలకు మించని కామెడీ స్కిట్‌లలో ఎమ్మాన్యుయెల్లా చేసే హంగామా అంతా ఇంతా ఉండదు. మార్క్ మేనకోడలే ఎమ్మాన్యుయెల్లా. పూర్తిగా ఇండియన్ బస్తీలా కనిపించే నైజీరియా వీధుల్లోనూ, అక్కడి రేకు ఇళ్లలోనూ సింపుల్‌గా తీస్తుంటాడు మార్క్. ప్రతి ఎపిసోడ్ సగటున 10 లక్షల మంది చూడడాన్నిబట్టి నైజీరియన్ కామెడీ ఎంత ఆరోగ్యకరంగా ఉంటుందో ఊహించుకోవచ్చు.

ప్రభాత
వెలుగు
ఆదివారం | హైదరాబాద్
06.01.2019
www.v6velugu.com

Follow: v6velugu

టాకీస్



టీజర్ టాక్

ఆసక్తి రేపుతోన్న 'ఐరా'

తమిళనాట లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది నయనతార. కొత్తదనం ఉండే కథలకే ప్రాధాన్యతనిస్తూ... ఈ తరహా చిత్రాలతో మంచి విజయాలను కూడా అందుకుంటోంది. ఆమె తాజా చిత్రం 'ఐరా' కూడా ఈ జాబితాలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించి తెలుగు, తమిళ భాషల్లో టీజర్స్ విడుదలయ్యాయి. కేఎమ్ సర్జున్ దర్శకుడు. కెరీర్‌లో మొదటిసారి ద్విపాత్రాభినయం చేస్తోంది నయన్. మళ్లీ ఆడపిల్లే పుట్టింది అనే వాయిస్‌తో మొదలయ్యే ఈ టీజర్‌లో నయనతార వైవిధ్యమైన లుక్, ఆమెపై వాలే సీతాకోక చిలుక, థ్రిల్ చేసే హారర్ సీన్స్ ఆసక్తి రేపాయి. 'నాకే తెలియని ఆరుగురు నా తలరాతను తలకిందులుగా రాశారు.. అందరికీ సంతోషంగా బతకడం ఒక కల, కానీ జీవితంలో సంతోషం అంటే ఏంటో తెలియని నాకు బతకడమే ఓ కల'' వంటి డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచాయి. ఇప్పటికే 'మాయ', 'డోరా' వంటి హారర్ థ్రిల్లర్స్‌తో మెప్పించిన నయనతార ఈ సినిమాతో మరోసారి ప్రేక్షకులను భయపెట్టడానికి సిద్ధమవుతోంది.



విద్య చూపు.. సౌత్ వైపు

'ఎన్టీఆర్' బయోపిక్‌తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విద్యాబాలన్.. ఈ చిత్రంలో తెలుగు వారికి దగ్గరయ్యే పాత్ర పోషించింది. సంక్రాంతికి వస్తోన్న మొదటిభాగం 'కథానాయకుడు'తో పాటు ఫిబ్రవరిలో రానున్న 'మహానాయకుడు'లోనూ బసవతారకంగా కనిపించనుంది. ఇదిలా ఉంటే ఇకపై దక్షిణాదిన వరుస సినిమాల్లో నటించేందుకు ఆమె సిద్ధమవుతోంది. ఇప్పటికే తమిళంలో అజిత్ హీరోగా రూపొందబోయే చిత్రంలో నటించడానికి అంగీకరించింది విద్యాబాలన్. హిందీలో విజయవంతమైన 'పింక్' సినిమాను తమిళంలో అజిత్ హీరోగా రీమేక్ చేయబోతున్నారు బోనీకపూర్. ఈ చిత్రంలోనే ఓ కీలకపాత్రను విద్య పోషించబోతోంది. నిజానికి విద్యాబాలన్‌కు తగ్గ పాత్రేదీ ఒరిజినల్ వెర్షన్‌లో లేదు. అయితే రీమేక్‌కు దర్శకత్వం వహిస్తోన్న హెచ్.వినోద్ (ఖాకీ ఫేమ్) తమిళ నేటివిటీకి తగ్గట్టు చాలా మార్పులు చేస్తున్నాడట. ఈ మార్పుల్లో భాగంగానే విద్యాబాలన్ క్యారెక్టర్ ఉండబోతున్నట్టు బోనీకపూర్ తెలిపారు. ఓ వైపు బాలీవుడ్‌లో 'మిషన్ మంగళ్' వంటి చిత్రాల్లో నటిస్తోన్న విద్యాబాలన్.. మరోవైపు ఇలా దక్షిణాదిన కూడా బిజీ అవుతుండటం విశేషం.



తండ్రి బాటలో తనయుడు

తమిళనాట హీరో విజయ్ కున్న పాపులారిటీ తెలియంది కాదు. సోషల్ మీడియాలో కూడా ఆయనకున్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఇప్పుడు ఆయన తనయుడు జేసన్ సంజయ్ కూడా సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాడు. ఇటీవలే సంజయ్ 'జంక్షన్' అనే ఒక షార్ట్ ఫిల్మ్‌ని డైరెక్ట్ చేసి, తనే హీరోగా నటించాడు. తనకున్న పరిచయాలతో ప్రొఫెషనల్ టెక్నీషియన్లతో షూట్ చేయొచ్చు కానీ తన ఫ్రెండ్స్‌తో కలిసి సొంతంగా తీశాడు. ఈ చిత్రాన్ని ఇటీవలే యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తే, ఇప్పటి వరకు 1.3 మిలియన్ వ్యూస్ వచ్చాయి. విజయ్ అభిమానులంతా జూనియర్ దళపతి వచ్చాడంటూ పండగ చేసుకుంటున్నారు. త్వరలోనే వెండితెర పైనా ఎంట్రీ ఇస్తాడేమో చూద్దాం.



మళ్లీ వస్తోంది

చదివింది ఎకనమిక్స్. కానీ, మోడల్‌గా పాపులర్ అయ్యింది. నటిగా సక్సెస్ అందుకుంది. 'అతిథి' చిత్రంలో మహేశ్ బాబు పక్కన మెరిసి తెలుగువారికీ పరిచయమయ్యింది. ఎం.ఎఫ్.హుస్సేన్ అంతటివాడి మనసు గెలుచుకుని అందగత్తెగా మెప్పు పొందింది. మాధురీ దీక్షిత్ తర్వాత ఆయన ఆమె చిత్రాన్నే గీశాడనే ఖ్యాతి గడిచింది. కానీ కొన్నేళ్లుగా కనిపించడమే మానేసింది. ఆమే అమృతా రావ్. మైహూనా, వివాహ్, హే బేబీ, సత్యాగ్రహ లాంటి మంచి చిత్రాల్లో నటించిన అమృత పెళ్లి తర్వాత చాన్నాళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. నిజానికి ఏవేవో సినిమాలు చేసిందని అంటారు కానీ వాటిలో ఒక్కటీ రిలీజ్ కాలేదు. అయితే దాదాపు మూడేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ తన నటనతో మురిపించనుంది అమృత. 'థాకరే' చిత్రంలో బాల్ థాకరే భార్య పాత్రలో నటించింది. అతి త్వరలో ఈ సినిమా రిలీజ్ కానుండటంతో చాలా సంతోషంగా ఉందామె. మళ్లీ ఇంత మంచి పాత్రతో వస్తానని అనుకోలేదు, చాలా ఆనందంగా ఉంది అంటోంది. ఇకపై నటనను కంటిన్యూ చేస్తానని, మళ్లీ ఇంతకు ముందులాగే మంచి పాత్రలతో వస్తాననీ చెబుతోంది. ఆమె ఆశ నెరవేరుతుందో లేదో చూడాలి.

సస్పెన్స్ థ్రిల్లర్ యమ్ 6



విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్న చిత్రం 'యమ్ 6'. ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ''వినాయక్‌గారి చేతుల మీదుగా ట్రైలర్ విడుదల కావడం సంతోషంగా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఖర్చు విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఎంతో క్వాలిటీతో నిర్మించాం. దర్శకుడు జైరామ్ అద్భుతంగా తెరకెక్కించారు. మా హీరో ధ్రువ కొత్తవాడైనప్పటికీ చక్కటి నటనను ప్రదర్శించాడు. ధ్రువ సరసన మిస్ బెంగళూరు అశ్విని హీరోయిన్‌గా నటించింది. ఆమెకిదే తొలి సినిమా. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినిమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. 'యమ్ 6' అనే డిఫరెంట్ టైటిల్‌ని ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. హీరో ధ్రువ మాట్లాడుతూ ''హీరోగా ఇది నా తొలి చిత్రం. అందర్నీ అలరించే విభిన్నమైన పాత్రలు పోషించి ఇండస్ట్రీలో నటుడిగా నాకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవాలన్నది నా చిరకాల కోరిక. అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం విజయ్ బాలాజీ, సినిమాటోగ్రఫీ మహ్మద్ రియాజ్.

రెండు జానర్స్‌తో ధీవర

నాగసాయి, విదా చైతన్య జంటగా విజయ్ జిక్కి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ధీవర'. భగీరథ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై హరనాథ్ బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బాబీ ఆవిష్కరించారు. అనంతరం బాబీ మాట్లాడుతూ 'ఈ సినిమా కాన్సెప్ట్ బాగుంది. యువతకు సంబంధించిన కథ ఇది. పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది' అంటూ టీమ్‌కి ఆల్ ది బెస్ట్ చెప్పారు. దర్శకుడు విజయ్ జిక్కి మాట్లాడుతూ 'లవ్ మరియు సస్పెన్స్ థ్రిల్లర్ గా రూపొందుతోన్న ఈ చిత్రంలో రెండు జానర్స్‌తో కూడిన స్క్రీన్ ప్లే హైలెట్ అవుతుంది' అని చెప్పారు. త్వరలో ఆడియోతో పాటు ట్రైలర్‌ను కూడా విడుదల చేసి ఫిబ్రవరి నెలాఖరులో సినిమాని విడుదల చేస్తామన్నారు నిర్మాత హరనాథ్ బాబు.



రికార్డు సృష్టించాడు

ఒక సినిమా వంద కోట్లు కలెక్ట్ చేసిందంటే డైరెక్టర్‌కి డిమాండ్ ఏర్పడుతుంది. అదే రెండు సినిమాలు ఆ క్లబ్ లోకి చేరాయా... ఇక ఆ దర్శకుడి దశ తిరిగినట్లే. అలాంటిది ఒక దర్శకుడి ఎనిమిది సినిమాలు వరుసగా వంద కోట్ల క్లబ్బులోకి చేరాయి. ఆ రికార్డ్‌ని సొంతం చేసుకున్నది ఎవరో కాదు... రీసెంట్‌గా 'సింబా'తో సూపర్ హిట్ కొట్టిన రోహిత్ శెట్టి. విడుదలయిన తొలి వారంలోనే వంద కోట్లు వసూలు చేసిన 'సింబా' కలెక్షన్లు 150 కోట్లు దాటాయి. గతంలో అజయదేవగన్ హీరోగా 80 కోట్లతో రోహిత్ తెరకెక్కించిన 'గోల్ మాల్ అగైన్' రెండొందల కోట్లు రాబట్టింది. 'దిల్ వాలే' నూట యాభై కోట్ల వరకూ వసూలు చేయగా, 'చెన్నయ్ ఎక్స్‌ప్రెస్' నాలుగు వందల కోట్లు కలెక్ట్ చేసింది. సింగం, సింగం 2 రెండూ వంద కోట్ల క్లబ్బులో చేరాయి. 'బోల్ బచ్చన్' 187 కోట్లు, 'గోల్ మాల్ 3' 160 కోట్లు రాబట్టాయి. వంద కోట్ల వసూళ్లు బాలీవుడ్‌కి పెద్ద విషయం కాకపోయినా రోహిత్ ప్రతి సినిమా వంద కోట్ల క్లబ్ లో చేరడం మాత్రం నిజంగా రికార్డే.



ట్విటర్ టాక్



''కొత్త సంవత్సరం వచ్చింది. కొత్త విషయాలు తెచ్చింది. ఏదైనా కొత్తది నేర్చుకోవడమంటే కొత్త ఉత్సాహం వస్తుంది. కొత్త జ్ఞానాన్ని సంపాదించామన్న ఆనందం ఉంటుంది. నా కొత్త సినిమా 'పానిపట్' కోసం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నా. ప్రతి క్షణాన్నీ ఎంజాయ్ చేస్తున్నా.''

- అర్జున్ కపూర్, బాలీవుడ్ హీరో

ఆన్ లొకేషన్



వరుస విజయాలతో మంచి ఫ్యాన్ ఫాలోయింగును సంపాదించుకున్నాడు విజయ్ సేతుపతి. దానికి నిదర్శనమే ఈ ఫొటో. విజయ్ తన ఫొటోపై ఆటోగ్రాఫ్ చేసి ఇవ్వడంతో ఒక అభిమాని ఆనందంగా ఇలా ముద్దిచ్చాడు.

గప్‌చుప్

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ డైరెక్షన్లో 'ఐ స్మార్ట్ శంకర్' చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే నిజానికి ఈ కథను రామ్ కోసం రాయలేదట. విజయ్ దేవరకొండ కోసం అనుకున్నాడట. మొదట విజయ్ దేవరకొండకు చెప్పాడట కూడా. మరి కథ నచ్చలేదో లేక డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోయాడో తెలీదు కానీ... విజయ్ నో అన్నాడట. ఆ తర్వాత రామ్‌కి చెప్పడం, అతడు ఓకే అనడం జరిగాయని టాలీవుడ్ టాక్. ఇందులో నిజమెంతో!



ఫొటో ఫీస్ట్



ప్రియదర్శి హాలీవుడ్ సూపర్‌స్టార్ జిమ్‌క్యారీ పక్కనా? ఏదైనా హాలీవుడ్ మూవీలో నటిస్తున్నాడా? వెంటనే డౌట్ వచ్చింది కదూ! అదేం కాదు. హాలీవుడ్‌లోని టుస్సాడ్‌మ్యూజియమ్‌ని సందర్శిస్తున్నప్పుడు జిమ్ మైనపు బొమ్మతో తీయించుకున్న ఫొటో ఇది.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.447	రూ.5.05
వరంగల్	రూ.449	రూ.5.05

స్టార్టప్‌లకు నిరాశే!

అందని "స్టార్టప్ ఇండియా" ఫలాలు

న్యూఢిల్లీ: ఇండియాలో స్టార్టప్‌లకు ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో స్టార్టప్ ఇండియా ఇనిషియేటివ్‌ను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం కింద ఇంక్యుబేషన్‌ను కల్పించడంతో పాటు నిధులను, పన్ను మినహాయింపుల వంటి ప్రయోజనాలను అందిస్తోంది. అయితే ఈ కార్యక్రమం కింద ఇప్పటి వరకు 82 శాతం స్టార్టప్‌లకు ఇంకా ఎలాంటి ప్రయోజనాలను అందలేదని లోకల్‌సర్కిల్స్ యాన్యువల్ స్టార్టప్ సర్వే 2019 వెల్లడించింది. కేవలం 18 శాతం స్టార్టప్‌లు, చిన్న, మధ్యతరహా సంస్థలు మాత్రమే ఈ స్టార్టప్ ఇండియా మిషన్ కింద లబ్ది పొందినట్టు పేర్కొంది. మొత్తంగా 15వేల స్టార్టప్‌లు, ఎస్‌ఎంఈలు, ఎంటర్‌ప్రిన్యూర్లపై లోకల్‌సర్కిల్స్ ఈ సర్వే నిర్వహించింది. మరోవైపు చాలా స్టార్టప్‌లు 'ఏంజిల్ ట్యాక్స్' సమస్యను ఎదుర్కొంటున్నాయని సర్వే వెల్లడించింది. 2018లో 32 శాతం స్టార్టప్‌లు ఆదాయపు పన్ను శాఖ నుంచి పలుసార్లు నోటీసులు అందుకున్నట్టు తెలిపింది. ట్యాక్స్ నోటీసులు అందుకున్న తర్వాత, ఆ స్టార్టప్ ఫౌండర్లపై సోషల్ మీడియా వేదికగా పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పబ్లిక్‌గా వారి పరువు పోతుంది. అయితే ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ అవుట్‌స్టాండింగ్ ఏంజిల్ ట్యాక్స్ బకాయిలను రికవరీ చేసుకునేందుకు స్టార్టప్‌లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఐటీ డిపార్ట్ మెంట్ అధికారులను స్టార్టప్ వాల్యుయేషన్ విషయంలో ఎడ్యుకేట్ చేయాల్సినవసరం ఉందని 97 శాతం స్టార్టప్ ప్రతినిధులు భావిస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ కొంటారా?

న్యూఢిల్లీ :

కొత్త స్మార్ట్‌ఫోన్ కొనాలనుకుంటున్నారా..? పాత ఫోన్ బోర్ కొట్టేసిందా..? అయితే ఈ నెల చివరి వరకు ఆగండి. స్మార్ట్‌ఫోన్లన్నీ భారీ డిస్కౌంట్లతో మీ ముందుకు రాబోతున్నాయి. ఆసుస్, లెనోవో, రియల్‌మీ, హువావే, హానర్ వంటి ఆన్‌లైన్ ఫోకస్డ్ హ్యాండ్‌సెట్ బ్రాండ్లు ఈ నెల చివరిలో భారీ డిస్కౌంట్లతో వినియోగదారులను అలరించే అవకాశం వుంది. ఫిబ్రవరి 1 నుంచి కొత్త ఈకామర్స్ ఎఫ్‌డీఐ పాలసీ అమల్లోకి వస్తోందని తెలుసు కదా. ఈ పాలసీలో ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై విక్రయించే ఉత్పత్తులపై



- ఈ నెల చివరి వరకు ఆగండి
- భారీ డిస్కౌంట్లతో ఇన్వెంటరీ క్లియర్
- ఆసుస్, లెనోవో, రియల్, హానర్ ఫోన్లపై ఆఫర్లు
- ఫిబ్రవరి 1 నుంచి కొత్త ఈకామర్స్ నిబంధనలు

నిబంధనలను కఠినతరం చేసింది కేంద్ర ప్రభుత్వం. దీంతో ఈ నిబంధనలు అమల్లోకి వచ్చే లోపలే భారీ డిస్కౌంట్లతో ఇప్పటికే ఉన్న స్మార్ట్‌ఫోన్ ఇన్వెంటరీనంతా అమ్మేయాలని కంపెనీలు చూస్తున్నాయని సంబంధిత వర్గాలు చెప్పాయి.

ఆన్‌లైన్ బ్రాండ్లకు రెండే ఆప్షన్లు...

ఆన్‌లైన్ బ్రాండ్లకు ప్రస్తుతం రెండే ఆప్షన్లు మిగిలి ఉన్నాయని ఐడీసీ, కౌంటర్‌పాయింట్ రీసెర్చ్‌లు తెలిపాయి. అవి ఒకటి ప్రస్తుతం మిగిలిపోయిన స్టాక్‌ను డిస్కౌంట్ల రూపంలో లిక్విడేట్ చేసుకోవడం. లేదా ఆఫ్‌లైన్ ఛానల్‌ను వేగవంతంగా విస్తరించుకోవడం.'ప్రస్తుతం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వద్ద స్మార్ట్‌ఫోన్ ఇన్వెంటరీ చాలా ఉంది. కానీ కొత్త ఈకామర్స్ ఎఫ్‌డీఐ పాలసీపై స్పష్టత కోసం వేచిచూస్తున్నాం. డెడ్‌లైన్‌ను పొడిగించవచ్చని ఆశిస్తున్నాం' అని రియల్‌మీ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మాధవ్ సేథ్ అన్నారు. రియల్‌మీ, హువావే కంపెనీలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ప్లాట్‌ఫామ్‌ల వద్ద మాత్రమే కాక, మిగతా ఆన్‌లైన్ ఛానల్స్‌లోకి ప్రవేశించాలని చూస్తున్నాయి. అంతేకాక ఆఫ్‌లైన్ మార్కెట్‌లోకి తమ బ్రాండ్లను విస్తరించాలని ప్లాన్ చేస్తున్నాయి. వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్ కంపెనీ, ఈకామర్స్ కంపెనీ అమెజాన్‌తో భాగస్వామ్యం ఏర్పరుచుకుని ప్రీమియం సెగ్మెంట్‌లో ఆపిల్, శాంసంగ్‌లను అధిగమించి మార్కెట్ లీడర్‌గా ఎదిగింది. అయితే ఈకామర్స్ పాలసీ విషయంలో ప్రభుత్వం నుంచి మరింత క్లారిఫికేషన్ కావాలని వన్‌ప్లస్, ఇండియా జనరల్ మేనేజర్ వికాస్ అగర్వాల్ కూడా అన్నారు. వన్‌ప్లస్‌కు ఇన్వెంటరీ సంబంధించిన విషయంలో ఎలాంటి సమస్యలు లేవని పేర్కొన్నారు. అయితే ఆఫ్‌లైన్ మార్కెట్‌లో ప్రధాన సమస్య, అక్కడ బ్రాండ్‌కు తగ్గ మార్కెట్ లేకపోవడమే. మార్కెట్ లేకపోవడంతో, సాధారణంగా కంపెనీలు చిన్న పట్టణాల్లోకి ప్రవేశించవని ఐడీసీ ఇండియా అసోసియేట్ రీసెర్చ్ డైరెక్టర్ నవ్‌కేందర్ సింగ్ అన్నారు.

ఫెస్టివల్ సీజన్ సందర్భంగా **40** లక్షల యూనిట్లను చొప్పించిన కంపెనీలు. సగానికిపైగా ఇన్వెంటరీ అమ్ముడుపోలేదు.

ఆఫ్‌లైన్ విస్తరణలో సమస్యలు...

టాప్ ప్లేయర్లతో పోలిస్తే, ఈ బ్రాండ్లు ఆఫ్‌లైన్ ఛానళ్లకు ఎక్కువ మొత్తంలో మార్జిన్లు ఇవ్వాలి, అందుకే ఈ కంపెనీలకు ఆఫ్‌లైన్ విస్తరణ కష్టతరంగా మారింది.

ఆన్‌లైన్ బ్రాండ్లకు ప్రస్తుతం రెండే ఆప్షన్లు

ఒకటి.. ప్రస్తుతం మిగిలిపోయిన స్టాక్‌ను డిస్కౌంట్ల రూపంలో లిక్విడేట్ చేసుకోవడం.
రెండు.. ఆఫ్‌లైన్ ఛానల్‌ను వేగవంతంగా విస్తరించుకోవడం.



ఈకామర్స్ నిబంధనలు అమల్లోకి వస్తే ఇబ్బంది పడేది, ఆన్‌లైన్‌లో స్మార్ట్‌ఫోన్లను విక్రయిస్తున్న కంపెనీలే! 'గతేడాది దివాలి సందర్భంగా తీసుకొచ్చిన ఇన్వెంటరీ చాలా వరకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వద్దనే ఉండిపోయింది. దాదాపు ఈ ఫెస్టివల్ సీజన్‌లో 40 లక్షల యూనిట్లను కంపెనీలు ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు అందించాయి. వాటిలో సగానికి మేర ఇంకా అమ్ముడుపోలేదు. దీంతో కొత్త ఈకామర్స్ నిబంధనలు అమల్లోకి వస్తే, రియల్‌మీ, హువావే బ్రాండ్లు ఆఫ్‌లైన్‌గా విక్రయాలు జరపాలని చూస్తున్నాయి' అని ఈ విషయం తెలిసిన ఓ వ్యక్తి చెప్పారు. ఇటీవల తీసుకొచ్చిన ఈకామర్స్ ఎఫ్‌డీఐ పాలసీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు ప్రొడక్ట్‌ల కోసం ఎక్స్‌క్లూజివ్ డీల్స్ కుదుర్చుకోవడానికి వీలులేదు. అంతేకాక ఏ కంపెనీలో అయితే వాటాలుంటాయో, ఆ కంపెనీ ప్రొడక్ట్‌లను ఈ కామర్స్ కంపెనీలు అమ్మడం నిషేధం. సింగిల్ వెండార్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌పై కేవలం తన ఇన్వెంటరీలో 25 శాతం మాత్రమే అమ్ముకోవడానికి వీలుంటుంది. ఈ కఠిన నిబంధనలతో ఇన్ని రోజులు తమ మార్కెట్ షేరును విస్తరించుకోవడానికి ఆన్‌లైన్‌గా విస్తరించి ఉన్న కంపెనీలకు కళ్లెం పడుతుంది. భారీ డిస్కౌంట్ల వర్షం కురిపించడానికి కుదరదు..

చోక్సీ ఫ్యాక్టరీని అటాచ్ చేయండి



న్యూఢిల్లీ: పీఎన్బీ కుంభకోణం కేసులో కీలక నిందితుడు మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూపు ఆధ్వర్యంలోని అబ్బేక్రెస్ట్ ఫ్యాక్టరీని అటాచ్ (తాత్కాలిక జప్తు) చేయాలని థాయిలాండ్‌కు లేఖ పంపినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం తెలిపింది. దీని విలువ రూ.13 కోట్లు ఉంటుందని, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నిందితుడి

థాయ్‌లాండ్‌కు ఈడీ వినతి

ఆస్తులను జప్తు చేయాలని కోరినట్టు వెల్లడించింది. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితరులు అక్రమంగా లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్ఓయూలు) పొంది పీఎన్బీని రూ.13,500 కోట్లకు మోసగించిన సంగతి తెలిసిందే. ఈ ఎల్ఓయూల ద్వారా రూ.92.3 కోట్ల వరకు అబ్బేక్రెస్ట్ లాభపడ్డట్టు తమ విచారణలో తేలిందని ఈడీ అధికారి ఒకరు తెలిపారు. ఇది మెహుల్‌కు చెందినదని దర్యాప్తులో గుర్తించామని చెప్పారు. పీఎన్బీ కుంభకోణం కేసులో నీరవ్ మోదీ, ఇతడి సమీప బంధువు చోక్సీ.. ఈడీ, సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇది వరకే వీరిద్దరికీ చెందిన రూ.4,765 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. సీబీఐ విజ్ఞప్తి మేరకు గత నెల 13న ఇంటర్‌పోల్ చోక్సీపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేసింది. దీనికిముందే మోదీపైనా రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేసింది. వీరిద్దరు గత జనవరిలో విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే.



సమ్మెకు బ్యాంకు ఉద్యోగ సంఘాల పిలుపు

న్యూఢిల్లీ:

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ఆరోపిస్తూ ఈ నెల 8,9 తేదీల్లో సమ్మె చేస్తామని రెండు యూనియన్లు ప్రకటించాయి. ఈ విషయమై 10 జాతీయ సంఘాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపాయి. సమ్మె గురించి ఇది వరకే ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)కు సమాచారం ఇచ్చామని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్ఐ) ప్రకటించాయి. ఇదే విషయాన్ని ఐడీబీఐ బీఎస్‌ఈకి తెలియజేసింది. ఈ సమ్మె వల్ల దేశవ్యాప్తంగా కొన్నిచోట్ల బ్యాంకులు పనిచేయకపోవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వర్తమానం పంపింది. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐసీటీయూ, యూటీయూసీ, టీయూసీసీ, ఎల్పీఎఫ్, సీఈడబ్ల్యూఏలు కూడా ఈ నెల 8,9 తేదీల్లో సమ్మె చేస్తున్నట్టు ప్రకటించాయి. ఈ మేరకు 12 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచాయి. గత నెల 26న కూడా బ్యాంకు యూనియన్లు దేశవ్యాప్తంగా ఒక రోజు సమ్మె చేశాయి.

118 కంపెనీలు చేతులు మారాయ్

కిందటేడాది డీల్స్ ఇవి ● ఫ్లిప్‌కార్ట్‌దే మెగా డీల్

వెలుగు బిజినెస్ డెస్క్

2018 లో ఇండియా స్టార్టప్స్‌లో మొత్తం 118 ఎక్విజిషన్ డీల్స్ చోటు చేసుకున్నాయి. ఈ డీల్స్‌లో ఎక్కువ భాగం ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీవే. 2018 లో మెగా డీల్‌గా చెప్పుకోవాల్సింది వాల్‌మార్ట్ చేతికి ఇండియన్ స్టార్టప్ ఫ్లిప్‌కార్ట్ వెళ్లిపోవడమే. ఈ డీల్ కింద ఫ్లిప్‌కార్ట్ వాటాదారులకు వాల్‌మార్ట్ 16 బిలియన్ డాలర్లు చెల్లించి, 77 శాతం వాటా తీసుకుంది.

ఇండియన్ స్టార్టప్‌లు 2018 లో జోరు మీదున్నాయి. అంతకు ముందు ఏడాదిలో ఫిన్‌టెక్ కంపెనీ ఇట్జ్‌క్యాష్‌ను యుఎస్‌కు చెందిన ఎబిక్స్ 123 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. ఇదే ఆ ఏడాదిలో పెద్ద డీల్. ఐతే, 2018 గతంలోని రికార్డులన్నీ బద్దలైపోయాయి. యూనికార్న్ స్టార్టప్ ఫ్లిప్‌కార్ట్ డీల్‌తో పాత రికార్డులన్నీ చెరిగిపోయాయి. మొత్తం మీద ఇండియాలోని స్టార్టప్ సిస్టమ్ మీద ఇట్జ్‌క్యాష్, ఫ్లిప్‌కార్ట్ డీల్స్ పెను ప్రభావాన్ని చూపించేవే. 2010 నుంచీ చూస్తే, స్టార్టప్స్‌లో పెట్టుబడులు ఏటేటా మెచ్యూరిటీ పొందుతూ వస్తున్నాయి. 2017-18 లోనైతే ఆశావాదం ఒకింత పెరిగిందనే చెప్పుకోవచ్చు. ఎగ్జిట్స్ విషయంలోనూ ఇన్వెస్టర్లు కొంచెం జాగ్రత్తగానే వ్యవహరించారు. అంతకు ముందుతో పోలిస్తే గతేడాది నవంబర్‌దాకా ఇండియాలో స్టార్టప్ ఎక్విజిషన్స్ తగ్గాయి. కిందటేడాదిలో 129 డీల్స్ జరగ్గా, ఈ ఏడాదిలో మాత్రం ఆ సంఖ్య 118 కే పరిమితమైంది. ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీకి చెందినవే ఎక్కువ డీల్స్ వున్నాయి. రెవెన్యూ లైన్‌లో స్పష్టత, ప్రొడక్ట్ ఇనొవేషన్‌లలో ఈ రంగం ముందంజలో వుండటమే డీల్స్ సంఖ్య పెరగడానికి కారణం. 2018లో అందరినీ ఆకట్టుకున్న 10 పెద్ద డీల్స్ ఏవో చూద్దాం.

వాల్‌నట్: డిజిటల్ లెండింగ్ విభాగంలో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్యాపిటల్ ఫ్లోట్ వాల్‌నట్‌ను ఎక్వైర్ చేసింది. వాల్‌నట్ యాప్‌ను 70 లక్షల మంది యూజర్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రతీ నెలా వారిలో 10 లక్షల మంది యాక్టివ్‌గా వుంటున్నారు. ఈ డీల్‌తో కొత్త కస్టమర్లతోపాటు టెక్నాలజీ కూడా క్యాపిటల్ ఫ్లోట్‌కు దొరికనట్లైంది. ఫిన్‌టెక్ రంగంలో దూసుకెళ్లేందుకు క్యాపిటల్ ఫ్లోట్‌కు ఈ డీల్ బాగా దోహదపడనుంది.

టంగ్‌స్టన్: స్విగ్గీ ఆధిపత్యంతో వెనక్కి తగ్గినట్లు కనిపించిన జొమాటో మళ్లీ ముందుకొచ్చింది. జీఎంవి (గ్రాస్ మర్చండైజ్ వ్యాల్యూ) పరంగా జొమాటో ఈ ఏడాది బిలియన్ డాలర్లను దాటేసింది. 2017లో రన్నర్‌ను ఎక్వైర్ చేయడంతోనే జొమాటో మళ్లీ వేగం పుంజుకుంది. 2018లో మరో ఎక్విజిషన్ ద్వారా టంగ్‌స్టన్‌ను సొంతం చేసుకుంది. 410 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ తర్వాత ఈ ఎక్విజిషన్‌కు పూనుకుంది. తన కస్టమర్లకు హైఫీక్వెన్సీ యూజ్ కేస్ (ఇష్టమైన కెఫెటేరియాల నుంచి ఆర్డర్‌కు) కోసమే టంగ్‌స్టన్‌ను జొమాటో కొనుగోలు చేసిందంటారు.



ఫ్లిప్‌కార్ట్

వాల్‌మార్ట్‌ఫ్లిప్‌కార్ట్ డీల్ ఏ విధంగా చూసినా, ఇండియాలో చాలా పెద్దదే. డీల్ సైజు, ఇన్వెస్టర్లకు ప్రతిఫలాలు, తలెత్తిన వివాదాలు...ఇలా అన్నింటిలోనూ ఈ డీల్ సంచలనమే. ఫ్లిప్‌కార్ట్ కో ఫౌండర్లు సచిన్ బన్సల్, బిన్నీ బన్సల్...ఇద్దరూ వివాదస్పద రీతిలోనే కంపెనీ నుంచి బయటకు వచ్చారు. ఈ డీల్ పర్యవసానంగా, అమెరికాలోని యుద్ధాన్ని వాల్‌మార్ట్, అమెజాన్‌లు ఇండియాలోకీ విస్తరించాయి. 2026 నాటికి ఇండియా ఈకామర్స్ మార్కెట్ 200 బిలియన్ డాలర్లకు చేరనుందన్న అంచనాలతో ఈ రెండు పెద్ద కంపెనీల దృష్టీ ఇప్పుడు ఇక్కడకు మళ్లింది. ఈ డీల్‌తో ఇండియాలో రిటెయిల్ ఇండస్ట్రీ చనిపోయినట్లేనని ఆఫ్‌లైన్ రిటెయిలర్లు వ్యాఖ్యానించారు. డీల్ అనంతరం ఇద్దరు కో ఫౌండర్ల ఎగ్జిట్ ఇండియాలోని స్టార్టప్ ఎంట్రప్రెన్యూర్లకు ఒక మంచి పాఠం. ఓలా ఫౌండర్ దీనిని అర్థం చేసుకుని, ఇన్వెస్టర్లతో గట్టిగా వ్యవహరించడానికి వీలుగా తన వాటాను పెంచుకునే ప్రయత్నంలో వున్నారు. అంతేకాదు, 2019 లోనూ కొత్త, పాత ఎంట్రప్రెన్యూర్లు తగిన జాగ్రత్తలు తీసుకుంటారని భావిస్తున్నారు.

టాప్‌జో: ఇండియాలో ఫిన్‌టెక్ బూమ్‌ను అలక్ష్యం చేయలేవు. గూగుల్ పే, ఫోన్ పె, పేటిఎం వంటి పెద్ద ప్లేయర్లుండటంతో, అమెజాన్ పే ప్రవేశపెట్టేందుకు సరైన ఆయుధం కోసం అమెజాన్ వెతుకులాడింది. టాప్‌జో రూపంలో ఆ ఆయుధం దొరికింది. 35 యాప్‌లను కలిపి ఒకేచోట టాప్‌జో అందిస్తోంది. క్యాబ్స్, ఫుడ్, రీఛార్జ్, బిల్ పేమెంట్, న్యూస్, క్రికెట్, హారోస్కోప్స్ వంటి యాప్స్ ఇందులో వున్నాయి. ఈ ఎక్విజిషన్ అమెజాన్‌కు రెండేళ్ల కాలాన్ని ఆదా చేసింది. లేకపోతే, టాప్‌జో అందించే అన్నింటినీ మొదటి నుంచీ డెవలప్ చేయడానికి అమెజాన్‌కు రెండేళ్లపైనే పట్టేదని అంచనా. రోజూ 14 వేల మంది యాక్టివ్ యూజర్లు టాప్‌జో సొంతం.

మెట్ల్: ఆన్‌లైన్ ఎసెస్‌మెంట్ ప్లాట్‌ఫామ్ మెట్ల్‌ను అమెరికాకు చెందిన హ్యూమన్ రిసోర్సెస్ కంపెనీ మెర్సర్ ఎక్వైర్ చేసింది. రెండు విధాలుగా ఈ డీల్ ముఖ్యమైంది. ఇండియాలోని సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ రంగంలో ఇదే పెద్ద ఎగ్జిట్. 2010లో ప్రారంభమైనప్పటి నుంచి సమీకరించిన నిధులతో పోలిస్తే ఏడు రెట్లు అధిక విలువ ఈ డీల్ ద్వారా వచ్చింది. గ్లోబల్‌గా 2000 కంపెనీలకు మెట్ల్ తన సేవలందిస్తోంది. నిజానికి ఈ రంగంలో ఇలాంటి ప్లేయర్లు ఇండియాలో మరింత మంది అవసరం.

హోలాషెఫ్: సిటీలోని చెఫ్‌లందరినీ కస్టమర్లతో కనెక్ట్ చేసే యాగ్రిగేటర్ హోలాచెఫ్. ఆ కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం, ఏ రోజుకారోజు కొత్త మెనూ సెలక్షన్‌ను ఆఫర్ చేయడం ప్రత్యేకత. నిధులు లేకపోవడంతో ఈ స్టార్టప్ 2018 మే నెలలో మూతపడింది. దీనిని ఫుడ్‌పాండా అవకాశంగా మలుచుకుంది. చాలా చౌకగానే హోలాచెఫ్‌ను కొనేసింది. హోలాచెఫ్ ఇన్వెస్టర్లకు కనీస స్థాయి ప్రతిఫలాలే అందించింది. క్లౌడ్ కిచెన్ స్పేస్‌లో ప్రయోగానికి వేదికగా ఈ ఎక్విజిషన్ ఫుడ్‌పాండాకు ఉపయోగపడనుంది. ఆన్‌లైన్ ఫుడ్‌మార్కెట్లోకి ఫుడ్‌పాండా మొదట్లోనే వచ్చినా, కొత్త కంపెనీల రాకతో ఎందుకనో వెనకబడిపోయింది. ఓలా డిసెంబర్ 2017 లో ఫుడ్‌పాండాను కొనడంతో మళ్లీ దానికి జవసత్వాలు వచ్చాయి. ఉబర్ ఈట్స్‌కు ధీటైన సమాధానంగా ఫుడ్‌పాండాను ఓలా ఎక్వైర్ చేసింది.

జోపర్ రిటైల్: ఫెయిల్యూర్.....మళ్లీ ఎంట్రీ....చివరికి ఎగ్జిట్...ఇదీ స్థూలంగా జోపర్ రిటైల్ ప్రయాణం. 2015 లో హైపర్‌లోకల్ ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌గా ప్రయాణం మొదలు పెట్టిన జోపర్ రిటైల్, ఆరంభంలోనే నష్టాలు పాలైంది. ఫ్లిప్‌కార్ట్ కో ఫౌండర్ బిన్నీ బన్సల్ సలహా మీద పాయింట్ ఆఫ్ సేల్ లోకి (సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్) అడుగుపెట్టింది. మూడేళ్ల తర్వాత కాస్త ఆదాయం వచ్చి, నష్టాలు తగ్గించుకుంది. అప్పుడు జోపర్‌ను ఫోన్ పె దక్కించుకుంది. ఫ్లిప్‌కార్ట్ డిజిటల్ పేమెంట్ సబ్సిడరీ అయిన ఫోన్ పె, 2017 నవంబర్‌లో తన సొంత పీఓఎస్ డివైస్‌ను ప్రవేశపెట్టింది. ఏడాదిలో 50 సిటీల్లో 10 లక్షల డివైస్‌లను లక్ష్యంగా పెట్టుకుంది. ఫోన్ పె ప్రస్తుతం అందిస్తున్న సేవలకు జోపర్ రిటైల్ ఎక్విజిషన్ సరిగ్గా సరిపోతుంది.

ఛిల్లర్: ఏప్రిల్ 2017లో హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ తన యూపీఐని పీర్ టు పీర్ పేమెంట్స్ యాప్ ఛిల్లర్‌ను ప్రవేశపెట్టడంతో వార్తలలోకెక్కింది ఈ కంపెనీ. 33 బ్యాంకులతో ఐఎంపీఎస్ (ఇమ్మీడియెట్ పేమెంట్ సర్వీస్) విభాగంలో పనిచేస్తోంది. 2017 డిసెంబర్ నాటికే ఛిల్లర్ కోటి మంది యాక్టివ్ ట్రాన్సాక్టింగ్ యూజర్లను సంపాదించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐతే, ఇతర యూపీఐ యాప్స్ చాలా వేగం అందుకున్నాయి. అంతేకాకుండా, అమెజాన్, గూగుల్ వంటి పెద్ద కంపెనీలు ఇందులో అడుగుపెట్టాయి. ఈ నేపథ్యంలోనే ఛిల్లర్ తొందరగానే ఎగ్జిట్ తీసుకుంది. ఇండియాలో ఈ విభాగంలో ప్రవేశించాలనుకుంటున్న ట్రూకాలర్ రూపంలో సరయిన కంపెనీ దొరకడంతో ఎగ్జిట్‌కు ఈజీ అయింది. దీని ఫౌండర్ సోనీ జాయ్ ప్రస్తుతం ట్రూకాలర్ వైస్ ప్రెసిడెంట్‌గా వున్నారు.

టికెట్‌న్యూ: డిజిటల్ పేమెంట్స్ కంపెనీ పేటిఎంలో అలీబాబా పెట్టుబడి పెట్టింది. డీమానిటైజేషన్ తర్వాత కాలంలో ఈ కంపెనీ విజయం చూసి కొత్త విభాగాలలోని స్టార్టప్స్‌కు గేట్లను తెరిచింది అలీ బాబా. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సర్వీసెస్‌లోని టికెట్‌న్యూను 30 మిలియన్ డాలర్లకు అలీబాబా కొనుగోలు చేసింది. గ్రోసరీస్ (బిగ్‌బాస్కెట్), లాజిస్టిక్స్ (ఎక్స్‌ప్రెస్‌బీస్) తరహాలో భాగస్వామ్యం కింద కాకుండా, టికెట్‌న్యూను మొత్తంగా పేటిఎంకే అప్పచెప్పింది అలీబాబా. అంటే ఏడాదిలోపే ఈ కంపెనీ నుంచి ఎగ్జిట్ అయ్యింది. ఇండియాలోని 660 సిటీలలో టికెట్‌న్యూ యాక్టివ్‌గా వుంది.

రిడ్లర్: యానికార్న్‌గా అవతరించిన ఓలాను మరింత పటిష్టంగా చేసే పనిలో భావిష్ అగర్వాల్ బిజీగా వున్నారు. ఇనొవేషన్, కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలోనూ శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆ క్రమంలోనే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కమ్యూటింగ్, టికెటింగ్ యాప్ రిడ్లర్‌ను కొనుగోలు చేశారు. కస్టమర్లకు అవసరమైన మల్టిమోడల్ మొబిలిటీ సొల్యూషన్స్ అందించేందుకే ఈ డీల్ కుదుర్చుకుంది.

కంపెనీ పేరు	ఫౌండర్లు	ఎక్వైర్ చేసింది	డీల్ సైజ్	కేటగిరీ	లొకేషన్
వాల్‌నట్	పతంజలి సోమయాజి, అమిత్ భోర్	క్యాపిటల్ ఫ్లోట్	$3 కోట్లు	ఫిన్‌టెక్	పుణె
టంగ్‌స్టన్	మంజునాథ్ రామకృష్ణన్	జొమాటో	$ 1.8 కోట్లు	ఫుడ్‌టెక్	బెంగళూరు
టాప్‌జో	అంకుర్ సింగ్ల, విశాల్ పాల్ చౌదరి, అవినాష్ వంకదారు, విప్లుత్ చలసాని	అమెజాన్	$4.0-4.5 కోట్లు	యాప్ అగ్రిగేటర్	బెంగళూరు
మెట్ల్	తన్మోయ్ షింగల్, కేతన్ కపూర్	మెర్సర్	$ 3.5-5.0 కోట్లు	టాలెంట్ ఎసెస్‌మెంట్	గురుగ్రామ్
హోలాషెఫ్	సౌరభ్ సక్సేనా, అనిల్ గెల్రా	ఫుడ్‌పాండా (ఓలా సొంతం)	వెల్లడించలేదు	చెఫ్‌ల అగ్రిగేటర్	ముంబై
జోపర్ రిటైల్	నీరజ్ జైన్, సుర్జేందు కుయిల	ఫోన్ పే (ఫ్లిప్‌కార్ట్ సొంతం)	వెల్లడించలేదు	పాయింటాఫ్ సేల్స్	నోయిడా
ఛిల్లర్	సోనీ జాయ్, అనూప్ శంకర్, మొహ్మద్ గాలిబ్, లిషోయ్ భాస్కరన్	ట్రూకాలర్	వెల్లడించలేదు	డిజిటల్ పేమెంట్స్	కేరళ
టికెట్‌న్యూ	రామ్‌కుమార్ నమ్మాళ్వార్	పేటిఎం	$3.0-4.0 కోట్లు	ఆన్‌లైన్ టికెటింగ్	చెన్నై
రిడ్లర్	బ్రిజ్‌రాజ్ వఘాని, రవి ఖెమాని	ఓలా	వెల్లడించలేదు	ట్రాన్స్‌పోర్ట్	ముంబై



బోపన్న జంటదే టాటా ఓపెన్

పుణె: ఇండియా టెన్నిస్ డబుల్స్ స్టార్లు రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ స్వదేశంలో అద్భుతమైన ఆటతీరు కనబరిచారు. టాటా ఓపెన్ మహారాష్ట్ర డబుల్స్‌లో విజేతగా నిలిచిన ఈ ఇద్దరు ఏటీపీ టూర్‌లో జంటగా తొలి టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నారు. శనివారం జరిగిన ఫైనల్ పోరులో టాప్ సీడ్ బోపన్న-దివిజ్ జంట 6-3, 6-4తో బాంబ్రిడ్జ్- ఒమారా (బ్రిటన్)పై వరుస సెట్లలో సునాయాస విజయం సాధించింది. తుదిపోరులో బోపన్న భారీ సర్వీస్‌లు, పదునైన బ్యాక్‌హ్యాండ్ విన్నర్లతో విరుచుకుపడగా.. శరణ్ అతడికి సహకారం అందించాడు. బోపన్న కెరీర్‌లో ఇది 18వ ఏటీపీ టూర్ టైటిల్. కాగా, పురుషుల సింగిల్స్‌లో దక్షిణాఫ్రికా స్టార్ కెవిన్ అండర్సన్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో టాప్ సీడ్ కెవిన్ 7-6, 6-7, 7-6తో కార్లోవిచ్ (క్రొయేషియా)పై గెలిచాడు.



ట్రోఫీతో బెంగళూరు



పవన్ షెరావత్

పవన్ మ్యాన్ షో

- పీకేఎల్-6 చాంప్ బెంగళూరు
- ఫైనల్లో గుజరాత్‌పై ఉత్కంఠ విజయం
- బుల్స్‌ను గెలిపించిన షెరావత్

ముంబై: ప్రొ కబడ్డీలో బెంగళూరు చరిత్ర సృష్టించింది. లీగ్‌లో తొలిసారి విజేతగా నిలిచింది. సీజన్ మొత్తం బాగా ఆడిన 22 ఏళ్ల పవన్ షెరావత్ ఫైనల్లోనూ శివమెత్తడంతో గుజరాత్‌ను ఓడించి టైటిల్‌ను దక్కించుకుంది. 2015లో చేజారిన ట్రోఫీని ఈ సారి ఒడిసిపట్టుకుంది. మరోవైపు గతేడాది రన్నరప్‌గా నిలిచిన గుజరాత్ మరోసారి అదే హోదాకు పరిమితమైంది. శనివారం ఉత్కంఠభరితంగా జరిగిన తుదిపోరులో బెంగళూరు 38-33తో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌పై గెలిచింది. ఈ మ్యాచ్‌లో మెజారిటీ పాయింట్లను షెరావత్ సాధించి ఒంటిచేత్తో బుల్స్‌కు టైటిల్ అందించాడు. మొత్తం 25 సార్లు రైడ్‌కు వెళ్లిన షెరావత్.. ఏకంగా 22 పాయింట్లను సాధించాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి 9-16తో వెనుకంజలో నిలిచిన బుల్స్‌ను అద్భుత ఆటతీరులో పైచేయి సాధించేలా చేశాడు. మొదట్లో రెండు జట్లూ హోరాహోరీగా తలపడగా 7-7తో స్కోరు సమంగా ఉన్న దశలో రెండేసి సక్సెస్‌ఫుల్ రైడ్స్, ట్యాకిల్స్‌తో గుజరాత్ 11-7తో ముందంజ వేసింది. ఆ తర్వాత బుల్స్‌ను ఆలౌట్ చేసి 16-9తో తిరుగులేని ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక రెండో అర్ధభాగంలోనూ బుల్స్ తడబడడంతో ఆధిక్యం 21-17కు చేరింది. కానీ, చివరి పది నిమిషాల్లో పవన్ మ్యాచ్‌ను ఒక్కసారిగా మలుపు తిప్పేశాడు. 31వ నిమిషంలో రైడ్‌కు వెళ్లిన పవన్.. రెండు సక్సెస్‌ఫుల్ రైడ్లతోపాటు గుజరాత్‌ను ఆలౌట్ చేసి ఆరు పాయింట్లు సాధించాడు. దీంతో బుల్స్ 23-22తో తొలిసారి ఆధిక్యంలోకి వచ్చింది. అనంతరం గుజరాత్ పోరాడి 29-29తో స్కోరు సమం చేసింది. ఈ దశలో తన జాదూ చూపించిన పవన్ రెండు పాయింట్లు సాధించడంతో 31-29తో బుల్స్ లీడింగ్‌లోకి వెళ్లింది. కాసేపటికే రైడ్‌కు వెళ్లి గుజరాత్‌ను మరోసారి ఆలౌట్ చేయడంతో 36-30తో తిరుగులేని ఆధిక్యాన్ని బుల్స్ సాధించింది. అనంతరం మరో రెండు పాయింట్లు సాధించి మ్యాచ్‌తోపాటు టైటిల్‌నూ సాధించింది.

ప్రైజ్‌మనీ
బెంగళూరు **3** కోట్లు
గుజరాత్ **1.80** కోట్లు



ఫైనల్లో నిఖత్

విజయనగర: నేషనల్ ఎలైట్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన 51 కేజీల సెమీఫైనల్లో నిఖత్ 5-0తో ఆలిండియా పోలీస్ (ఏఐపి) బాక్సర్ వాన్లల్ దాటిపై ఘన విజయం సాధించింది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన మణిపూర్‌కు చెందిన వాన్లర్‌పై పంచ్‌ల వర్షం కురిపించిన నిఖత్ బౌట్‌ను ఏకపక్షంగా మార్చేసింది. మరో సెమీస్‌లో 5-0తో మీనాక్షి (రైల్వేస్)పై గెలిచిన హర్యానా స్టార్ బాక్సర్ పింకీ రాణితో ఆదివారం జరిగే ఫైనల్లో నిఖత్ అమీతుమీ తేల్చుకోనుంది.

సెమీస్‌లో రాకెట్స్

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ముంబై రాకెట్స్ సెమీఫైనల్ చేరింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 5-0తో చెన్నై స్మాషర్స్‌పై తిరుగులేని విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో కశ్యప్‌పై సమీర్ వర్మ (ముంబై) గెలవడం విశేషం. మరో మ్యాచ్‌లో బెంగళూరు రాప్టర్స్ 4-3 స్కోరుతో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌పై గెలిచింది. ఈ టైలో జరిగిన పురుషుల సింగిల్స్ రెండు మ్యాచుల్లో రాప్టర్స్ ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్ గెలుపొందారు. ఇక, మహిళల సింగిల్స్‌లో వారియర్స్ కెప్టెన్ సైనా నెహ్వాల్ 2-0 తేడాతో త్రైత్రాంగ్‌వు పై గెలిచింది.

తిసార పెరీరా సెంచరీ వృథా

రెండో వన్డేలోనూ లంక ఓటమి

మౌంట్‌మాంగనుయ్: తిసార పెరీరా (74 బంతుల్లో 8 ఫోర్లు, 13 సిక్సర్లతో 140) భారీ సెంచరీతో చెలరేగినా శ్రీలంకకు ఓటమి తప్పలేదు. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రెండో వన్డేలో 21 పరుగుల తేడాతో పోరాడి ఓడిపోయింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 319 పరుగులు చేసింది. వెటరన్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ (90), కొలిన్ మన్రో (87), జేమ్స్ నీషమ్ (64) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. భారీ టార్గెట్‌ను ఛేజ్ చేసే క్రమంలో లంక 46.2 ఓవర్లలో 298 రన్స్‌కు ఆలౌటై ఓడిపోయింది.

ఎదురుగా కొండంత స్కోరు కనిపిస్తుండగా.. ఓటమి తరుముకొస్తుండగా.. అవమాన భారాన్ని తప్పించుకునేందుకు ఆస్ట్రేలియన్లు పోరాడుతున్నారు..! ఆఖరి మ్యాచ్‌ను డ్రాగా ముగించేందుకు శక్తినంతా ధారపోస్తున్నారు..!
కానీ, కోహ్లీసేన ఏమాత్రం కనికరించడం లేదు..! ఫ్లాట్ పిచ్‌పై స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా మాయాజాలంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ టాపార్డర్‌ను కూల్చేసి.. మిడిలార్డర్ పని పట్టారు..! ఎలాగోలా దాదాపు రోజంతా నిలిచిన కంగారూలు ఆరు వికెట్లు కోల్పోయి ఇండియాకు పోటీ ఇచ్చే ప్రయత్నం చేసినా ఇంకా 386 పరుగుల దూరంలోనే ఉన్నారు..! చివరి రెండు రోజుల్లో పిచ్ స్పిన్‌కు మరింత అనుకూలిస్తుంది కనుక నాలుగో రోజు ఉదయమే మరో నాలుగు వికెట్లు కూల్చేసి ప్రత్యర్థిని ఫాలోఆన్‌లో పడేస్తే కోహ్లీసేన నిశ్చింతంగా ఉండొచ్చు..! అయితే, ఆదివారం వర్షం సూచనలు ఉండడమే కాస్త ఆందోళన కలిగిస్తోంది.!



అయినా.. మన చేతుల్లోనే!

- పోరాడుతున్న ఆస్ట్రేలియా
- మూడో రోజు చివరకు 236/6
- రాణించిన హారిస్
- మెరిసిన కుల్దీప్, జడేజా

సిడ్నీ: నాలుగో టెస్ట్‌లో టీమిండియా జోరే నడుస్తోంది. మనోళ్ల పటిష్టమైన పేస్‌తోపాటు గింగరాలు తిరిగే బంతులను ఎదుర్కోవడంలో ఆసీస్ బ్యాట్స్‌మెన్ తంటాలు పడ్డారు. దాంతో మూడో రోజైన శనివారం వెలుతురు లేమి, వర్షం కారణంగా ఆట ముగిసేసమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లకు 236 పరుగులు చేసింది. ఓపెనర్ మార్కస్ హారిస్ (120 బంతుల్లో 8 ఫోర్లతో79) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. మార్నస్ లాబుషానే (38), ఉస్మాన్ ఖవాజా (27), ట్రావిస్ హెడ్ (20) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. ప్రస్తుతం పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (28 బ్యాటింగ్), పాట్ కమిన్స్ (25 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇండియా బౌలర్లలో కుల్దీప్ యాదవ్ (3/71), రవీంద్ర జడేజా (2/62) తమ స్పిన్ మ్యాజిక్‌ను చూపించారు. ద్ షమికి ఒక వికెట్ దక్కింది. ప్రస్తుతం ఇండియా స్కోరుకు ఆసీస్ ఇంకా 386 పరుగులు వెనుకంజలో ఉంది. ఫాలోఆన్ తప్పించుకోవాలన్నా.. మరో 187 పరుగులు చేయాలి.

హారిస్ పోరాటం..
బౌలింగ్ వైఫల్యంతో ఇండియాకు భారీస్కోరు ఇచ్చుకున్న ఆసీస్‌కు ఓపెనర్లు మంచి ఆరంభాన్నే ఇచ్చారు. ముఖ్యంగా హారిస్ బ్యాటింగ్ ప్రతిభతోనే హోమ్‌టీమ్ పోటీ ఇచ్చే స్థితిలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 24/0తో తొలిఇన్నింగ్స్ ప్రారంభించిన కంగారూలకు హారిస్, ఉస్మాన్ ఖవాజా మంచి ఆరంభాన్నిచ్చారు. పేసర్లు బుమ్రా, షమిలను అలవోకగా ఎదుర్కొంటూ పరుగులు సాధించారు. ఆరంభంలో స్పిన్నర్లు కూడా కాస్త లయ తప్పడంతో ఆసీస్ సులువుగా పరుగులు సాధించింది. దీంతో 16.3 ఓవర్లలో 50 పరుగుల మార్కును దాటింది. అయితే కుల్దీప్ వేసిన 22వ ఓవర్‌లో క్రీజు ముందుకొచ్చి నిర్లక్ష్యమైన షాట్ ఆడిన ఖవాజా మిడ్‌వికెట్‌లో పుజారాకు చిక్కడంతో 72 పరుగుల తొలి ఇన్నింగ్స్ భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం లాబుషానేతో కలిసి ఆసీస్ ఇన్నింగ్స్‌ను హారిస్ ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో 67 బంతుల్లో రెండో అర్ధసెంచరీని హారిస్ పూర్తి చేసుకోవడంతోపాటు 122/1 స్కోరుతో టీమ్‌ను లంచ్ బ్రేక్‌కు తీసుకెళ్లాడు.



హారిస్ (79)

బౌలర్ల జోరు
రెండో సెషన్‌లో ఇండియా బౌలర్లు పుంజుకున్నారు. బ్రేక్ నుంచి వచ్చిన వెంటనే హారిస్‌తో పాటు షాన్ మార్ష్ (8)ను అవుట్ చేసిన జడేజా ఆసీస్‌కు షాకిచ్చాడు. కాసేపటికే లాబుషానేను షమి అవుట్ చేయడంతో హోమ్ టీమ్ ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో హ్యాండ్స్ కాంబ్‌తో కలిసి హెడ్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఐదో వికెట్‌కు 40 పరుగులు జతచేసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. అయితే టీ విరామనికి ముందు రిటర్న్ క్యాచ్‌తో హెడ్‌ను అవుట్ చేసిన కుల్దీప్ ఈ జంటను విడదీశాడు. 198/5తో టీ విరామనికి వెళ్లొచ్చిన తర్వాత కెప్టెన్ టిమ్ పైన్ (5)ను కుల్దీప్ చక్కని బంతితో బోల్తా కొట్టించాడు. ఈ దశలో హ్యాండ్స్‌కాంబ్-కమిన్స్ జోడీ పోరాట పటిమ ప్రదర్శించింది. 81వ ఓవర్‌లో ఇండియా కొత్త బంతి కోసం రిక్వెస్ట్ చేయగా వెలుతురులేమి కారణంగా అంపైర్లు తిరస్కరించారు. ఆ తర్వాత రెండు ఓవర్లకే ప్రతికూల వాతావరణంతో ఆట నిలిచిపోయింది.

స్కోర్‌బోర్డ్

ఇండియా తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్; **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** హారిస్ (బి) జడేజా 79, ఖవాజా (సి)పుజారా (బి) కుల్దీప్ 27, లాబుషానే (సి)రహానె (బి) షమి 38, మార్ష్ (సి)రహానె (బి) జడేజా 8, హెడ్ (సి అండ్ బి) కుల్దీప్ 20, హ్యాండ్స్‌కాంబ్ (నాటౌట్) 28, పైన్ (బి) కుల్దీప్ 5, కమిన్స్(నాటౌట్)25; **ఎక్స్‌ట్రాలు:** 6; మొత్తం: 83.3 ఓవర్లలో 236/6; **వికెట్ల పతనం:** 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198. బౌలింగ్: షమి 16-1-54-1, బుమ్రా 16-4-43-0, జడేజా 27.3-9-62-2, కుల్దీప్ 24-6-71-3.

కెప్టెన్ మాస్టర్ ప్లాన్.. వైస్ కెప్టెన్ సూపర్ క్యాచ్..

మూడో రోజు ఆటలో లాబుషానె వికెట్ కోసం కెప్టెన్ కోహ్లీ మాస్టర్ ప్లాన్, వైస్ కెప్టెన్ రహానె అందుకున్న క్యాచ్ అందరినీ ఆకట్టుకుంది. షమి వేసిన 48వ ఓవర్లో లాబుషానె బౌండ్రీ కొట్టగా.. కోహ్లీ వెంటనే సిల్లీ మిడాఫ్‌లోకి వచ్చి.. రహానెను స్క్వేర్‌లెగ్‌లో మోహరించాడు. ఆ వెంటనే లాబుషానె ప్యాడ్ల మీదుగా షమి ఫుల్‌లెంగ్త్ డెలివరీ సంధించాడు. దాన్ని ఆసీస్ బ్యాట్స్‌మన్ ఫ్లిక్ డౌన్ చేయడంలో విఫలమవడంతో బంతి బ్యాటును తగిలి గాల్లోకి లేచింది. అక్కడే కాచుకొని ఉన్న రహానె కళ్లు చెదిరేరీతిలో క్యాచ్ అందుకున్నాడు.

రాహుల్ క్రీడాస్ఫూర్తి..

బ్యాటింగ్‌లో విఫలమై విమర్శల పాలైన లోకేశ్ రాహుల్.. ఫీల్డింగ్‌లో నిజాయితీగా వ్యవహరించి అందరి మనసులు గెలుచుకున్నాడు. తొలి సెషన్‌లో జడేజా బౌలింగ్‌లో ముందుకొచ్చిన హారిస్ షాట్ ఆడగా.. మిడాన్‌లో ఉన్న రాహుల్ ఫుల్ డైవ్ చేసి క్యాచ్ అందుకున్నాడు. ప్లేయర్లంతా వికెట్ దక్కిందనే ఆనందంలో మునిగిపోయారు. కానీ.. రాహుల్ మాత్రం బంతి తన చేతుల ముందు బౌన్స్ అయిందని అంపైర్‌కు సిగ్నల్ చేశాడు. దాంతో బుమ్రా, ఫీల్డ్ అంపైర్ ఇయాన్ రాహుల్‌ను ప్రశంసించారు.

పంత్ మరో గిల్‌క్రిస్ట్

రిషభ్‌పై పాంటింగ్ ప్రశంసలు

సిడ్నీ: నాలుగో టెస్ట్‌లో భారీ సెంచరీ కొట్టిన ఇండియా యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌పై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. పంత్‌ను ఆసీస్ ఆసీస్ లెజెండరీ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్‌తో పోల్చాడు. రిషభ్ పంత్ మరో గిల్‌క్రిస్ట్ అంటూ కితాబిచ్చాడు. 'రిషభ్‌లో రియల్ టాలెంట్ ఉంది. అతడు అద్భుతమైన స్ట్రయికర్. బంతిని బలంగా బాదుతాడు. అలాగే, మంచి గేమ్ సెన్స్ కూడా అతనిలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ (ఐపీఎల్ టీమ్)లో అతడికి కోచింగ్ ఇవ్వడం నా అదృష్టం. కీపింగ్ విషయంలో పంత్ మరికొంత మెరుగవ్వాలి. కామెంటరీ బాక్స్‌లో మేం అతడి గురించి మాట్లాడుకుంటున్నాం. పంత్ మరో ఆడమ్ గిల్‌క్రిస్ట్‌లా కనిపిస్తున్నాడని' రికీ అన్నాడు.



భాకర్.. సారీ చెప్పు

- స్టార్ షూటర్‌పై హర్యానా స్పోర్ట్స్ మినిస్టర్ ఫైర్

చండీగఢ్: ఇండియా టీనేజ్ షూటర్ మనూ భాకర్‌పై హర్యానా స్పోర్ట్స్ మినిస్టర్ అనిల్ విజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూత్ ఒలింపిక్స్‌లో గోల్డ్ నెగ్గిన తనకు క్యాష్ రివార్డుగా ప్రకటించిన రెండు కోట్ల రూపాయాలు ఇంకా ఇవ్వలేదని ట్విటర్ వేదికగా ప్రశ్నించిన స్టార్ షూటర్‌పై విజ్ గుస్సా అయ్యారు. భాకర్ తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయం గురించి పబ్లిక్‌గా కామెంట్ చేసే కంటే రాష్ట్ర స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదిస్తే సరిపోయేదన్నారు. ట్విటర్‌లో మనూ వాడిన భాష రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. . 'క్రీడాకారులు కాస్త క్రమశిక్షణ చూపాలి. దీనిపై వివాదం సృష్టించినందుకు మనూ భాకర్ చింతించాలి. మనుకు చాలా భవిష్యత్ ఉంది. ఆమె ఆటపైనే ఫోకస్ పెట్టాల'ని అన్నారు.

థాయ్‌లాండ్ X ఇండియా

అబుదాబి: ఏఎఫ్‌సీ ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో సునీల్ ఛెత్రీ నాయకత్వంలోని టీమిండియా తొలిపోరుకు సిద్ధమైంది. భారత కాలమాన ప్రకారం ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు థాయ్‌లాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో 97వ స్థానంలో ఉన్న ఇండియా, 118వ స్థానంలో ఉన్న థాయ్‌లాండ్ మధ్య జరిగే ఈ మ్యాచ్‌లో థాయ్ జట్టే ఫేవరెట్‌గా కనిపిస్తోంది.







గాల్లో తేలినట్టుందే.. గ్లాస్ పెట్టినట్టుందే..

గాల్లో తేలినట్టుంటుంది.. కానీ, కాళ్లు మాత్రం పైకి లేవవు! అద్దం అబద్ధం చెప్పదంటారు.. ఉన్నది ఉన్నట్టు చూపిస్తుందంటారు! కానీ, కొన్నిసార్లు ఆ అద్దమే మన కళ్లను మాయ చేసేయొచ్చు. ఉన్నది ఉన్నట్టుగా కాకుండా కొంచెం కనికట్టు చేసేయొచ్చు. ఈ ఫొటోలు అవే. ఈ కుక్కల్ని చూడండి.. హ్యాపీగా గాల్లో గెంతుతూ, ఒళ్లు వంకర్లు తిప్పుతూ డాన్సులు చేస్తున్నట్టు లేవూ. కానీ, కంటికి కనిపించేవన్నీ నిజం కాదన్నట్టు.. ఇక్కడ చూస్తున్న ఫొటోలు నిజమే అయినా గాల్లో గెంతడం అనే మాట మాత్రం అబద్ధం. ఇక్కడ రెండు 'అద్దాలు' మన కళ్లను ట్రిక్ చేసేశాయి మరి. ఒక అద్దం కెమెరా లెన్స్ అయితే, ఇంకో అద్దం ఆ కుక్కలు నిలబడినదే. అవును, అద్దంపై కుక్కలను నిలబెట్టి ఆ అద్దం కింది నుంచి తీశారీ ఫొటోలు. అద్దాల మీద నిలబడినప్పుడు కుక్కలు ఊరికే ఉండక ఒంటిని రకరకాలుగా వంకర్లు తిప్పడంతో.. ఇదిగో ఇలా గాల్లోకి ఎగిరి డాన్సులు చేసినట్టు మన కళ్లను మాయ చేసేశాయన్నమాట. ఇంతకీ ఇంతటి ట్రిక్ చేసేసిన ఆ ఫొటోగ్రాఫర్ ఎవరో తెలుసా.. స్నాపర్ క్రిస్ కింగ్. వయసు 46 ఏళ్లు. ఊరు బ్రిటన్‌లోని మిల్టన్ కీన్స్. అతడి ప్రతిభకు ఈ ఫొటోలు నిజంగా 'అద్దం' పట్టేవే!!

చైనా జనం పెరుగుతరు..
తగ్గుతరు!

- 2029 నాటికి 144 కోట్లు.. ఆ తర్వాత తగ్గుదల
- 2065 నాటికి 117 కోట్లకు పడిపోయే ముప్పు: చైనా నివేదిక

ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం చైనా. ఇప్పుడక్కడ దాదాపు 138.64 కోట్ల మంది ఉన్నారు. అలాంటి దేశం జనాభా హెచ్చుతగ్గులతో సతమతమయ్యే సూచనలున్నాయట. ఓ దశాబ్దం పాటు



జనాభా పెరిగినా.. ఆ తర్వాత భారీగా పడిపోతుందట. చైనా అకాడమీ ఆఫ్ సోషల్ సైన్సెస్ విడుదల చేసిన 'గ్రీన్ బుక్ ఆఫ్ పాపులేషన్ అండ్ లేబర్' అనే నివేదికలో ప్రభుత్వ నిపుణులు ఈ హెచ్చరికలు చేశారు. 2029 నాటికి 144.2 కోట్లకు జనాభా పెరుగుతుందని నివేదికలో చెప్పినా.. అక్కడి నుంచే కొన్నేళ్ల పాటు జనాభా తగ్గుముఖం పడుతుందని పేర్కొన్నారు. 2050 నాటికి 136 కోట్లకు పడిపోతుందని తెలిపారు. ఇటు పనిచేసే వాళ్ల సంఖ్య కూడా 20 కోట్లు తగ్గుతుందని చెప్పారు. సంతాన రేటు ఎప్పటిలాగానే కొనసాగితే 2065 నాటికి జనాభా మరింత పడిపోయి 117 కోట్లకు పరిమితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2060 వరకూ రిటైర్ అయ్యే వాళ్ల సంఖ్య కొండంత అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైతే పనిచేసేటోళ్ల సంఖ్య స్థిరంగా ఉన్నప్పటికీ వయసైపోతున్న వారి వల్ల సామాజిక ఆర్థికాభివృద్ధిపై పెను ప్రభావం పడే అవకాశముందని హెచ్చరించారు. ప్రత్యేకించి సంతాన సాఫల్య రేటు పడిపోతే ఆ ప్రభావం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు. పెరిగే జనాభా, వయసు మీద పడిపోతున్న వారి సంఖ్య, తగ్గుతున్న కార్మికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జనాభా పెరుగుదలను అరికట్టేందుకు ప్రవేశపెట్టిన వివాదాస్పద 'ఒకే బిడ్డ' నిబంధనను 2016లో చైనా ప్రభుత్వం సడలించింది. ఇద్దరు పిల్లల్ని కనేందుకు అంగీకరించింది. అయినా కూడా 2017లో జనన రేటు 3.5 శాతం పడిపోయింది.

చైనా యాప్‌ల దండయాత్ర
100లో 44 యాప్‌లు ఆ దేశానివే

- షేరిట్, యూసీ బ్రౌజర్ సహా ఇండియాలో ఎన్నెన్నో యాప్‌లు
- డేటింగ్, గేమింగ్ యాప్‌లూ ఎక్కువే.. ఫ్యాక్టర్‌డైలీ రిపోర్ట్



ఒకప్పుడు బ్లూటూత్‌తో ఫైల్స్ ఒక ఫోన్ నుంచి మరో ఫోన్‌కు పంపేవాళ్లం. కానీ, డెడ్ స్లో ఉండేదది. అప్పుడే కొత్తకొత్తగా ఎంటరైంది 'షేర్ఇట్'. జస్ట్ క్షణాల్లో ఒక ఫోన్ నుంచి మరో ఫోన్‌కు ఫైల్‌ను షేర్ చేసేది. అలా అలా అది ఆండ్రాయిడ్ ఫోన్లలో చేరిపోయింది. ఓ రకంగా చెప్పాలంటే 'ఆక్రమించేసింది'. ఇది చైనా యాప్. ఆ ఒక్కటే కాదు.. మన మార్కెట్‌ను చైనా యాప్‌లు దండెత్తాయి. ఫ్యాక్టర్ డైలీ అనే సంస్థ రిపోర్ట్ ప్రకారం మన దగ్గర వాడే టాప్ 100 యాప్‌లలో 44 యాప్‌లు చైనా వాళ్లవే. దేశంలోని ఫోన్ల మార్కెట్‌లో సగం చైనాదే అంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. దాదాపు సగం మార్కెట్‌ను ఇప్పుడు షావోమి శాసిస్తోంది. ఒప్పో కూడా దానికి దీటుగా ఫోన్లు తెస్తోంది. ఆ ఫోన్లు, వేరే ఫోన్లు అన్న తేడా లేకుండా చైనా యాప్‌లు చిన్నచిన్నగా చొరబడిపోతున్నాయి.

వాటిని దాటేసిన షావోమి

కొన్నేళ్ల దాకా ఇండియాలో ఫోన్ల మార్కెట్‌ను నోకియా ఏలేసింది. స్మార్ట్‌యుగం మొదలయ్యాక ఆ ప్లేస్‌ను చిన్నచిన్నగా శాంసంగ్ ఆక్రమించేసింది. ఇప్పటికీ శాంసంగ్‌కు ఇండియా మంచి మార్కెట్టే. అయినా కూడా దాన్ని వెనక్కు నెట్టేసి మరీ షావోమి తన ఉనికిని చాటుకుంది. మొబైల్ ఫోన్ల మార్కెట్‌ను ఒడిసిపట్టేసింది. అందుకోసం స్థానిక కంపెనీల సహకారం, సేవలు తీసుకుంటూ దాదాపు ఫోన్లలో సగం మార్కెట్‌ను చేజిక్కించుకుంది. 'స్థానికం' అన్న మాటతోనే చైనా యాప్ కంపెనీలు మనకు తగినట్టుగా యాప్‌లను రూపొందిస్తున్నాయి. తయారీ దేశీయంగానే అని చెబుతున్నా వాటి వెనక ఉంటున్నది మాత్రం ఆ కంపెనీలే. మన భాషలు, స్థానిక సమాచారానికి అనుగుణంగా యాప్‌లను అభివృద్ధి చేస్తున్నాయి.

ఆ యాప్‌లేంటంటే..

లిస్ట్‌లో చెప్పుకుంటే ముందొచ్చేది అలీబాబా యూసీ బ్రౌజర్. ప్రతి యాండ్రాయిడ్ ఫోన్, చైనా ఫోన్లలో తయారీతోపాటు వచ్చేస్తోందది. బైట్‌డాన్స్, టిక్‌టోక్, హెలో, న్యూస్‌డాగ్, డేటింగ్ యాప్ బిగో, వి చాట్ సహా ఎన్నెన్నో గేమింగ్ యాప్‌లు ఎక్కువగా వినియోగంలో ఉన్నాయి. ఇటీవలి కాలంలోనే చైనా యాప్‌ల దండయాత్ర పెరిగిపోయిందని ఫ్యాక్టర్‌డైలీ చెబుతోంది. ఇంతకుముందు చాలా తక్కువగా వాడినా ఒక్క ఏడాదిలోనే రెట్టింపయ్యాయని అంటోంది. అంతేగాకుండా మంచిగా నడుస్తాయనుకున్న ఇండియన్ స్టార్టప్‌లలో చైనా పెద్ద కంపెనీలైన అలీబాబా, టెన్సెంట్‌లు పెట్టుబడులు పెడుతూ మార్కెట్‌లో తమకంటూ ఓ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసుకుంటున్నాయన్నది నిపుణులు చెబుతున్నమాట. 2015లోనే స్నాప్‌డీల్, పేటీఎం వంటి ఆన్‌లైన్ సంస్థల్లో వందల కోట్ల పెట్టుబడులు పెట్టింది అలీబాబా. అప్పటి నుంచి



పరోక్షంగా ఇండియన్ మార్కెట్‌లోకి అలీబాబా అడుగుపెట్టేసింది. 2017లో గానా, స్విగ్గీ, బైజూస్, ఓలా వంటి సంస్థల్లో టెన్సెంట్ వాటా తీసుకుంది. గత ఏడాదే రెండు సంస్థలూ క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసులనూ ప్రారంభించాయి.

మనిషికి 256 ఎముకలు
పోలీసులకు టీఆర్టీ టాపర్ తప్పుడు ఆన్సర్

మనిషికి ఎన్ని ఎముకలుంటాయ్? దానికి కరెక్ట్ ఆన్సర్ 206. కానీ, ఇదిగో ఈ టీఆర్టీ టాపర్ లెక్క మాత్రం వేరేగా ఉంది. ఎన్ని ఎముకలుంటాయయా అని అడిగితే.. 256 అని జవాబు చెప్పాడు. కనీసం నాలుగో తరగతి లెక్కలూ చేయడానికి ఆపసోపాలు పడ్డాడు. ఆ ఉద్ధండుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఆశిష్ కుమార్. 2015లో టీఆర్టీ టాపర్. 2018లో ఉద్యోగంలో చేరాడు. అయితే డిగ్రీ లేని ఆశిష్, తాను బీపీఈడీ చేసినట్లుగా సర్టిఫికెట్లను చూపాడు. ఇటీవల కొందరు నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చి ప్రైమరీ స్కూళ్లలో ఉద్యోగాల్లో చేరారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆశిష్ వివరాల కోసం



యూనివర్సిటీలో సంప్రదించారు. అక్కడ ఎలాంటి సమాచారం లేకపోవడంతో విచారణకు రావాలని ఆశిష్‌కు ఐదు సార్లు నోటీసులు పంపారు. తనవి నిజమైన సర్టిఫికెట్లని ఆశిష్ వాదిస్తే టెస్టు పెట్టాలని ఆఫీసర్లు నిర్ణయించారు. మనిషిలో ఎన్ని ఎముకలు ఉంటాయని అడగ్గా 256 అని చెప్పాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

మహిళా రీసెర్చర్లు పెరగాలి

- ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి

బెంగళూరు: దేశంలో మహిళా రీసెర్చర్ల సంఖ్య పెరగాలని, అందుకోసం వాళ్లకంటూ పని వాతావరణాన్ని కల్పించాలని ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి చెప్పారు. పరిశోధనల్లో నాణ్యతను మహిళలు పెంచుతారనడంలో ఏమాత్రం సందేహం లేదని చెప్పారు. ''దేశంలో ఏదైనా యూనివర్సిటీ కాన్వొకేషన్‌కు వెళ్లినపుడు ఎక్కువగా మహిళలే బంగారు పతకాలు తీసుకోవడం చూశాను. కాబట్టి మహిళా రీసెర్చర్లు, సైంటిస్టులకు పెళ్లైన తర్వాత కూడా పరిశోధనలు



చేసుకునే వాతావరణం కల్పించాలి'' అని అన్నారు. శనివారం బెంగళూరులో ఇన్ఫోసిస్ అవార్డు ప్రదానోత్సవానికి హాజరైన మూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ''మనం ఇంకా తొలి దశలోనే ఉన్నాం. ముమ్ముందు ప్రపంచంలోని టాప్ 1 శాతం రీసర్చర్లలో ఇండియన్ల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నా. దీనికి ఇన్ఫోసిస్ ప్రైజ్ తోడ్పాటునందిస్తుందనడంలో సందేహం లేదు'' అని అన్నారు. ఇన్ఫోసిస్ అవార్డు గెలుచుకున్న వాళ్లలో ఎంతో మంది నోబెల్ ప్రైజ్‌తో సమానమైన అవార్డులు గెలుచుకున్నారని చెప్పారు. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ఏడాదికోసారి ఇచ్చే ఈ ప్రైజ్‌ను సైంటిస్టులు, రీసెర్చర్లు, ఇంజనీర్లు, సోషల్ సైంటిస్టులకు ఇస్తారు. బంగారు పతకంతో పాటు రూ.70 లక్షలు ఇస్తారు. పరిశోధన రంగంలో దేశంలో ఎక్కువ నగదు ప్రోత్సాహకం ఇచ్చే అవార్డు ఇదే. ఈ ఏడాది సైన్స్ అండ్ రీసెర్చ్ కేటగిరీలో ఆరుగురు ప్రముఖ ప్రొఫెసర్లను అవార్డుకు ఎంపిక చేశారు. ఇతర దేశాల్లోని రీసెర్చర్లతో మన వాళ్లు చర్చలు జరిపేలా దేశంలోని రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లు చొరవ తీసుకోవాలని మూర్తి సూచించారు.

నకిలీ మకిలికి జానపదం మందు

ఎండాకాలంలో రాత్రిళ్లు ఇంట్లో పడుకోవాలంటే జనం హడలిపోతారు. ఆరు బయట మంచాలేసుకుని హాయిగా కునుకు తీస్తారు. అలాంటిది ఓ రోజు గద్వాల్ జిల్లాలోని గ్రామీణ ప్రజలు వీధుల్లో నిద్రపోవడం మానేశారు. రాత్రి ఎనిమిదైతే చాలు ఇళ్లలోంచి బయటకు రావాలంటే జంకారు. అంతర్రాష్ట్ర ముఠాలు పిల్లల్ని ఎత్తుకెళ్లి, చంపి, అవయవాలను అమ్ముకుంటున్నారన్న ఓ నకిలీ వార్త తెలంగాణ గ్రామీణ ప్రజానీకాన్ని హడలెత్తించడమే ఇందుకు కారణం. వాట్సాప్ తదిరత సోషల్‌మీడియా యాప్స్‌లో పార్థీ గ్యాంగ్ తాలూకూ ఫేక్ ఫొటోలు హల్‌చల్ చేయడం జనాన్ని మరింత భయపెట్టింది. దీంతో అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా చితక్కొట్టేశారు.

దీంతో రంగంలోకి దిగిన నాటి గద్వాల్ జిల్లా ఎస్పీ రెమా రాజేశ్వరి సోషల్‌మీడియా నకిలీ వార్తల సమస్యకు, పాతతరం పాటల మందేశారు. పల్లె జనాల బుర్రకు వేగంగా ఎక్కే జానపద గేయాల ద్వారా జాగృతం చేసి నకిలీ వార్తలను తరిమికొట్టారు. 2018 మార్చి నెలలో ఉపద్రవంలా పరిణమించిన నకిలీ వార్తలపై పోరాడేందుకు రాజేశ్వరి గద్వాల్ జిల్లాలోని ప్రతి గ్రామానికి కానిస్టేబుళ్లను పంపారు. వారు నకిలీ వార్తల గురించి ప్రజలతో చర్చించారు. వాట్సాప్‌లో పార్థీ గ్యాంగ్ అంటూ వస్తున్న ఫొటోలను నమ్మొద్దని, నకిలీ వీడియోలను ఎవరికీ పంపొద్దని సూచించారు. దీని వల్ల గద్వాల్ జిల్లాలోని మారుమూల గ్రామాల్లోని ప్రజలకు సైతం సోషల్‌మీడియా ఎంత ప్రమాదకరం అవుతుందో తెలిసొచ్చింది.

కథలోనే ఉందంతా!

గ్రామీణ ప్రజలకు త్వరగా చేరాలంటే ఉన్న ఏకైక మార్గం 'కథ' అని రాజేశ్వరి గుర్తించారు. ''ఏ విషయాన్నైనా కథలా చెబితే సులువుగా అర్థమవుతుంది. ఎక్కువ కాలం గుర్తుంటుంది'' అని రాజేశ్వరి అంటారు. 2012 నుంచీ ఆమె ఏ కార్యక్రమం చేపట్టినా కథల ద్వారానే అవగాహన కల్పించడం మొదలుపెట్టారు. అలానే తాను హెడ్‌గా ఉన్న జిల్లాలో ఫేక్ న్యూస్‌ను ఎదుర్కొవడానికి జానపదాన్ని ఎన్నుకుని ఘన విజయం సాధించారు. నిరక్షరాస్యుల మెదళ్లలో ఆలోచన రేకెత్తించారు. సాధారణ ప్రజల్ని కూర్చొబెట్టి టెక్నాలజీ వల్ల వచ్చే సమస్యల్ని వివరిస్తే వారికి ఏమీ అర్థం కాదనే విషయాన్ని గుర్తించిన రాజేశ్వరి జానపదానికి ప్రాధాన్యమిచ్చారు.





జానపద కళాకారులు, పోలీసులతో అవగాహన కల్పించేందుకు వెళుతున్న ఎస్పీ రెమా రాజేశ్వరి (ఫైల్)

- కొత్త తరం సమస్యను తీర్చిన పాత తరం గేయాలు
- జోగులాంబ గద్వాల్ ప్రజల్లో పార్థీ గ్యాంగ్ భయాన్ని తరిమేసిన ఐపీఎస్ ఆఫీసర్

మూడు దశల్లో ఫేక్‌న్యూస్‌పై యుద్ధం


45 రోజులపాటు మూడు దశల్లో జిల్లా వ్యాప్తంగా ఫేక్ న్యూస్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. తొలి దశలో ఫేక్ వార్తలను గుర్తించడంపై మిగతా పోలీస్ ఆఫీసర్లకు రాజేశ్వరి అవగాహన కల్పించారు. సాధారణ ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలో నేర్పించారు. ఆ తర్వాత రెండు వారాల పాటు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పోలీస్ టీమ్‌లు రెండు వారాల పాటు పర్యటించి నకిలీ వార్తలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాయి. రెండో దశలో దప్పు కళాకారులకు పోలీసుల తరపున నకిలీ న్యూస్‌పై దండోరా వేసే ట్రైనింగ్ ఇచ్చారు. ప్రజలు గుమిగూడేలా పోలీసులతో పాటు ఊళ్లలోకి వెళ్లే కళాకారులు దప్పు చాటింపు వేయించేవారు. ఆ తర్వాత అసలు విషయాన్ని చెప్పేవారు. జిల్లాలోని అన్ని గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు రాజేశ్వరి స్వయంగా ఫేక్ న్యూస్ గురించి ట్రైనింగ్ ఇచ్చారు. మూడో దశలో నకిలీ వార్తలపై పాటలు రాశారు. వాటిని జానపద కళాకారులు పాడి అవగాహన కల్పించారు. స్థానిక ప్రజల సంస్కృతికి అనుగుణంగా పాటలు ఉండేలా జాగ్రత్త పడ్డారు. కాబట్టే అవి తొందరగా జనానికి చేరాయి.

> తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పునాదుల్లోనే జానపద గీతాలున్నాయి. దీనికి ప్రజాపాటగా గుర్తింపు ఉంది. ఒక్కో స్కిట్‌లో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఉంటారు. స్టేజ్‌పైకి ఎక్కి తమ గాత్రం, చేతల ద్వారా ప్రజలకు చేరాలనుకున్న విషయాన్ని సూటిగా వివరిస్తారు. ఒక్కో స్కిట్ కొద్ది నిమిషాల నుంచి కొన్ని గంటల వరకూ సాగుతుంది. ప్రస్తుతం కొన్ని గ్రూపులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి ప్రదర్శనలు ఇస్తున్నాయి. సహజంగా రామాయణం, మహాభారత గాథలను ఎక్కువగా జానపదాల గేయాల ద్వారా వివరిస్తుంటారు.
>
> **దెంచనాల శ్రీనివాస్, డైరెక్టర్, జానపదం ట్రావెలింగద్ మోడరన్ థియేటర్ రిపెర్టరీ**



టేబుల్‌కు తగిలిస్తే సరి..

ఇంట్లో టేబుల్‌పై చోటును కంప్యూటర్ మానిటర్ చాలా తినేస్తుంది. ఫ్లాట్ ఎల్ఈడీలు వచ్చినా దానికీ స్పేస్ చాలానే కావాలి. ఆ ఇరుకిరుకులో పనిచేయాలంటే చిరాకొస్తుంటుంది చాలా మందికి. మరి, టేబుల్ ఫ్రీగా ఉంటూ ఆ స్పేస్‌ను కావాల్సినట్టుగా వాడుకుంటే బాగుంటుంది కదా. ఆ ఆలోచనతోనే శాంసంగ్ ఈ 'స్పేస్ మానిటర్'ను తయారు చేసింది. దీన్ని టేబుల్ మీద పెట్టాల్సిన అవసరం లేదు.. టేబుల్ ఎడ్జ్‌కు జస్ట్ తగిలిస్తే చాలు. ఆ బల్లను విచ్చలవిడిగా వాడేసుకోవచ్చు. ఏది కావాలంటే అది పెట్టుకోవచ్చు. ఫైల్స్ సర్దుకోవచ్చు. ఫ్రీగా పనిచేసుకోవచ్చు. తగిలించుకోవడమే కాదు.. మానిటర్‌ను కావాలంటే కిందకు జరిపేసుకోవచ్చు. అంటే మన చూపుకు తగినట్టు అడ్జస్ట్ చేసుకోవచ్చన్నమాట. 45 డిగ్రీల కోణంలో టేబుల్‌కు ఆనేలా కూడా పెట్టుకోవచ్చు. టేబుల్‌కు తగిలించుకోవడమే కాదు.. అవసరమైతే ఎంచక్కా గోడకూ పెట్టేసుకోవచ్చు. దీనికి సంబంధించి రెండు మోడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతోంది శాంసంగ్. 27 అంగుళాల క్యూహెచ్‌డీ (2560/1440) ఒక మోడల్ కాగా, 32 అంగుళాల 4కే వన్ (3840/2160) మరో మోడల్. 27 అంగుళాల మానిటర్‌తో పోలిస్తే 32 ఇంచుల మానిటర్ రిఫ్రెషింగ్ రేట్ చాలా తక్కువ. దానిది 144 హెర్ట్జ్ అయితే, పెద్ద దానిది జస్ట్ 60 హెర్ట్జ్‌లే. దీని ధర సుమారు రూ.34,700. అమెరికాలో నిర్వహిస్తున్న కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో దీన్ని ప్రదర్శనకు పెట్టారు.



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.